

అనంత జనశక్తి

జనం కోసమే మా అక్షరం

27.11.2026
శుక్రవారం | విజయవాడ
సంపుటి : 01 | సంచిక: 24
పేజీలు : 08 | వెల: రూ.5

AJS
అనంత జనశక్తి
జనం కోసమే మా అక్షరం

PUBLISHED BY ANANTAPUR, KADAPA, CHITTOR, VISAKHAPATNAM, SRIKAKULAM, EALLURU, TIRUPATHI, ONGOLE, VIJAYAWADA, NELLORE, PRAKASHAM, GUNTUR, KURNOOL.

ఓటును ఆయుధంగా వాడుకోవాలి

- ఉండవల్లిలో సీఎం చంద్రబాబు ఓటు
- ఓటేస్తేనే ప్రశ్నించే హక్కు
- రాజ్యాంగ దినోత్సవం ప్రత్యేకత
- ఓటును ఆయుధంగా వాడుకోవాలి
- ప్రజలే ముందుకు రావాలి


2లో..

న్యూఢిల్లీ, నవంబర్ 26, అనంత జనశక్తి న్యూస్

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉండవల్లిలో కుటుంబ సభ్యులతో కలిసి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ఉండవల్లిలోని గాదె రామయ్య సీతారామయ్య పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఆయన ఓటు వేశారు. ఓటు వేసిన అనంతరం మీడియాతో మాట్లాడిన సీఎం, ప్రతి పౌరుడు తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

భారత ప్రజాస్వామ్యానికి రాజ్యాంగం అమూల్యమైన సంపద

- ప్రధాని మోడీ కీలక వ్యాఖ్యలు
- రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా
- రాజ్యాంగ నిర్మాతలకు ఘన నివాళి
- రాజ్యాంగ రూపకల్పనలో కీలక పాత్ర
- వికసిత్ భారత్ నిర్మించాలనే లక్ష్య సాధనలో

న్యూఢిల్లీ, నవంబర్ 26, అనంత జనశక్తి న్యూస్

భారత రాజ్యాంగం దేశ ప్రజాస్వామ్యానికి అమూల్యమైన వారసత్వమని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పేర్కొన్నారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా గురువారం దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. రాజ్యాంగ రూపకల్పనలో కీలక పాత్ర పోషించిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌తో పాటు రాజ్యాంగ సభ సభ్యుల సేవలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. సోషల్ మీడియా వేదిక ఎక్స్‌లో ప్రధాని మోడీ ఒక సందేశాన్ని పోస్టు చేశారు. రాజ్యాంగం భారత ప్రజాస్వామ్యానికి లభించిన అమూల్యమైన సంపద అని, అభివృద్ధి చెందిన భారతదేశం (వికసిత్ భారత్) నిర్మించాలనే లక్ష్య సాధనలో ఇది నిరంతరం మార్గనిర్దేశం చేస్తుందని పేర్కొన్నారు. 2లో..



నంద్యాలలో రాజకీయ ఉద్రిక్తత

- టీడీపీ, వైసీపీ వర్గాల ఘర్షణ
- పరస్పరం కారం నీళ్ల దాడులు
- వాగ్వాదం, తోపులాటతో కలకలం
- ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ వాహనంపై దాడి


2లో..

నంద్యాల, నవంబర్ 26, అనంత జనశక్తి న్యూస్

నంద్యాలలో తెలుగుదేశం పార్టీ (టీడీపీ), వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ (వైసీపీ) వర్గాల మధ్య తీవ్ర ఘర్షణ చోటుచేసుకుంది. రాజకీయ ఉద్రిక్తతల నేపథ్యంలో ఇరు వర్గాల కార్యకర్తలు ఒకరిపై ఒకరు కారం నీళ్లు చల్లుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఘటనకు సంబంధించిన దృశ్యాలు బయటకు రావడంతో స్థానికంగా కలకలం రేగింది.

తొడ కొట్టి సవాల్ విసిరిన సోము వీర్రాజు

- పోలింగ్ బూత్ దగ్గర ఘటన
- వైసీపీ నాయకులపై ఫైర్
- వైసీపీ నేతల తీరుపై మండిపడ్డారు
- వైసీపీ నేత, సోము వీర్రాజు మధ్య మాటల యుద్ధం


2లో..

శ్రీవారికి 121 కిలోల బంగారం 46 రకాల స్వర్ణాభరణాలు

- వర్ధమాన్ జైన్ అనే భక్తుడు
- సీఎం చంద్రబాబునాయుడు చేతుల మీదుగా
- టీటీడీ ఈవోకు అందజేత
- 46 రకాల ఆభరణాలు
- 2019 నుంచి భారీ విరాళాలు
- హెల్త్‌కేర్ రంగంలో విశేష అనుభవం
- విద్య, వైద్య రంగాల్లో సేవలు



తిరుమల, నవంబర్ 26, అనంత జనశక్తి న్యూస్

ప్రతిరోజూ స్వామివారిని 121 కిలోల బంగారు ఆభరణాలతో అలంకరిస్తారని సీఎం తెలిపారు. ఈ అపూర్వ ఘట్టంలో తాను భాగస్వామిని కావడం తన అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. బంగారు ఆభరణాలతో పాటు విలువైన వజ్రాలు కూడా ఇందులో ఉన్నాయని వివరించారు. మరెక్కడా దొరకనటువంటి దివ్యానూభూతి తిరుమల క్షేత్రంలోనే లభిస్తుందని వెల్లడించారు. రూ.200 కోట్ల విలువైన ఆభరణాలను తిరుమలేశునికి విరాళంగా ఇవ్వడం అపూర్వమైన సంఘటన అని చెప్పుకొచ్చారు. స్వామివారిపై భక్తి, విశ్వాసాలతో జైన్ దంపతులు ఈ బంగారు ఆభరణాలను ఇవ్వడానికి ముందుకు వచ్చారని కొనియాడారు.

శ్రీవారిపై భక్తి, విశ్వాసం పెరుగుతూనే ఉన్నాయి..

శ్రీవారిని మొక్కుకున్న భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో విలువైన కానుకలను సమర్పిస్తారని ముఖ్యమంత్రి వెల్లడించారు. అలనాడు శ్రీకృష్ణ దేవరాయల నుంచి ఇప్పుడు జైన్ దంపతుల వరకు స్వామివారిపై భక్తి, విశ్వాసం పెరుగుతూనే ఉన్నాయని తెలిపారు. పల్లవ, చోళ, పాండ్యా రాజులు తిరుమల వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని అభివృద్ధి చేశారని వివరించారు. మైసూర్, మరాఠా రాజులు అనేక ఆభరణాలు, కానుకలు, ఆస్తులను శ్రీనివాసుడికి ఇచ్చారని ప్రస్తావించారు.

శ్రీకృష్ణదేవరాయలు హిందూమతాన్ని పరిరక్షించారు..

విజయనగర సామ్రాజ్యాధినేత శ్రీకృష్ణదేవరాయలు హిందూ మతాన్ని పరిరక్షించారని సీఎం కొనియాడారు. శ్రీకృష్ణ దేవరాయలు తిరుమల వేంకటేశ్వర స్వామికి అనేక ఆభరణాలను కానుకగా అందించారని గుర్తుచేశారు. ఆయన అందించిన రత్నకిరీటం, పీతాంబరానికి ఎంతో చరిత్ర ఉందని ఉద్ఘాటించారు. పూర్వకాలంలో దేవాలయాల మీద చాలా దాడులు జరిగాయని తెలిపారు. కానీ తిరుమలేశుని దేవాలయం విషయంలో ఎవ్వరూ ఆ సాహసానికి ఒడిగట్టలేదని అన్నారు. రోజురోజుకూ శ్రీవారి భక్తుల విశ్వాసాన్ని పెంపొందించడానికి చాలామంది కృషి చేశారని పేర్కొన్నారు.

5వేల దేవాలయాల నిర్మాణానికి శ్రీకారం చుట్టాం..

ఆధ్యాత్మికత, ధర్మం మనిషికి ఎంతో సంతోషానిస్తాయని ముఖ్యమంత్రి తెలిపారు. దేశవ్యాప్తంగా 5వేల దేవాలయాల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని వెల్లడించారు. దేశంలోని అన్ని రాష్ట్రాల రాజధానుల్లో వేంకటేశ్వరస్వామి ఆలయాలను ఏర్పాటు చేస్తామని చెప్పుకొచ్చారు. ఎక్కడా లభించని దివ్యానుభూతి తిరుమలలో దొరుకుతుందని అన్నారు. 6లో..

అమితాబ్ ఇంటికి మరోసారి బాంబు బెదిరింపు


2లో..

సామాన్య ఓటర్లతో కలిసి ఓటేసిన పవన్ కళ్యాణ్

- ప్రజలకు కీలక సందేశం
- మంగళగిరిలో పవన్ కళ్యాణ్ ఓటు
- సామాన్య ఓటర్లతో కలిసి పోలింగ్
- రాజ్యాంగ దినోత్సవ శుభాకాంక్షలు 2లో..



రాయలసీమ లిఫ్ట్ కొత్త ప్రాజెక్ట్ కాదు

- కాంగ్రెస్ తో చంద్రబాబువి దోస్తీ రాజకీయాలు
- మాజీ సీఎం వైఎస్ జగన్ స్పష్టం
- రాజకీయాల కోసం ప్రాజెక్టు పనులు ఆపేశారు

అమరావతి, నవంబర్ 26, అనంత జనశక్తి న్యూస్

కృష్ణా జలాలు, రాయలసీమ లిఫ్ట్ స్కీం చుట్టూ రాజకీయ వివాదాలు ముదురుతున్నాయి. తాజా పరిస్థితులపై మాజీ సీఎం, వైసీపీ అధినేత జగన్ స్పందించారు. తెలంగాణలో పార్టీల మధ్య సాగుతున్న మాటల యుద్ధం అసలు వాస్తవాలను పక్కదారి పట్టిస్తోందని స్పష్టం చేశారు. ఈ అంశంపై స్పష్టత ఇవ్వాల్సిన చంద్రబాబు, కాంగ్రెస్‌తో రాజకీయ దోస్తీ కోసం మౌనంగా ఉంటున్నారని తీవ్రంగా ఆరోపించారు.

రాయలసీమ లిఫ్ట్ కొత్త ప్రాజెక్ట్ కాదు - వైఎస్ జగన్

రాయలసీమ లిఫ్ట్ స్కీం కొత్త ప్రాజెక్టు కాదని జగన్ తేల్చిచెప్పారు. ఈ పథకం వల్ల కొత్తగా నీటి కేటాయింపులు, కొత్త కాలువలు, అదనపు రిజర్వాయర్లు లేదా కొత్త ఆయకట్టు ఏవీ లేవని వివరించారు. కృష్ణానదిలో లభించే అవే నీటిని, అవే కేటాయింపుల మేరకు, పోతిరెడ్డిపాడు ద్వారా అవే కాలువల్లోకి తరలించేందుకు రూపొందించిన బీమా పథకం వంటిదని తెలిపారు. 2లో..

11 రోజుల ఉత్కంఠకు తెర

ఆ మత్స్యకారులు సేఫ్


2లో..

అమరావతి, నవంబర్ 26, అనంత జనశక్తి న్యూస్

ఎట్టకేలకు 11 రోజుల ఉత్కంఠకు తెర పడింది. కాకినాడ జిల్లాలో వేటకు వెళ్లిన ఏడుగురు మత్స్యకారులు సురక్షితంగా ఉన్నారు. దీంతో వారి కుటుంబ సభ్యుల్లో ఆనందం వెల్లివిరిసింది. ఇన్ని రోజులు వారి ఆచూకి తెలియక అందరూ ఆందోళనకు గురయ్యారు.

అలా వేటకు.. వెళ్లి..

కాకినాడ జిల్లా... పిఠాపురం నియోజక వర్గం యు.కొత్తపల్లి మండలంలోని సుబ్బంపేట గ్రామానికి చెందిన ఏడుగురు మత్స్యకారులు ఈ నెల 4వ తేదీన ఇమ్మాన్యుయెల్ అనే బోటులో వేటకు వెళ్లారు.

వాళ్లు ఎప్పుడైనా కొట్టుకున్నారా?

- చంద్రబాబు, జగన్ చొక్కాలు పట్టుకుని?
- మరి మీకు అవసరమా?': హైపర్ ఆది
- జనసైనికులకు, ఇతర పార్టీల కార్యకర్తలకు క్లాస్ 6లో..

పంచాయతీ ఎన్నికల్లో 77.65 శాతం పోలింగ్

- మూడు చోట్ల రీపోలింగ్
- మొత్తం 3,189 సర్పంచ్, 25,057 వార్డు సభ్యులు
- చిత్తూరు జిల్లాలో 83.37 శాతం పోలింగ్ నమోదుకాగా
- అత్యల్పంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో 58.85 శాతం 6లో..



అమరావతి, నవంబర్ 26, అనంత జనశక్తి న్యూస్

ఆంధ్రప్రదేశ్‌లో పంచాయతీ ఎన్నికల పోలింగ్‌కు సంబంధించిన తుది నివేదిక విడుదలైంది. మొత్తం 3,189 సర్పంచ్, 25,057 వార్డు సభ్యుల స్థానాలకు నవంబర్‌లో నిర్వహించిన పోలింగ్‌లో సగటున 77.65 శాతం ఓటింగ్ నమోదైంది. జిల్లాల వారీగా చూస్తే అత్యధికంగా చిత్తూరు జిల్లాలో 83.37 శాతం పోలింగ్ నమోదుకాగా, అత్యల్పంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో 58.85 శాతం ఓట్లు పోలయ్యాయి.



ఓటును ఆయుధంగా వాడుకోవాలి

(మొదటి పేజీ తరువాయి)

ఓటు వేస్తేనే ప్రశ్నించే హక్కు.. ప్రజలే ముందుకు రావాలి

గ్రామాలు, మున్సిపాలిటీలు, పట్టణ ప్రాంతాల్లో జరిగే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు వేయాలని చంద్రబాబు సూచించారు. ఓటు హక్కును వినియోగించుకున్నప్పుడే ప్రభుత్వాన్ని లేదా వ్యవస్థలను ప్రశ్నించే హక్కు లభిస్తుందని అన్నారు. ప్రపంచంలో అత్యధిక మంది ఓటింగ్‌లో పాల్గొనే దేశం భారతదేశమేనని గుర్తుచేసిన ఆయన, బతికున్న ప్రతి ఒక్కరూ ఓటు వేయాలని, ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి ప్రజలే ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

రాజ్యాంగ దినోత్సవం, పోలింగ్ కలిసి రావడం విశేషం

ఇవాళ రాజ్యాంగ దినోత్సవం కావడం, అదే రోజున పోలింగ్ కూడా జరగడం ప్రత్యేక సందర్భమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాజ్యాంగాన్ని రచించి భారతదేశ భవిష్యత్తుకు దిశ, దశ నిర్దేశించారని కొనియాడారు. ప్రాథమిక హక్కులు, విధులను రాజ్యాంగం స్పష్టంగా పొందుపరిచిందని చెప్పారు.

అందరికీ సమాన హక్కు.. ఓటు ఒక ఆయుధం

పేద, ధనిక, మహిళ, పురుషుడనే తేడా లేకుండా అందరికీ సమానంగా ఓటు హక్కు కల్పించారని చంద్రబాబు అన్నారు. ఓటు హక్కు అనేది ఒక ఆయుధమని అంబేద్కర్ చెప్పిన మాటలను గుర్తుచేస్తూ, ప్రతి ఒక్కరూ ఓటును ఆయుధంగా ఉపయోగించుకుని ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

భారత ప్రజాస్వామ్యానికి రాజ్యాంగం అమూల్యమైన సంపద



(మొదటి పేజీ తరువాయి)

ఈ పవిత్రమైన రోజున బాబాసాహెబ్ అంబేద్కర్‌తో పాటు రాజ్యాంగ సభలోని గొప్ప వ్యక్తులందరికీ గౌరవపూర్వక నివాళులర్పిస్తున్నట్లు తెలిపారు.

రాజ్యాంగ నిర్మాతలకు ఘన నివాళి

రాజ్యాంగ దినోత్సవం రాజ్యాంగ నిర్మాతలను స్మరించుకోవడంతో పాటు, రాజ్యాంగంలోని విలువలను కాపాడేందుకు మన నిబద్ధతను మరోసారి చాటుకునే సందర్భమని ప్రధాని అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయడంలో రాజ్యాంగ స్ఫూర్తి ఎంతో కీలకమని పేర్కొన్నారు.

నవంబర్ 26న రాజ్యాంగ దినోత్సవం

భారత రాజ్యాంగాన్ని రాజ్యాంగ సభ 1949 నవంబర్ 26న ఆమోదించింది. అయితే, 1950 జనవరి 26 నుంచి రాజ్యాంగం అమల్లోకి వచ్చింది. రాజ్యాంగ రూపకల్పనకు రెండు సంవత్సరాల 11 నెలల 18 రోజుల సమయం పట్టింది. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 125వ జయంతి సంవత్సరాన్ని పురస్కరించుకుని భారత ప్రభుత్వం 2015 నవంబర్ 26న తొలిసారిగా రాజ్యాంగ దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించింది.

రాజ్యాంగ దినోత్సవం ప్రాముఖ్యత

దేశ పౌరుల్లో రాజ్యాంగ విలువలు, ప్రాథమిక హక్కులు, విధుల పట్ల అవగాహన పెంపొందించడం ఈ దినోత్సవ ప్రధాన ఉద్దేశం. భారత రాజ్యాంగ రూపకల్పనలో విశేష కృషి చేసిన మహనీయులను, ముఖ్యంగా రాజ్యాంగ ముసాయిదా కమిటీ చైర్మన్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌ను స్మరించుకోవడం ఈ రోజు ప్రత్యేకత. రాజ్యాంగం కల్పించిన హక్కులను తెలుసుకోవడంతో పాటు, పౌరులుగా మన బాధ్యతలను నిర్వర్తించడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాలని ఈ సందర్భంగా గుర్తుచేసుకోవాలి.

నంద్యాలలో రాజకీయ ఉద్రిక్తత



(మొదటి పేజీ తరువాయి)

నంద్యాలలో ఇరు పార్టీల వర్గీయుల మధ్య తలెత్తిన వివాదం క్షణాల్లో ఘర్షణకు దారితీసింది. గొడవ ముదురుతున్న క్రమంలో టీడీపీ, వైసీపీ కార్యకర్తలు పరస్పరం కారం నీళ్లు చల్లుకున్నట్లు సమాచారం. దీంతో అక్కడి వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది.

వాగ్వాదం, తోపులాట.. దృశ్యాల్లో కలకలం

రాజకీయ ఉద్రిక్తతల మధ్య కార్యకర్తల మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట చోటుచేసుకున్నాయి. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాల్లో ఇరు వర్గాల మధ్య గొడవ, తోపులాట స్పష్టంగా కనిపించాయి. శాంతిభద్రతల పరిస్థితిపై స్థానికంగా చర్చ మొదలైంది. పంచాయతీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా నంద్యాల జిల్లా అహోబిలంలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ వాహనంపై వైకాపా మద్దతుదారులు దాడి చేశారు. దీంతో వాహనం అద్దాలు పగిలిపోయాయి. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య రాళ్లదాడి జరిగింది. పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చేందుకు అదనపు బలగాలను రప్పించారు. జిల్లా ఎస్పీ, పోలీసు అధికారులు అహోబిలం చేరుకున్నారు. మరోవైపు ఆళ్లగడ్డ మండలం జమ్మదిన్నెలోనూ ఉద్రిక్తత నెలకొంది. వైకాపా మద్దతుదారులు రిగ్గింగ్ చేస్తున్నారంటూ తెదేపా వర్గీయులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఘర్షణ జరిగింది. పోలింగ్ కేంద్రం వద్ద కారంపొడి చల్లుకుని ఇరువర్గాలు పరస్పరం దాడికి పాల్పడ్డాయి. దీంతో అక్కడ పోలింగ్ తాత్కాలికంగా నిలిచిపోయింది.

సామాన్య ఓటర్లతో కలిసి ఓటేసిన పవన్ కళ్యాణ్

మంగళగిరి, నవంబర్ 26, అనంత జనశక్తి న్యూస్

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మంగళగిరిలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. మంగళగిరి - తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల నేపథ్యంలో గురువారం ఉదయం 11.30 గంటల ప్రాంతంలో ఆయన ఓటు వేశారు. మంగళగిరిలోని శ్రీలక్ష్మీనరసింహ కాలనీలో ఉన్న 34వ నంబర్ పోలింగ్ కేంద్రంలో ఆయన ఈ ప్రక్రియలో పాల్గొన్నారు. ఎన్నికల నిబంధనలను పాటిస్తూ సాధారణ ఓటర్లతో కలిసి పవన్ కళ్యాణ్ పోలింగ్ కేంద్రానికి చేరుకుని ఓటు వేశారు. ఎన్నికల వేళ పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లు, ఓటర్ల రాకపై స్థానికంగా ఆసక్తి నెలకొంది.

ప్రతి పౌరుడు ఓటు వేయాలి.. రాజ్యాంగ దినోత్సవ శుభాకాంక్షలు

ఓటు హక్కు వినియోగించుకున్న అనంతరం పవన్ కళ్యాణ్ ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడి బాధ్యతను గుర్తుచేశారు. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే బాధ్యతగా ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. అలాగే దేశ ప్రజలకు రాజ్యాంగ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

తొడ కొట్టి సవాల్ విసిరిన సోము వీర్రాజు

రాజమండ్రి, నవంబర్ 26, అనంత జనశక్తి న్యూస్



"దమ్ముంటే.. నా మీదకు రమ్మనండి.. సవాల్.. సవాల్.." అంటూ బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు ఓ పోలింగ్ బూత్ దగ్గర గర్జించారు. దీంతో రాజమండ్రిలో ఓ పోలింగ్ బూత్ దగ్గర చోటుచేసుకున్న ఈ పరిణామం స్థానిక రాజకీయాలను హీట్ ఎక్కించింది.

ఏపీలో గ్రామ పంచాయతీ ఎన్నికలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా వార్డుల్లో గురువారం పోలింగ్ జరుగుతుంది. అయితే 62వ వార్డు మల్లయ్యపేట పోలింగ్ బూత్ వద్ద బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు వైసీపీ నేతల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతేకాదు తొడ కొట్టి మరీ సవాల్ విసిరారు. అసలు పోలింగ్ బూత్ వద్దకు వైసీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ఎందుకు చేరుకున్నారని స్థానిక వైసీపీ నేతను సోము వీర్రాజు ప్రశ్నించారు. రూల్స్‌కు విరుద్ధంగా పోలింగ్ కేంద్రం దగ్గరకు అంతమంది నాయకులు ఎందుకు వచ్చారంటూ? బీజేపీ ఎమ్మెల్యే సోము వీర్రాజు మండిపడ్డారు. దాంతో స్థానిక వైసీపీ నేత బీజేపీ నాయకులు ఎందుకు బూత్ దగ్గర ఉన్నారని తిరిగి ప్రశ్నించారు. ఈ క్రమంలో స్థానిక వైసీపీ నేత, సోము వీర్రాజు మధ్య మాటల యుద్ధం జరిగింది. అయితే ఈ విషయం గురించి తెలుసుకున్న పోలీసులు వెంటనే రంగంలోకి దిగి ఇరు వర్గాలకు నచ్చజెప్పారు. దీంతో వివాదం సద్దుమణిగింది. అయితే సోము వీర్రాజు తొడకొట్టి సవాల్ విసిరిన వీడియోలు ఇప్పుడు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి.

పోలింగ్ టైమ్.. రూల్స్ ఏం చెబుతున్నాయి?

పోలింగ్ జరుగుతున్న సమయంలో కొన్ని రూల్స్ అమల్లో ఉంటాయి. ముఖ్యంగా రాజకీయ పార్టీలు అవి కచ్చితంగా పాటించాల్సి ఉంటుంది. సెక్షన్ 130 ప్రకారం పోలింగ్ కేంద్రం నుంచి 100 మీటర్ల పరిధిలో ఎలాంటి ప్రచారాలు చేయకూడదు. అంటే రాజకీయ పార్టీల నేతలే కాదు.. కార్యకర్తలు కూడా పెద్ద ఎత్తున ఒక దగ్గర చేరడం, ఓటర్లను ప్రభావితం చేయడం నిషేధం. ఇక పార్టీ గుర్తులు లేదా జెండాలను అసలు ప్రదర్శించకూడదు.

ఇక పోలింగ్ కేంద్రాల దగ్గర రాజకీయ పార్టీల నాయకులు ఓటర్లకు స్లిప్పులను ఇవ్వడానికి తాత్కాలిక శిబిరాలు 200 మీటర్ల దూరంలోనే పెట్టుకోవాలి. అక్కడ కేవలం ఒక టేబుల్, రెండు కుర్చీలు మాత్రమే ఉండాలి. జన సమీకరణ ఉండకూడదు. అలాగే ఎన్నికల ప్రచారం ముగిసిన వెంటనే నాన్ లోకల్స్ అక్కడ ఉండకూడదు. ఆ ప్రాంతాన్ని విడిచి వెళ్లిపోవాలి. పోలింగ్ జరిగే రోజున కేవలం అభ్యర్థి, అతని ఎలక్షన్ ఏజెంట్, బూత్‌కు నియమించిన పోలింగ్ ఏజెంట్లకు మాత్రమే పర్మిషన్ ఉంటుంది. అలాగే ప్రజలు ఓట్లు వేసే రోజున పోలింగ్ కేంద్రాల దగ్గర 144 సెక్షన్ అమల్లో ఉంటుంది. అంటే ఒకే చోట నలుగురు లేదా అంతకంటే ఎక్కువమంది గూమిగూడ కూడదు. ఒక వేళ పెద్ద ఎత్తున రాజకీయ పార్టీల నాయకులు ఒకే చోట గుమిగూడితే చట్టరీత్యా నేరం అవుతుంది.

అమితాబ్ ఇంటికి మరోసారి బాంబు బెదిరింపు

- ముంబైలో మరిన్ని ప్రాంతాలకు హెచ్చరిక

- (బీఎంసీ) కార్యాలయం పేర్లను తాజా బెదిరింపు ఈమెయిల్

ముంబై, నవంబర్ 26, అనంత జనశక్తి న్యూస్

ముంబైలో మరోసారి బాంబు బెదిరింపులు కలకలం రేపుతున్నాయి. బాలీవుడ్ దిగ్గజ నటుడు అమితాబ్ బచ్చన్ నివాసం 'జల్సా'కు మరోసారి బాంబు బెదిరింపు వచ్చింది. అలాగే ముంబై మేయర్ కార్యాలయం, బృహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) కార్యాలయం పేర్లను తాజా బెదిరింపు ఈమెయిల్‌లో ప్రస్తావించారు. నవంబర్ 26న ముంబై పౌర సంస్థకు ఈ బెదిరింపు సందేశం ఈ మెయిల్ ద్వారా అందింది. నగరంలోని కీలక ప్రాంతాల్లో పేలుళ్లు జరగవచ్చని ఈమెయిల్‌లో హెచ్చరించినట్లు తెలుస్తోంది. ముంబైలోని కొన్ని మెట్రో స్టేషన్లలో కూడా పేలుళ్లు జరగవచ్చని కూడా ఈమెయిల్‌లో హెచ్చరించినట్లు జాతీయ మీడియాలో వార్తలు వస్తున్నాయి. నవంబర్ 27 నుంచి డిసెంబర్ 31 మధ్య దాడులు జరిగే అవకాశం ఉందని సందేశంలో పేర్కొన్నట్లు సమాచారం. అంతే కాకుండా నగరంలో వచ్చే 30 రోజుల పాటు గ్రెనేడ్ దాడులు జరగవచ్చని కూడా హెచ్చరించినట్లు తెలుస్తోంది. ఈ బెదిరింపు సందేశంపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ఇటీవల కూడా అమితాబ్ నివాసం 'జల్సా'కు బాంబు బెదిరింపు సందేశాలు వచ్చాయి . గత రెండు నెలల్లో అమితాబ్ ఇంటికి బాంబు బెదిరింపు రావడం ఇది మూడోసారి. తాజాగా ముంబై మేయర్ రీతూ తావ్డే, మున్సిపల్ కమిషనర్ అశ్విని భిడేలకు సంబంధించిన కార్యాలయాలను కూడా ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఈ నేపథ్యంలో ముంబై పోలీసులు అప్రమత్తమయ్యారు.



రాయలసీమ లిఫ్ట్ కొత్త ప్రాజెక్ట్ కాదు

(మొదటి పేజీ తరువాయి)

కరువు పరిస్థితులను తరచుగా ఎదుర్కొనే రాయల సీమ ప్రాంతానికి కేటాయించిన నీటిని సమర్థవంతంగా వినియోగించుకోవడమే దీని లక్ష్యమని పేర్కొన్నారు.

కృష్ణా నది ద్వారా రాష్ట్రానికి చేరే నీటి ప్రవాహం దశాబ్దాలుగా తగ్గుముఖం పడుతోందని జగన్ గుర్తు చేశారు. ఎగువ నుంచి రావాల్సిన నీరు తగ్గడం ఒక సమస్య అయితే..... వచ్చిన నీటిని కూడా తెలంగాణ విద్యుత్ ఉత్పత్తి పేరుతో ఇష్టారీతిన దిగువకు విడుదల చేయడం మరో తీవ్ర సమస్యగా మారిందన్నారు.

శ్రీశైలం రిజర్వాయర్‌లో నీటిమట్టం కనీసం 880 అడుగులకు పైన ఉంటేనే, పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా పూర్తిస్థాయిలో అంటే 44 వేల క్యూసెక్కుల నీరు పారే అవకాశం ఉందని జగన్ వివరించారు. నీటిమట్టం 854 అడుగుల కంటే తగ్గితే అసలు నీరే తీసుకోలేని పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. 880 అడుగులకు పైన నీటిమట్టం ఎన్ని రోజులు ఉంటుందో తెలియని అనిశ్చితి వల్ల..... రాయలసీమలో తాగు, సాగునీటి అవసరాలు తీర్చడం కష్టంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.



మరోవైపు తెలంగాణ ప్రభుత్వం శ్రీశైలంలో 800 అడుగుల నుంచే నీటిని తోడుకునేందుకు వేగంగా అడుగులు వేస్తోందని జగన్ ఆరోపించారు. పాల మూరురంగారెడ్డి ద్వారా రోజుకు 1.5 టీఎంసీలు, డిండి ద్వారా 0.5 టీఎంసీ, కల్వకుర్తి ద్వారా 0.4 టీఎంసీ, ఎస్ఎల్‌బీసీ ద్వారా 0.5 టీఎంసీ చొప్పున మొత్తంగా దాదాపు రోజుకు 3 టీఎంసీలు తరలించే సామర్థ్యంతో ముందుకెళ్తోందని పేర్కొన్నారు. వీటికి తోడు 800 అడుగుల నుంచే విద్యుత్ ఉత్పత్తి పేరుతో నీటిని వదులుతోందని పేర్కొన్నారు.

ఇలాంటి సంక్లిష్ట పరిస్థితుల్లో ప్రత్యామ్నాయంగా వైసీపీ ప్రభుత్వ హయాంలో రాయలసీమ లిఫ్ట్ స్కీంను ప్రారంభించామని జగన్ తెలిపారు. పోతిరెడ్డిపాడు ద్వారా సహజంగా నీరు తీసుకోలేని సమయంలో..... లిఫ్ట్ చేసి అదే కాలువలోకి ఎత్తిపోస్తూ, ఉన్న రిజర్వాయర్లకు నీటిని చేర్చడమే దీని ఉద్దేశమని చెప్పారు. నీటి వాటా ఉన్నా వాడుకునే అవకాశం లేకపోతే ఆ కేటాయింపులకు అర్థమేముంటుందని ప్రశ్నించారు. అదనపు నీరు, కొత్త రిజర్వాయర్లు లేని ఈ పథకం వల్ల ఎవరికి నష్టం జరుగుతుందని నిలదీశారు. ప్రజల దాహార్తి తీర్చే ఇన్సూరెన్స్ లాంటి పథకాన్ని భూతద్దంలో చూపించడం భావ్యమా.....? అని ప్రశ్నించారు.

దాదాపు పూర్తి దశకు చేరుకున్న రాయలసీమ లిఫ్ట్ పనులను..... చంద్రబాబు అధికారంలోకి రాగానే తనకు ఎక్కడ పేరు వస్తుందోనని నిలిపివేశారని జగన్ ఆరోపించారు. పథకం ఆవశ్యకతను గట్టిగా వినిపించాల్సింది పోయి, రాజకీయ లబ్ధి కోసం పక్కన పెట్టేశారని విమర్శించారు. కరువు వంటి క్లిష్ట పరిస్థితుల్లో హక్కుగా దక్కాల్సిన నీటిని వాడుకునే అవకాశాన్ని దెబ్బతీసి, రాయలసీమ ప్రజల జీవనాధారానికే ముప్పు తెచ్చారని అన్నారు. ఎవరికీ హాని చేయని ఈ ప్రాజెక్టుపై అనవసర విమర్శలు మానుకోవాలని జగన్ హితవు పలికారు.

11 రోజుల ఉత్కంఠకు తెర

(మొదటి పేజీ తరువాయి)

వీరంతా ఈ నెల 10వ తేదీన విశాఖపట్నం హార్బర్‌కు చేరుకుని... వారు పట్టిన చేపలను అమ్మి.. తిరి అదే రోజు మళ్లీ వేట కోసం సముద్రంలోకి వెళ్లారు. అలా వెళ్లిన వారు ఈనెల 14వతేదీన వారి కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడారు. కానీ ఆ మరుసటి రోజు నుంచి వారి ఫోన్‌లు పని చేయలేదు. అలాగే బోటుకు అమర్చిన ట్రాన్స్‌పాండర్ సిగ్నల్స్ కూడా నిలిచిపోయాయి. దాంతో ఆ మత్స్యకారుల కుటుబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. అయితే 19వ తేదీ వరకు వేచి చూసి.. ఆ రోజు రాత్రి కోస్ట్ గార్డ్ టోల్ ఫ్రీ నెంబర్‌కు కంప్లైంట్ చేశారు. ఆ ఫిర్యాదును అందుకున్న కోస్ట్ గార్డు సిబ్బంది వెంటనే సముద్రంలో గాలింపు చర్యలు చేపట్టారు. కానీ ప్రయోజనం లేకపోయింది.

ఆ సమాచారమే రక్షించింది...

అయితే అదే సమయంలో వేటకు వెళ్లి తిరిగి వచ్చిన ఇతర మత్స్యకారులు వారి బోటును ఆఖరిగా ఒడిశాలోని పారాదీప్ సమీపంలో చూసినట్లు ఇన్మర్మేషన్ ఇచ్చారు. దాంతో కోస్ట్ గార్డు సిబ్బంది ఆ ప్రాంతంలో సెర్చింగ్ మొదలుపెట్టారు. ఈ నేపథ్యంలో గురువారం మధ్యాహ్నం తప్పిపోయిన ఆ మత్స్యకారుల ఫోన్ సిగ్నల్ అందింది. దాంతో పూర్తిస్థాయిలో వారితో కమ్యూనికేషన్ ఏర్పడింది. వాళ్లు సురక్షితంగా ఉన్నారని శుభవార్త వచ్చింది. దాంతో 11 రోజులుగా ఆ మత్స్యకారుల కోసం ఆందోళన చెందుతున్న వారి కుటుంబ సభ్యులు, ఆ గ్రామస్థులు ఊపిరి పీల్చుకున్నారు.

కాగా సముద్రంలో వేటకు వెళ్లి ఇన్ని రోజులు ఆచూకి తెలియని మత్స్యకారుల్లో గిరికన సింహాద్రి, గంపల ప్రకాశ్, సూరాడ చిన్న, మేరుగు నారాయణ, తిర్రి నారాయణ, కందాల రాంబాబు, సూరాడ కొండలరావులు ఉన్నారు.



ఏపీ ఎన్నికలపై నిఘా

- 15,100 కెమెరాలతో పోలింగ్ కేంద్రాల లైవ్ స్ట్రీమింగ్

- రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా

- 23 పట్టణ స్థానిక సంస్థల పరిధిలో

- సుమారు 5,600 కెమెరాలతో పోలింగ్ పర్యవేక్షణ

- 9,500 గ్రామ పంచాయతీల్లో వెబ్‌కాస్టింగ్

రాష్ట్రవ్యాప్తంగా పట్టణ స్థానిక సంస్థలు, గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్‌పై నిరంతరం పర్యవేక్షణ ఉంటుందని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా తెలిపారు. విజయవాడలోని ఎస్ఈసీ కార్యాలయ ప్రత్యేక పర్యవేక్షణ కేంద్రం నుంచి లైవ్ స్ట్రీమింగ్‌ను ఎస్ఈసీ పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. ఎన్నికల సరళిని పర్యవేక్షించేందుకు విస్తృత స్థాయిలో సీసీ కెమెరాలు, వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా 15,100కు పైగా కెమెరాలతో పోలింగ్ కేంద్రాల్లో జరుగుతున్న ప్రక్రియను లైవ్ స్ట్రీమింగ్ ద్వారా పర్యవేక్షిస్తున్నామని అన్నారు. 23 పట్టణ స్థానిక సంస్థల పరిధిలో సుమారు 5,600 కెమెరాలతో పోలింగ్‌ను పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. సుమారు 9,500 గ్రామ పంచాయతీల్లో వెబ్‌కాస్టింగ్ ద్వారా పోలింగ్ ప్రక్రియ పరిశీల జరిగిందన్నారు.

పోలింగ్ కేంద్రాల్లోని కార్యకలాపాలను ప్రత్యక్షంగా వీక్షించడంతో పాటు రికార్డింగ్ కూడా నిర్వహిస్తున్నామని ఎస్ఈసీ అన్నారు. ఎక్కడైనా అవాంఛనీయ ఘటనలు జరిగితే వెంటనే గుర్తించి కలెక్టర్లు, ఎస్పీల ద్వారా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, జవాబుదారీతనం కోసమే సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నామని చెప్పారు. పోలింగ్ పూర్తయ్యే వరకు ప్రతి కేంద్రంలోని పరిస్థితులను నిరంతరం సమీక్షిస్తామని ఎస్ఈసీ అనిల్ చంద్ర పునేఠా పేర్కొన్నారు.



సీఐఏ కంప్యూటర్లోకి చైనా సైబర్ ఆయుధం..?

తాడిని తన్నే వాడుంటే.. వాడి తల తన్నే వాడొకడుం టాడన్నట్లుంది అమెరికా (USA) నిఘా సంస్థ సీఐఏ (CIA) పరిస్థితి. ప్రపంచ వ్యాప్తంగా కంప్యూటర్లలోకి చొరబడి రహస్య సమాచారాన్ని ఆ సంస్థ సేకరిస్తే.. ఆ సంస్థ కంప్యూటర్లలోకి చొరబడి హ్యాకర్లు డేటాను అపహరించారు. ఇందుకోసం వాడినట్లు భావిస్తున్న సైబర్ ఆయుధం చైనా తయారీగా అనుమానిస్తున్నా రు. అబ్బే మా దగ్గర రహస్య సమాచారం ఏదీ హ్యాకర్ల చేతిలో పడలేదని సీఐఏ చెబుతున్నా.. జరిగిన ఘటన అగ్రరాజ్యాన్ని ఆందోళనకు గురి చేస్తోంది.

అమెరికాకు చెందిన సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ (సీఐఏ), ది నేషనల్ జియోస్పేషియల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ, ది ఆఫీస్ ఆఫ్ ది డైరెక్టర్ ఆఫ్ నేషనల్ ఇంటె లిజెన్స్ కార్యాలయాల్లోని కంప్యూటర్లలోకి హ్యాకర్లు చొరబడ్డారు. అయితే కచ్చితంగా ఏ సమాచారం హ్యాకర్ల చేతికి వెళ్లిందో మాత్రం అధికారిక వర్గాలు వెల్లడించలేదు. రహస్య డేటా మాత్రం భద్రంగా ఉందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.

ఏమిటీ చైనా ఆయుధం ఆర్టెక్స్..?

అమెరికా నిఘా సంస్థల కంప్యూటర్లలోకి చొరబడేం దుకు చైనాలో తయారైన కృత్రిమ మేధ (ఏఐ) టూల్‌ను వాడారు. దాని పేరు ఆర్టెక్స్ (Artex). ఈ ఏడాది ప్రా రంభంలో ఓ చైనా ఇంజినీర్ దీనిని సైబర్ సెక్యూరిటీ కోసం అంటూ తయారు చేశాడు. జులై నుంచి బహి రంగంగా అందుబాటులోకి వచ్చింది. నాటి నుంచి జపాన్, దక్షిణ కొరియాలోని పలు వ్యాపార సంస్థలపై సైబర్ దాడులకు దీనిని వాడినట్లు ఆరోపణలున్నాయి. గత కొన్నేళ్లుగా చైనా ఇంటెలిజెన్స్ కాంట్రాక్టర్లు అమెరి కాపై సైబర్ దాడులు చేస్తున్నారు.

ఓపెన్ సోర్స్ ఇంటెలిజెన్స్‌ను టార్గెట్ చేసి..

అమెరికా నిఘా వర్గాలు సేకరించిన బహిరంగ సమాచారం, వాణిజ్య పరంగా అందుబాటులో ఉన్న వివరాలు, సోషల్ మీడియా నుంచి సేకరించిన డేటా, ఉపగ్రహ చిత్రాలు, ఇతర ఆన్‌లైన్ మెటీరియల్ హ్యాక ర్ల చేతికి చిక్కినట్లు తెలుస్తోంది. తమకు చేరే రహస్య సమాచారానికి వీటిని అనుసంధానించి నిఘా వర్గాలు విశ్లేషిస్తుంటాయి. ఈ సైబర్ దాడిపై సీఐఏ, ఎన్‌జీఏ స్పందించలేదు.

అమెరికా నిఘా సంస్థలకు ఏమైంది..?

ఇటీవల అమెరికా నిఘా, భద్రతా సంస్థల్లో తరచూ



సాంకేతిక లోపాలు, సైబర్ దాడులు చోటుచేసుకుం టున్నాయి. కొన్నాళ్ల క్రితం నేషనల్ సెక్యూరిటీ ఏజెన్సీ కీలక నెట్‌వర్క్ మొరాయించింది. అయితే ఇది సైబర్ దాడి కాదని ఎన్ఎస్ఏ తెలిపింది. ఇక అమెరికాలోని క్రిమినల్స్, అనుమానితుల డేటాను ఎఫ్‌బీఐ నేషనల్ ఇన్ఫర్మేషన్ సెంటర్ నుంచి హ్యాకర్లు కాజేసినట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంపే స్వయంగా ధ్రువీకరించారు. దీంతోపాటు గత వారం అమెరికా వ్యవసాయ శాఖపై కూడా సైబర్ దాడి జరిగింది.

టాయిలెట్ పేపర్లు భారీగా కొంటున్న అమెరికన్లు.. ఎందుకంటే..?



ఏఐ టెక్నాలజీ రంగంలో కొన్నేళ్లుగా దూసుకుపోతు న్న అమెరికన్లు.. ఇప్పుడు దానికే భయపడే పరిస్థితి నెలకొంది. ఇటీవల వరుసగా అమెరికాలో తలెత్తుతు న్న టెక్నాలజీ అవాంతరాలు వారిని తీవ్రంగా భయ పెడుతున్నాయి. ఎప్పుడో నిత్యావసర సేవలు నిలిచి పోయి.. జనజీవనం స్తంభించిపోయే స్థితి వస్తుందన్న ఆందోళనలు వారిని వెంటాడుతున్నాయి. ఫలితంగా వాళ్లు అత్యవసర సామగ్రిని భారీగా కొనుగోలు చేస్తు న్నారు. బ్లాక్‌ఫ్రైడే డీల్స్ కోసం అమెరికా రిటైలర్లు డి స్కౌంట్లకు సమాయత్తం అవుతున్నా.. ధరలు మాత్రం దూసుకుపోతున్నాయి.

ముఖ్యంగా టాయిలెట్ పేపర్లు, జనరేటర్లు, ఫ్రీజ్‌డ్రై యిడ్ ఫుడ్ వంటి వాటి డిమాండ్‌కు రెక్కలొచ్చాయి. ముఖ్యంగా ఫ్రీజ్‌డ్రైయిడ్ ఆహార పదార్థాల ధర 12% పెరిగింది. గతేడాది ఇదే సీజన్‌లో 9% తగ్గడం విశేషమని బ్లూమ్‌బెర్గ్ పేర్కొంది. గతేడాది తాము ట్రాక్ చేసిన 16 స్టాక్స్ జాబితాలో ఒక్కటి మాత్రమే అందుబాటులో లేదని.. ఇప్పుడు ఆ 16లో దాదాపు మూడో వంతు నో స్టాక్‌గా పేర్కొంది. చివరికి జనరేటర్లు వంటివి లభించడం కూడా కష్టంగా మారింది. టాయిలెట్ పేపర్ల ధర సెప్టెంబర్ నుంచి 4% పెరిగింది. పేపర్ టవల్స్, బ్యాటరీలు, చెత్తబ్యా గ్‌లు వంటి వాటిని చూసినా గతేడాదితో పోలిస్తే ఈ సీజన్‌లో రేట్లు పెరిగాయి.

క్రిస్మస్ దృష్ట్యా బ్లాక్ ఫ్రైడే, సైబర్ మండే వంటి భారీ డి స్కౌంట్ల సీజన్ రానుండటంతో అత్యవసర సరకులు ఇప్పుడే తక్కువగా లభిస్తాయన్న ఉద్దేశంతో కొనుగో ళ్లు మరింత పెరిగాయి. ఇక ప్రొపేన్, బాటిల్డ్ వాటర్, క్యాంపింగ్ గేర్, బియ్యం, క్యాన్లలోని ఆహారం కొనుగోళ్లు పెరిగినట్లు వాల్‌మా ర్ట్, కాస్ట్‌కో వంటి రిటైల్ దిగ్గజాలు వెల్లడించాయి. జాతీయ స్థాయిలో బ్లాకౌట్ తప్పదంటూ సోషల్ మీడియాలో వస్తున్న పోస్టులు వినియోగదారుల ఆం దోళనలను పెంచుతున్నాయి. అమెరికాలో ఎయిర్ ట్రాఫిక్, బ్యాంకింగ్ సర్వీసులు, నేషనల్ సెక్యూరిటీ ఏజెన్సీ కమ్యూనికేషన్ల వంటి కీలకమైనవి కూడా సాంకేతిక అవాంతరాలతో అవస్థలు పడిన విషయం తెలిసిందే.

ఆంగ్లేతర భాషల్లో సమాధానానికి ఏఐకి ఎక్కువ ఇంధనం అవసరం



ఆంగ్లేతర భాషల్లో అందే ఆదేశాలకు స్పందించి సమాచారం అందించేందుకు జనరేటివ్ కృత్రిమ మేధ (జనరేటివ్ ఏఐ) అధికంగా విద్యుత్తు వినియోగి స్తుందని ఒక అధ్యయనంలో వెల్లడైంది. అటువంటి భాషల్లో అందే ఆదేశాలకు సమాధానం చెప్పేందుకు ఆంగ్లంతో పోలిస్తే 180 రెట్లకు పైగా ఎక్కువ విద్యుత్తు వినియోగిస్తుందని ఈ అధ్యయన నివేదిక తెలియజే స్తోంది. పశ్చిమ యూరప్ భాషల్లో ఇచ్చే ఆదేశాలపై స్పందించేందుకు రెండింతలు, లేదా అంతకన్నా తక్కువ విద్యుత్తు అవసరమౌతుండగా, కోట్లాది మంది మాట్లాడే హిందీ, బెంగాలీ వంటి భాషల్లో జనరేటివ్ ఏఐ స్పందించడానికి ఆంగ్లంతో పోలిస్తే ఎనిమిది నుంచి 15 రెట్లు ఎక్కువ విద్యుత్తు అవసరమౌతుందని 'ఎం పిరికల్ మెథడ్ ఇన్ నేచురల్ ల్యాంగ్వేజ్ ప్రాసెసింగ్' పేరుతో నిర్వహించిన సమావేశంలో పరిశోధకులు పేర్కొన్నారు.

అదే దక్షిణ పాష్తో భాషలో అందే ఆదేశాలపై స్పందిం చేందుకు 188 రెట్లు, టిబెటన్ భాషలో స్పందించేం దుకు 180 రెట్లు ఎక్కువ విద్యుత్తు అవసరమౌతుంది. కృత్రిమ మేధ నమూనాలు వాటికి వివిధ భాషల్లో అందే ఆదేశాలను (ప్రాంప్ట్‌లను) టోకెన్లుగా మా ర్చుకుంటాయి. ఈ టోకెన్లనే కృత్రిమ మేధ మౌలిక యూనిట్‌లుగా పరిగణిస్తుంది. తనకు అందిన ఆదే శానికి అనుగుణంగా ఈ యూనిట్‌లను ప్రాసెస్ చేసి మానవ భాషలో స్పందన అందిస్తుంది. ఇంగ్లిషేతర భాషల్లో అందే ఆదేశాలకు స్పందనగా ఎక్కువ టోకెన్లు ఉత్పత్తి అవుతాయని, ఈ కారణంగా ఎక్కువ విద్యుత్తు వినియోగం అవుతుందని అమెరికాలోని మిచిగన్, బ్రిటన్‌లోని అబెర్డీన్, కేంబ్రిడ్జ్ వర్సిటీల పరిశోధకులు పేర్కొంటున్నారు.

అబ్బో.. ఆకాశం హౌస్‌ఫుల్.. ఇక 10 లక్షల శాటిలైట్ల ప్రయోగం..!

అమెరికా ఇక ఆకాశాన్ని అక్రమించేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్లుంది. తమ దేశానికి స్పేస్‌ఎక్స్ ఏకంగా 10 లక్షల (మిలియన్) ఉపగ్రహాలను ప్రయోగించేందుకు ది యూఎస్ ఫెడరల్ కమ్యూని కేషన్ కమిషన్ (ఎఫ్‌సీసీ) అనుమతులు మంజూరు చేసింది. ఈ ఉపగ్రహాలు అమెరికా అంతరిక్షంలో డేటా సెంటర్ల ఏర్పాటు నిర్మాణానికి సహకరించను న్నాయి. ప్రపంచ వ్యాప్తంగా ఇటువంటి అనుమతి సాధించిన తొలి సంస్థగా స్పేస్‌ఎక్స్ నిలిచింది. సూ ర్యకాంతిని వాడుకొని ఉపగ్రహాలకు విద్యుత్తును అందజేసి.. వాటిలో డేటాను ప్రాసెస్ చేయాలన్నది ఎలాన్ మస్క్ ఆలోచన. ఈ శక్తిని ఏఐకు వాడుకోవాల ని భావిస్తున్నారు. ఈ ప్రాజెక్టుకు 'స్టార్‌మైండ్' అని పే రుపెట్టారు. దీనిపై ఎఫ్‌సీసీ స్పందిస్తూ స్టార్‌మైండ్ ప్రా జెక్టు అమెరికా సూపర్ ఇంటెలిజెన్స్ (ఏఐ)ఎకానమీకి సహకరిస్తుందని పేర్కొంది. అమెరికా భూభాగంలో డేటా సెంటర్ల ఏర్పాటుపై వ్యతిరేకత పెరుగుతున్నవేళ మస్క్ ప్రతిపాదనకు ఆమోదం లభించడం విశేషం. ఆర్బిటల్ డేటా సెంటర్లలో ఎనర్జీ ఖర్చు చాలా తక్కువ ఉంటుందని స్పేస్ ఎక్స్ చెబుతోంది. మరోవైపు ఈ అనుమతులపై మస్క్.. ఎక్స్ వేదికగా స్పందించారు. ''అభినందించదగిన విషయం. ఈ ప్రాజెక్టు భవిష్య



త్తులో అమెరికా, ప్రపంచానికి ఓ గొప్ప ఆస్తిగా నిలు స్తుంది'' అని పేర్కొన్నారు. ఇక ఈ ప్రాజెక్టుకు సం బంధించిన ఉపగ్రహాల ప్రయోగం 2033 నవంబర్ నాటికి మొదలైపోవాలి. వీటిల్లో 2035 నాటికి 10% ఉపగ్రహాలు కక్ష్యలోకి చేరతాయి. 2038 నాటికి ఈ ప్రాజెక్టు 50% పూర్తవుతుందని అంచనా. దీంతో వచ్చే ఏడాది తొలి స్టార్‌మైండ్ శాటిలైట్‌ను ప్రయోగించే అవకాశం ఉంది.

ట్రంప్ ఎప్పటికీ నేర్చుకోరు.. జనవరిలో పరిస్థితి మారుతుంది..!



అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌విచిత్ర చేష్టలతో డెమో క్రటిక్ పార్టీ విసిగిపోయింది. యుద్ధాలు.. ట్రేడ్‌వా ర్‌లతో అట్టుడుకుతున్న వేళ మిత్రదేశాలపై తాజాగా టారిఫ్‌లు విధించడంతో ఆ పార్టీ నేతలు మండిపడ్డా రు. మధ్యంతర ఎన్నికల ఓటమితో డబుల్ లేమ్‌డక్ అధ్యక్షుడిగా మారిన ట్రంప్ చర్యలను తప్పుపట్టారు. డెమోక్రటిక్ పార్టీకి చెందిన సెనెటర్ చక్ షూమర్ తాజా టారిఫ్‌లపై కొంచెం ఘాటుగానే స్పందించారు. ''డొనాల్డ్ ట్రంప్ ఎప్పటికీ నేర్చుకోరు. ఇక్కడ అసలు సమస్య చైనా. దానిని పట్టించుకోవడం మానేశారు. మిత్రులను దూరం చేసుకొంటూ.. అమెరికా కుటుం బాలపై భారం మోపుతూ.. కార్మికులకు ఉపయోగప దని నిర్ణయాలు తీసుకొంటున్నారు. అసలు షరతులు నిర్ణయించే అధికారం చైనాకే ఇస్తున్నారు. జనవరిలో ఈ పరిస్థితి మారుతుంది'' అని పేర్కొన్నారు.

పెన్సిల్వేనియా గవర్నర్ జాష్ షాపిరో కూడా ఎక్స్ వేదికగా ట్రంప్ నిర్ణయంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ''ట్రంప్ గందరగోళపు టారిఫ్‌లు అమెరికన్ల చేతి చమురు వదిలిస్తాయనడానికి మరో ఉదాహరణ ఇది. చైనా అనైతిక వాణిజ్య విధానాలను మనం అడ్డు కోలేకపోతున్నామన్న విషయాన్ని ఆయన గమనిం చడం లేదు. చివరికి మన మిత్ర దేశాలపై ఘోరంగా టారిఫ్‌లు విధిస్తున్నాం. దీని ఫలితం ఏమిటంటే.. మి త్రదేశాల నుంచి దూరంగా జరిగి అమెరికా ఏకాకిగా మారిపోవడం. సొంత దేశంలోనే అమెరికన్ల ఖర్చు భారీగా పెరగడం'' అని పేర్కొన్నారు.

మోదీజీ తగ్గొద్దు.. ప్రతీకార సుంకాలు విధించండి: సీటీఐ

వాణిజ్య ఒప్పందం చేసుకోకపోతే భారత్‌పై అమెరికా ఏకపక్షంగా 25% శాతం సుంకాలను విధించాలని నిర్ణయించడాన్ని 'ది ఛాంబర్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ (సీటీఐ)' తప్పు పట్టింది. ఒప్పందం కుదిరితే టారిఫ్‌లు 17% తగ్గుతాయని యూఎస్‌టీఆర్ వెల్లడించిన నేప థ్యంలో అమెరికా ప్రతి చర్యలు తీసుకోవాలని లేఖ రాయనున్నట్లు సంస్థ ఛైర్మన్ బ్రిజేశ్ గోయల్ వెల్లడిం చారు. భారత్ నుంచి ఔషధాలు, వస్త్రాలు, మెడికల్ సప్లైలు, ఎలక్ట్రానిక్, ఎలక్ట్రికల్ వస్తువు, సీఫుడ్స్, ముత్యాలు, లోహాలు, తోళ్లు వంటివి ఎగుమతి చేస్తు న్నారు. అలానే అమెరికా భారత్‌కు పప్పుదినుసులు, మినరల్స్, బేవరేజస్, ఆహారం వంటివి ఎగుమతి చేస్తోందన్నారు. వీటిపై 25% ప్రతీకార సుంకాలు వి ధించాలని కోరారు.

'బహిష్కరణ' ఎదుర్కొంటున్నవారికీ గ్రీన్‌కార్డు!

అమెరికాలో బహిష్కరణ ఆదేశాలు ఎదుర్కొంటున్న పలువురు వలసదారులకు ఊరట దక్కనుంది! దేశ బహిష్కరణ తుది ఉత్తర్వులు వెలువడినప్పటికీ తమ దేశంలో కనీసం పదేళ్లుగా నివాసముంటున్నవారికి శాశ్వత నివాస హోదా కల్పించేందుకు వీలుగా 'ప్రొ టెక్ట్ అవర్ నైబర్స్ యాక్ట్' పేరుతో డెమోక్రాట్లు కొత్త బిల్లును తీసుకొచ్చారు. ఇది చట్టంగా మారితే.. నిర్దే శిత అర్హతలు కలిగినవారు గ్రీన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. వలసదారులపై బహిష్కరణ చర్యల ను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ముమ్మరం చేసిన తరుణంలో ఈ బిల్లు ప్రాధాన్యం సంతరించుకుంది. కాలిఫోర్నియా డెమోక్రటిక్ నేతలు లతీఫా సిమన్, జోయ్ లాఫ్‌గ్రెన్, జాన్ గరమెండి, వర్గస్ నవంబరు 19న ఈ బిల్లును కాంగ్రెస్‌లో ప్రవేశపెట్టారు. కాంగ్రెస్ ఆమోదించినా, తర్వాత ట్రంప్ సంతకం చేస్తేనే ఇది చట్టంగా మారుతుంది.

అందరికీ కాదు..

ఈ బిల్లు దేశ బహిష్కరణ ఎదుర్కొంటున్న వలసదా రులందరికీ గంపగుత్తగా ఏమీ వర్తించదు. దీనిద్వారా లబ్ధిపొందాలంటే దరఖాస్తుదారులు కొన్ని నిబంధనల ను కచ్చితంగా పాటించాలి. అవి..

బహిష్కరణ తుది ఉత్తర్వులు వెలువడ్డాక కూడా కనీసం పదేళ్లపాటు అమెరికాలో నివసించి ఉండాలి. ఇమ్మిగ్రేషన్ చట్టంలో పేర్కొన్న కొన్ని ఉల్లంఘనల ఆధారంగా మాత్రమే వీరికి బహిష్కరణ ఉత్తర్వులు జారీ అయ్యుండాలి. తీవ్రమైన నేరాలు, జాతీయ భద్రతకు సంబంధించిన అంశాలతో సంబంధాలు ఉండకూడదు. ప్రభుత్వ పర్యవేక్షణలో ఉండాలన్న ఆదేశాలను ఉల్లంఘించకూడదు. తాజా ఫెడరల్ ఆదాయపు పన్ను రిటర్న్స్‌ధ్రువపత్రాన్ని సమర్పించాలి. బహిష్కరణ తుది ఉత్తర్వులకు కేవలం పదేళ్ల కాలప రిమితి ఉండాలని కూడా ఇందులో ప్రతిపాదించారు. ప్రస్తుతం ఇలాంటి కాలపరిమితి లేదు.

ఈ ఏడాది ఫిబ్రవరి 26 నాటికి అమెరికాలో సుమారు 16 లక్షల మంది బహిష్కరణ తుది ఉత్తర్వులు అందు కున్నారు.

మృతదేహం నుంచి వీర్యకణాల సేకరణ!

భోపాల్ ఎయిమ్స్ వైద్యుల సంచలన పరిశోధన!

ఎవరైనా ఒక వ్యక్తి మరణించిన తర్వాత కూడా తండ్రి కాగలరా? వినడానికే ఆశ్చర్యకరంగా అనిపించే ఈ ప్రశ్నకు సమాధానం కనుగొనే దిశగా మధ్యప్రదేశ్‌లోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) భోపాల్ పరిశోధన చేపట్టింది. మరణించిన వ్యక్తి శరీరం నుంచి సజీవ, చలనం ఉన్న వీర్యకణాలను సేకరించడం సాధ్యమేనా? వాటిని భవిష్యత్తులో సంతానోత్పత్తి కోసం ఉపయో గించవచ్చా? అనే అంశాలపై శాస్త్రీయంగా అధ్యయనం చేసింది. అకస్మాత్తుగా, అనుకోని ప్రమాదాల్లో తమ ప్రియమైన వారిని కోల్పోయిన కుటుంబాలకు సంతాన భాగ్యాన్ని అందించే మరణానంతరం శు క్రకణాల సేకరణ (పోస్ట్‌మార్టమ్ స్పెర్మ్ రిట్రీవల్) ప్రక్రియపై భోపాల్ ఎయిమ్స్ బృందం పరిశోధనలు నిర్వహించింది. ఎయిమ్స్ భోపాల్ ఫోరెన్సిక్ అండ్ టాక్సికాలజీ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ రాఘవేంద్ర కుమార్ బిందువా నేతృత్వంలో ఈ పరిశోధన జరిగింది.

భోపాల్ ఎయిమ్స్‌లోని ఫోరెన్సిక్ మెడిసిన్ విభాగం, పాథాలజీ అండ్ లాబొరేటరీ మెడిసిన్ విభాగాలు సంయుక్తంగా ఈ అధ్యయనాన్ని నిర్వహించాయి. వీరి పరిశోధనకు భారత వైద్య పరిశోధన మండలి (ఐసీఎంఆర్) ఆర్థిక సహకారం అందించింది. అధ్యయనంలో భాగంగా పరిశోధకులు 600 మంది కిపైగా వ్యక్తులతో చర్చలు జరిపారు. 250కిపైగా వీర్యకణాల సేకరణ ప్రక్రియలను కూడా నిర్వహిం చారు. కొన్ని సందర్భాల్లో మరణించిన వ్యక్తుల నుంచి వీర్యకణాలను విజయవంతంగా సేకరించినట్లు పరిశోధకులు వెల్లడించారు. భోపాల్ ఎయిమ్స్ చేపట్టిన ఈ పరిశోధనకు జాతీయస్థాయిలో గుర్తింపు లభించింది. ఇటీవల పంజాబ్ అకాడమీ ఆఫ్ ఫోరెన్సిక్ మెడిసిన్ అండ్ టాక్సికాలజీ నిర్వహించిన 26వ వార్షిక సదస్సు 2026లో ఈ అధ్యయనాన్ని ఉత్తమ పరిశోధనగా ఎంపిక చేశారు. ప్రధాన పరి శోధకులు డాక్టర్ కుమార్ బిందువాను సత్కరించారు.



ఆ పెళ్లికి లక్షలాది మంది జనం.. 10కి.మీ. ట్రాఫిక్ జామ్!

హార్‌లో వివాదాస్పద వ్యాఖ్యలతో జేడీయూ నుంచి బహిష్కరణకు గురైన మోకామా ఎమ్మెల్యే అనం త్‌సింగ్ మరోసారి వార్తల్లో నిలిచారు. కుమార్తె శివంగి సింగ్ వివాహాన్ని పట్నా జిల్లాలోని నడ్వాన్ గ్రామంలో ఘనంగా నిర్వహించారు. బిహార్‌తో పాటు పక్క రాష్ట్రం నుంచి లక్షలాదిగా జనం తరలి రాగా.. వారి కోసం భారీ ఏర్పాట్లు చేశారు. ఆ ప్రాంతంలో సుమారు 10 కి.మీ. మేర ట్రాఫిక్ జామ్ అయ్యింది. రోడ్డు పక్కన అనేక దుకాణాలు, లౌడ్ స్పీకర్లతో ఆ ప్రాంతమంతా ఓ జాతరలా మారిపో యింది.

వివాహ వేడుకలో భాగంగా గుర్రపు స్వారీ, కుస్తీ పోటీలను నిర్వహించారు. బిహార్, యూపీ, ఝార్ఖండ్, రాజస్థాన్‌తోపాటు ఇతర రాష్ట్రాల నుంచి 50కిపైగా గుర్రాలు వచ్చాయి. కేవలం ఈ పోటీలను చూసేందుకే సుమారు లక్ష మంది వచ్చినట్లు అంచనా. ఆ ప్రాంగణమంతా జనంతో కిక్కిరిసిపోగా.. అనేకమంది పక్కనే ఉన్న విద్యుత్ హైటెన్షన్ టవర్లను ఎక్కి తిలకించారు. పరిస్థితిని అదుపు చేయలేక తుది పోటీలు వాయిదా వేసినట్లు సమాచారం.

వివాహానికి కార్లు, ట్రాక్టర్లతోపాటు కాలినడకన లక్షలాది జనం తరలిరావడంతో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. వీరిని అదుపు చేసేందుకు వందలాది మంది పోలీసులు, దాదాపు మూడు వేల మంది ప్రైవేటు గార్డులను అందుబాటులో ఉంచారు. అసెంబ్లీ స్పీకర్ ప్రేమ్ కుమార్ కాన్వాయ్ కూడా అందులో చిక్కుకుపోయింది. మరోవైపు, పెళ్లికి వచ్చిన వారి కోసం భారీ స్థాయిలో విందు ఏర్పాట్లు చేసినట్లు తెలిసింది. దాదాపు 300 వంటశాలలు ఏర్పాటు చేసినట్లు సమాచారం.

ప్రభుత్వం మారినప్పుడల్లా విచారణ స్వభావం మారుతోంది

- తమిళనాడు మాజీ మంత్రి సెంథిల్ బాలాజీ అవినీతి కేసులో సుప్రీంకోర్టు వ్యాఖ్య



రాజకీయ నాయకత్వం మారినప్పుడల్లా ప్రాసిక్యూషన్ చేసే స్వరూపంలో మార్పు లొస్తున్నాయని, ఇది న్యాయ పరిపాలన చరిత్రలో దారుణమైన అంశమని తమిళ నాడు ప్రభుత్వాన్ని ఉద్దేశిస్తూ సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ఆ రాష్ట్ర మాజీ మంత్రి వి.సెంథిల్ బాలాజీ మంత్రిగా ఉన్న సమయంలో జరిగిన ఉద్యోగాల నియా మకాల్లో అవినీతి ఆరోపణలపై సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్య బాగ్చి, జస్టిస్ వి.మోహనల ధర్మాసనం విచారణ చేపట్టింది. ఒక ప్రభుత్వం విచా రణను ఆలస్యం చేస్తే, మరో ప్రభుత్వం విచారణను అత్యుత్సాహంతో వేగవంతం చేస్తోందని పేర్కొంది. విచారణ విషయంలో విజ్ఞత ఉండాలని వ్యాఖ్యానించింది. సెంథిల్ బాలాజీపై తీవ్రమైన ఆరోపణలు ఉన్నప్పటికీ, ఆయన వాదన వినకుండా దోషిగా నిర్ధారించలేమని వివరించింది. సుప్రీంకోర్టు వద్ద పెండింగ్‌లో ఉన్న 4 కేసుల్లో తుది తీర్పు వెలువడేదాకా స్థానిక సెషన్స్ కోర్టు ఎలాంటి తొందరపాటు చర్యలూ తీసుకోవద్దని ఆదేశాలు జారీచేసింది. విచారణను డిసెంబరు 11కు వాయిదా వేసింది.

రాహుల్ గాంధీకి సుప్రీంకోర్టులో ఊరట



కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీకిసు ప్రీంకోర్టులో భారీ ఉపశమనం లభించింది. రాహుల్‌కు ఆదాయానికి మించిన ఆస్తులు ఉన్నాయన్న ఆరోపణలను పరిశీలించాలం టూ సీబీఐ, ఈడీలకు అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సర్వోన్నత న్యాయస్థా నం బుధవారం కొట్టివేసింది. రాహుల్‌కు వ్యతిరేకంగా కర్ణాటకకు చెందిన భాజపా కార్యకర్త విఘ్నేష్ శిశిర్ దాఖలు చేసిన పిటి షన్‌ను పునఃపరిశీలన కోసం సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చీ, జస్టిస్ వి.మోహనలతో కూడిన ధర్మాసనం.. హైకోర్టుకు తిప్పి పంపించింది. అసలు ఈ పిటిషన్ విచారణకు అర్హమైనదా కాదా అనే అంశాన్నీ తేల్చాలని స్పష్టం చేసింది. సీబీఐ, ఈడీలకు అలహాబాద్ హైకోర్టు ఆదేశాలివ్వ డాన్ని సవాలు చేస్తూ రాహుల్ గాంధీ సుప్రీంకోర్టును ఆశ్రయించగా తాజా నిర్ణయం వెలువడింది.



బ్యాంకును విదేశీ చేతుల్లో పెట్టొద్దు

మీరు జాగ్రత్తగా దాచుకున్న డబ్బు, పిల్లల చదువుకోసం చేసిన డిపాజిట్లు, రైతుకు అవసరమైన కిసాన్ క్రెడిట్, చిన్న వ్యాపారస్థులకు కావాల్సిన రుణం... ఇవన్నీ ఒక బ్యాంకు నిర్ణయాధికారం కిందకు వస్తాయి. ఆ నిర్ణయాధికారం ఇప్పుడు ఒక విదేశీ పెట్టుబడి సంస్థ చేతిలోకి వెళ్తోంది. అదే ఐడీబీఐ బ్యాంకు అమ్మకం! ఐడీబీఐ బ్యాంకులోని 60.72 శాతం వాటాను కెనడాకు చెందిన ఫెయిర్‌ఫాక్స్ ఫైనాన్షియల్ హోల్డింగ్స్‌కు అమ్మేందుకు కేంద్ర మంత్రివర్గ ఆర్థిక వ్యవహారాల కమిటీ (సీసీఈఏ) అక్టోబర్ 14న ఆమోదం తెలిపింది. షేరుకు రూ.81 చొప్పున మొత్తం రూ.52,878 కోట్లకు ఈ వాటా అమ్మకం జరగనుంది. ఇందులో కేంద్ర ప్రభుత్వం 30.48 శాతం, ఎల్ఐసీ 30.24 శాతం వాటాలను విక్రయిస్తుంది. అమ్మకం పూర్తయిన తర్వాత ప్రభుత్వం వద్ద 15 శాతం, ఎల్ఐసీ వద్ద 19 శాతం వాటాలు మాత్రమే మిగులుతాయి. ఒకరకంగా ఇది లక్షల కోట్ల ప్రజా డిపాజిట్లపై నియంత్రణను ఒక విదేశీ సంస్థకు అప్పగించడమే.

ఐడీబీఐ 1964లో పారిశ్రామిక అభివృద్ధి కోసం ఏర్పాటైన ప్రభుత్వ ఆర్థిక సంస్థ. దీర్ఘకాలిక రుణాల ద్వారా దేశ పరిశ్రమలకు ఆధారంగా నిలిచింది. సరళీకరణ విధానాల కాలంలో దీన్ని క్రమంగా వాణిజ్య బ్యాంకుగా మార్చారు. 2019లో ఎల్ఐసీ 51 శాతం వాటా తీసుకున్న తర్వాత ఐడీబీఐను ప్రైవేటు రంగ బ్యాంకుగా రిజర్వ్ బ్యాంక్ వర్గీకరించింది. ప్రభుత్వంతో పాటు, ప్రభుత్వ రంగ సంస్థ అయిన ఎల్ఐసీ పెట్టుబడితో నడుస్తున్న ఐడీబీఐ ప్రైవేటు బ్యాంక్ ఎలా అవుతుంది?! ప్రస్తుతం ఈ బ్యాంకులో కేంద్రం, ఎల్ఐసీ కలిపి 95 శాతం వాటా కలిగి ఉన్నా, నియంత్రణాధికారం మాత్రం ప్రభుత్వం చేతిలో లేదు! అమ్మకానికి దారి వేయడానికి చేసిన దశలవారీ మార్పులే నేటి ఈ పరిస్థితికి దారితీశాయనే అనుమానం సహజంగా కలుగుతుంది.

ఒకప్పుడు ఐడీబీఐ మొండి బకాయిల భారంతో తీవ్ర సంక్షోభంలో పడింది. ఆ బ్యాంకును నిలబెట్టడానికి ప్రభుత్వం, ఎల్ఐసీ నుంచి భారీ మూలధనం వచ్చింది. ఎల్ఐసీ 2019లో రూ.21,624 కోట్లతో వాటా కొని, తర్వాత మరో రూ.4,743 కోట్లు పెట్టింది. ఇదంతా పాలసీదారుల సొమ్మే. కేంద్ర ప్రభుత్వం కూడా రూ.4,557 కోట్ల పన్ను చెల్లింపుదారుల ధనాన్ని పెట్టింది.

ఇప్పుడు ఐడీబీఐ బ్యాంకు ఆర్థికంగా బలపడింది. లాభాలు పెరిగాయి. ఈ ఏడాది జూన్ త్రైమాసికంలో లాభం రూ.2,115 కోట్లు. ప్రజల డబ్బుతో బ్యాంకును బాగుచేసి, అది లాభాల దారిలోకి వచ్చాక అమ్మేయడం న్యాయమేనా? ప్రజలు చేసిన పెట్టుబడి ఫలితాన్ని ప్రైవేటు, విదేశీ సంస్థకు అప్పగించడం కాక మరేమిటి?

ప్రభుత్వం రెండు స్వతంత్ర వాల్యుయేషన్ సంస్థల అంచనాల ఆధారంగా షేరుకు రూ.75.99ను ప్రాథమిక విలువగా నిర్ణయించింది. ఫెయిర్‌ఫాక్స్ రూ.81 బిడ్ పెట్టడంతో అది ఆ విలువ కన్నా ఎక్కువేనని ప్రభుత్వం చెబుతోంది. కానీ ఇక్కడ ప్రశ్న ఏమిటంటే, వాల్యుయేషన్ కాలంలో ఐడీబీఐ షేరు ధర రూ.61.01 నుంచి రూ.118.38 మధ్య హెచ్చుతగ్గులకు లోనైంది. అంటే షేరు ధర ఒక్కసారి రూ.118 దాటింది. అలాంటి పరిస్థితిలో రూ.81 ధర నిజంగా సరైనదేనా అనే సందేహం కలుగక మానదు.

అంతేకాదు, ఈ బ్యాంకుకు దేశవ్యాప్తంగా విలువైన భూములు, భవనాలున్నాయి. ఒక్క హైదరాబాద్‌లోనే 50 ఎకరాల స్థలం ఉందని ఐడీబీఐ ఉద్యోగుల ఐక్యవేదిక చెబుతోంది. ఈ స్థిరాస్తుల నిజమైన మార్కెట్ విలువ పూర్తిగా లెక్కలోకి తీసుకున్నారో లేదో ప్రజలకు స్పష్టంగా తెలియాలి.

2003లో ఐడీబీఐ చట్టం తెచ్చినప్పుడు పార్లమెంటు స్థాయీ సంఘం ప్రభుత్వ వాటా 51 శాతం కంటే తగ్గకూడదని సూచించింది. అప్పటి ఆర్థికమంత్రి జస్వంత్ సింగ్ పార్లమెంట్‌లో ఆ మేరకు హామీ ఇచ్చారు. ఇప్పుడు ప్రభుత్వ వాటా 15 శాతానికి పడిపోతోంది. అంటే ఆ హామీ నేరుగా ఉల్లంఘనకు గురవుతోంది. మరీ ముఖ్యంగా, ప్రభుత్వం వద్ద మిగిలిన 15 శాతం వాటాను కూడా భవిష్యత్తులో ఓపెన్ మార్కెట్‌లో అమ్మేందుకు సీసీఈఏ అధికారాలు ఇచ్చింది. అంటే ఇది కేవలం నియంత్రణ మార్పు కాదు, ప్రభుత్వ ఉనికినే క్రమంగా తుడిచేయడానికి సిద్ధమయ్యారని అర్థం.

ఫెయిర్‌ఫాక్స్‌కు ఇప్పటికే సీఎస్‌బీ బ్యాంకులో సుమారు 40 శాతం వాటా ఉంది. విలీనం జరిగితే రెండు వేర్వేరు సేవా నిబంధనలు కలిగిన ఉద్యోగులు ఒకే సంస్థలోకి వస్తారు. వేతనాలు, పింఛన్లు, పదోన్నతులు, సేవా షరతులు ఎలా ఉంటాయో ఇప్పటికీ స్పష్టంగా తెలియదు. సీఎస్‌బీ యాజమాన్యం బ్యాంకింగ్ పరిశ్రమ ద్వైపాక్షిక ఒప్పందాల ప్రకారం గత పదేళ్లుగా జరిగిన రెండు వేతన సవరణలను అమలు చేయలేదు. న్యాయబద్ధమైన ఒప్పందాల అమలు కోసం ఉద్యోగులు నిరంతరం చేస్తున్న పోరాటాలను ఫెయిర్‌ఫాక్స్ యాజమాన్యం ఖాతరు చేయట్లేదు. అలాంటి అనుభవం ఐడీబీఐ ఉద్యోగులకు కూడా పునరావృతం కాదా?!

ఐడీబీఐలో వేల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. వారిలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాలకు చెందినవారు, మహిళలు, దివ్యాంగులు గణనీయమైన సంఖ్యలో ఉన్నారు. ఈ బ్యాంకు ప్రభుత్వ రంగంలో ఉన్నంత వరకే రిజర్వేషన్ల రక్షణ ఉంటుంది. ప్రైవేటీకరణ తర్వాత కొత్త నియామకాల్లో ఆ అవకాశం శాశ్వతంగా పోతుంది. జరగబోయే పరిణామాలకు ప్రభుత్వం బాధ్యత వహిస్తుందా? ఇది కేవలం ఉద్యోగుల విషయం మాత్రమే కాదు. రైతులు, చిన్న వ్యాపారులు, మహిళలు, గ్రామీణ ప్రాంతాల ప్రజలకు బ్యాంకింగ్ సేవలు అందుతున్న విధానమే ప్రశ్నార్థకం అవుతుంది. లాభం మాత్రమే లక్ష్యంగా ఉండే విదేశీ పెట్టుబడితో నడిచే ప్రైవేటు బ్యాంకు తక్కువ లాభాల శాఖలను, చిన్న రుణాలను నిర్లక్ష్యం చేసే ప్రమాదం ఉంది. ఐడీబీఐకి దేశవ్యాప్తంగా వేల శాఖలున్నాయి. లక్షలాది జన్‌ధన్ ఖాతాలు, బీమా, అటల్ పెన్షన్ ఖాతాలు ఈ బ్యాంకుపై ఆధారపడి ఉన్నాయి. రూ.3 లక్షల కోట్లకు పైగా డిపాజిట్లు ప్రధానంగా సామాన్య ప్రజలవే. వారు డబ్బు దాచింది ప్రభుత్వ అండ ఉందన్న నమ్మకంతోనే. డిపాజిటర్లు భయపడనవసరం లేదని ప్రభుత్వం చెబుతున్నది. కానీ అమ్మకం తర్వాత ఉద్యోగుల సేవా నిబంధనలు, రిజర్వేషన్లు, శాఖల నిర్వహణ, రుణ విధానాలపై చట్టబద్ధమైన హామీలు బహిరంగంగా ప్రకటించలేదు. మాటలతో సరిపెట్టకుండా రాతపూర్వక హామీలు ఇవ్వాలి. 'మేము, ఎల్ఐసీ వాటాదారులుగా కొనసాగుతాం' అని ప్రభుత్వం చెబుతోంది. కానీ 15, 19 శాతాల మైనారిటీ వాటాలతో బ్యాంకు విధానాలపై నియంత్రణ ఉండదు! అంతేకాదు, ఈ ఒప్పందం ఇంకా రిజర్వ్‌బ్యాంక్ అనుమతులపై ఆధారపడి ఉంది. ఫెయిర్‌ఫాక్స్ 'ఫిట్ అండ్ ప్రాపర్' ప్రమాణాలకు, నియంత్రణ షరతులకు అనుగుణంగా ఉంటుందో లేదో తేలాల్సి ఉంది.



చలిమంటలకు ఏ చమురు అనర్హం!

అవకాశవాదం... అమెరికా.. ఈ రెండిటినీ విడదీసి చూడటం అసాధ్యం. ప్రపంచానికి ఎన్ని ఆదర్శాలను అమెరికా చెప్పిందో అంతకుమించి అవకాశవాదాలనూ ప్రదర్శించింది. స్వేచ్ఛా జీవితాన్ని గడపటానికీ, ఆనందాన్ని అనుభవించటానికీ పుట్టుకతోనే మనిషికి కొన్ని హక్కులు ఉంటాయని చాలా గొప్పగా తన స్వాతంత్ర్య ప్రకటనలో చెప్పిన అమెరికా దాన్ని ఏనాడూ పాటించలేదు. ఆఫ్రికా నుంచి కొనుగోలు చేసి అమెరికాకు తెచ్చిన లక్షలాది నల్లజాతీయులకు ఆ హక్కులను ఇవ్వాలన్న ఆలోచన రాలేదు. బానిసత్వాన్ని సహజసిద్ధమైన వ్యవస్థగా ఆమోదించి దశాబ్దాలపాటు దాన్ని అమలుచేసింది. 1965 వరకూ నల్లజాతీయులకు సమానహక్కులను ఇవ్వలేదు. అట్లాంటిక్ తీరం నుంచి పసిఫిక్ తీరం వరకూ దేశాధికారాన్ని విస్తరించే క్రమంలో వందలాది ఆదిమ తెగలను హరించివేసింది. ప్రజాస్వామ్య రాజకీయాలనూ, వ్యక్తి స్వేచ్ఛనూ, ప్రైవేటు వ్యాపారాలనూ ప్రపంచమంతా విస్తరించటమే తన లక్ష్యాలని చెబుతూ అనేక దేశాల్లో నియంతృత్వ ప్రభుత్వాలకు వెన్నుదన్నుగా నిలిచింది. మత, ఛాందసవాద సమూహాలను ప్రోత్సహించింది. ప్రపంచ ప్రయోజనాల పేరుతో నిన్నటి దాకా తప్పు.. తప్పు.. అని చెప్పి.. ఒక్కరోజులోనే దాన్ని ఒప్పు.. ఒప్పు అనగలిగిన అవకాశవాద నేర్పరితనం అమెరికాకు వెన్నతో పెట్టిన విద్య. రష్యా నుంచి పెద్దఎత్తున చమురు కొనుగోలు చేయనున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల ఘనంగా చేసిన ప్రకటనే ఇందుకు నిదర్శనం. నాలుగేళ్లకు పైగా సాగుతోన్న రష్యా–ఉక్రెయిన్ యుద్ధంతో ప్రపంచమే అట్టుడికిపోతోంది. రష్యాది దురాక్రమణగా భావించిన అమెరికా ఎన్ని ఆంక్షలు విధించాలో అన్నీ విధించింది.



ఆ దేశం నుంచి చమురు కొంటున్న దేశాలను అదిరించి బెదిరించి లొంగదీసుకుంది. భారత్ కూడా ఒకదశలో రష్యా నుంచి కొనుగోళ్లను దాదాపుగా ఆపివేసింది. రష్యాతో లావాదేవీలను నడిపే దేశాలపై దిగుమతి సుంకాలనూ అమెరికా పెద్దఎత్తున విధించింది. ఉక్రెయిన్ సార్వభౌమత్వాన్ని కాపాడే పేరుతో విదేశాల్లో ఉన్న రష్యా ఆస్తులనూ స్తంభింపచేసింది. ఇంతటి శత్రుపూరిత వైఖరిని అతి తేలికగా మార్చుకుని అవకాశవాదంలో తనకు సాటిలేదనే విషయాన్ని అమెరికా మరోమారు స్పష్టంచేసింది. ఇలాంటి అవకాశవాదాన్ని దృష్టిలో ఉంచుకుని అమెరికా నిర్వాకాలపై గతంలో లోతైన విశ్లేషణలూ, కవిత్వాలూ చాలానే వచ్చాయి. 1961లో మహాకవి శ్రీశ్రీ కూడా ఆనాటి అమెరికా అధ్యక్షుడు కెన్నడీని ఉద్దేశిస్తూ కవిత రాశారు. 'అరువులిచ్చి కరువు తెచ్చి.. రుణంపెట్టి రణం తెచ్చి.. జనసంధనం ఇంధనమై.. చరణ కరాబంధనమై.. జనన జరా మరణ దురాక్రమణల సంగ్రథనమై.. ఒకనాడోహో అనిపించుక తిరిగిన.. ధనికవాద మికపై వెగటై జిగటై..' అంటూ ఆనాడు శ్రీశ్రీ రాసిన కవితలో కొన్ని పంక్తులు ఇప్పటికీ బాగా సరిపోతాయి. ట్రంప్ హయాంలో అమెరికా ధనికవాదం వెగటై.. జిగటై గతంలో ఎన్నడూ లేనంతగా అసహ్యం పుట్టిస్తోంది. ఒకప్పటి అమెరికా అధ్యక్షులైన అబ్రహాం లింకన్, జాన్.ఎఫ్.కెన్నడీ లాంటి వారు వ్యక్తంచేసిన ఆదర్శ అభిప్రాయాలకు ప్రభావితమైన ప్రజాస్వామ్య ప్రియులు చాలామందే ఉండేవారు. ట్రంప్ లాంటి వాళ్లకు అట్లాంటివేవీ లేవు కనుక ప్రతి విధానమూ, ప్రతి ప్రకటనా ఇప్పుడు వెగటుగానే అనిపిస్తోంది. అన్నింట్లోనూ అమెరికా ప్రయోజనాలకే పెద్ద పీట వేస్తామనీ, అందుకు అడ్డుగా ఉన్న అంతర్జాతీయ చట్టాలనూ, సంస్థలనూ, ఒప్పందాలనూ కాలరాస్తామని స్వయంగా అమెరికా అధ్యక్షుడే చెబుతుంటే నాగరీక మనుషులు సహించలేరు. వేల సంవత్సరాల సంస్కృతులు కలిగి, సుదీర్ఘ చరిత్రలో మానవాళి అభివృద్ధికి ఎంతో దోహదం చేసిన చైనా, భారత్ లాంటి దేశాల్లో గతం గురించి సమగ్ర అవగాహన పెరుగుతున్నకొద్దీ అమెరికాపై అసహనం ఎక్కువవుతుందే తప్ప తగ్గదు.అమెరికా మద్దతు లేకపోతే రష్యా–ఉక్రెయిన్ యుద్ధం ఇంతకాలం కొనసాగి ఉండేది కాదు. రష్యా అధ్యక్షుడు పుతిన్ ప్రజాస్వామ్యవాది కాదు.ఆ దేశంలో ప్రజాస్వామ్య రాజకీయాలూ లేవు. నియంతల మనుగడకూ కొన్ని అంశాలు.. ముఖ్యంగా జాతి ప్రయోజనం, గౌరవం, భద్రత పేరుతో కూడినవి.. చాలా బాగా ఉపయోగపడతాయి. అమెరికా సారథ్యంలోని నాటో కూటమి స్వార్థం, అహంకారంతో వేసిన తప్పటడుగులు రష్యాను ఉక్రెయిన్ మీదకు ఉసిగొల్పేలా చేయగలిగాయి. జర్మనీ ఏకీకరణ (1990) సందర్భంగా నాటో విస్తరణ ఒక్క అంగుళం కూడా అదనంగా ఉండదని ఆనాటి సోవియట్ యూనియన్ అధ్యక్షుడైన మిఖాయిల్ గోర్బచెవ్‌కు అమెరికా హామీ ఇచ్చింది. ఈ హామీ మేరకే జర్మనీ ఏకీకరణ సాఫీగా సాగటానికి సోవియట్ యూనియన్ సహకరించింది.ఆ తర్వాత కొద్దికాలానికే సోవియట్ యూనియన్ (1991 డిసెంబర్ 26) పతనమైంది. రష్యా సహా 15 దేశాలు విడివిడిగా ఏర్పాటయ్యాయి. వీటిల్లో 9 దేశాలు క్రమంగా నాటోలో చేరిపోయాయి. ఒక్క అంగుళం హామీ అలా గాల్లో కలిసిపోయింది. రష్యాలో 2000 సంవత్సరం వరకూ ఆర్థికంగా అల్లకల్లోల పరిస్థితులే ఉన్నాయి. వీటికీ ఒక రకంగా అమెరికాయే కారణం. దశాబ్దాల పాటు కొనసాగిన ప్రభుత్వ నియంత్రిత ఆర్థిక వ్యవస్థను ఒక్కపెట్టున ప్రైవేటుపరం చేయటంతో పరిస్థితులు గాడితప్పాయి. ప్రభుత్వ సంస్థలనూ, కంపెనీలనూ కారుచౌకగా ప్రైవేటు రంగానికి కట్టబెట్టారు. అన్నిటినీ మార్కెట్‌కే వదిలివేయటంతో ధరలూ, నిరుద్యోగమూ విజృంభించాయి. బ్లాక్‌మార్కెట్ సర్వసాధారణమైంది. విద్య, వైద్యరంగం, ప్రాథమిక సౌకర్యాల్లో ప్రభుత్వ పెట్టుబడులు తగ్గిపోవటంతో జీవన ప్రమాణాలు క్షీణించాయి. ప్రైవేటురంగంతో పోటీ పెరిగి రష్యా అభివృద్ధి పథంలో పరుగులు పెడుతుందన్న జోస్యాలు ఏ రకంగానూ నిజంకాలేదు. ఒకరకంగా అరాచకమే ప్రబలిపోయింది. అట్లా అమెరికా ప్రభుత్వమూ, ఆ దేశ మేధావులూ సూచించిన విధానాలు అస్తవ్యస్త పరిస్థితులకే దారితీశాయి. పుతిన్ అధికారాన్ని చేజిక్కించుకోటానికి అవే కారణమయ్యాయి. ఆ నేపథ్యంలోనే రష్యాకు మళ్లీ ఒకనాటి వైభవాన్ని తీసుకువస్తానన్న పుతిన్ వాగ్దానాలు ప్రజలపై ప్రభావాన్ని కలగచేశాయి. ఒక భాష, ఒక మతం, ఒక జాతి (Ethnic Community) దేశ అస్తిత్వానికి పునాదిగా ఉన్నచోట భావోద్వేగాలను రెచ్చగొట్టటం తేలిక. రష్యాకు చుట్టూ ప్రమాదం ముంచుకొస్తోందన్న పుతిన్ ప్రచారానికి ఆ ఉద్వేగాలు తోడ్పడ్డాయి. ఉక్రెయిన్, జార్జియాలు కూడా భవిష్యత్తులో నాటోలో చేరతాయన్న ప్రకటనతో (2008) రష్యాలో భయాలు మరింత తీవ్రమయ్యాయి. ఇక అక్కడి నుంచి ఉక్రెయిన్‌పై రష్యా బాగా దృష్టి పెట్టింది. రష్యాకు అనుకూలంగా ఉండే ఉక్రెయిన్ అధ్యక్షుడు విక్టర్ యూనుకోవిట్ అధికారాన్ని కోల్పోవటంలో అమెరికా, పశ్చిమ యూరప్ దేశాల పాత్ర చాలా ఉంది. మైదాన్ విప్లవం పేరుతో ఉక్రెయిన్‌లో జరిగిన రాజకీయ పరిణామాలకు అమెరికా పూర్తిగా సహకరించింది. ఆ వెంటనే క్రిమియాను రష్యా ఆక్రమించింది. ఉక్రెయిన్‌లోని రష్యా సరిహద్దు ప్రాంతాల్లో తిరుగుబాట్లను పోత్సహించింది. చివరికి 2022 ఫిబ్రవరిలో ఉక్రెయిన్‌పై ప్రత్యక్ష యుద్ధానికి దిగింది.ఉక్రెయిన్‌కు యుద్ధ సహాయం కింద అమెరికా ఈ ఏడాది మార్చివరకూ రూ.12 లక్షల కోట్లను ఖర్చుపెట్టింది. మొత్తంగా రూ.17 లక్షల కోట్లు వ్యయం అవుతాయని లెక్కలుకట్టింది. ఇవిగాక ప్రపంచ బ్యాంకు నుంచి ఉక్రెయిన్‌కు రూ.1.90 లక్షల కోట్లను రుణంగా ఇప్పించింది. యూరోపియన్ యూనియన్ (ఈయూ) మరో రూ.22 లక్షల కోట్లను ఉక్రెయిన్ యుద్ధానికి ఖర్చు చేస్తోంది. అంటే అమెరికా, ఈయూ కలిసి దాదాపు రూ.40 లక్షల కోట్లను వెచ్చిస్తున్నాయి. ఉక్రెయిన్ తటస్థ దేశంగా ఉంటుందనీ, నాటో కూటమిలో చేర్చుకునేది లేదనీ స్పష్టంచేయకుండా, నాలుగున్నర ఏళ్ల నుంచీ దౌత్యపరమైన చొరవను ప్రదర్శించకుండా, లక్షల మరణాలకూ, భౌతిక ఆస్తుల విధ్వంసానికి అమెరికాయే ప్రధానంగా ప్రత్యక్ష, పరోక్ష కారణమైంది. ఇంతగా కకావికలు చేసి మధ్యంతర ఎన్నికల్లో గెలవటానికి రష్యా చమురు కొనుగోలునే అస్త్రంగా చేసుకుని రాజకీయంగా దిగజారిపోతున్న ప్రతిష్ఠను కాపాడుకోటానికి ట్రంప్ ప్రయత్నిస్తున్నారు. ఎన్నికల ఫలితాల అనంతరం అవసరమైతే మళ్లీ రష్యా చమురు అమ్మకాలపై నిషేధాన్ని విధించొచ్చు. యుద్ధం వల్ల ఇప్పటికే జరిగిన ప్రాణనష్టం లక్షల్లో ఉంది. అనధికార అంచనాల ప్రకారమే ఇరు దేశాలకు చెందిన 6 లక్షల మంది సైనికులు మరణించారు. ఇందులో రష్యను సైనికులే నాలుగున్నర లక్షల దాకా ఉండొచ్చు. పౌరులు 20 వేల మంది చనిపోయి ఉంటారన్నది అంచనా. గాయపడిన వాళ్లు 15 లక్షల దాకా ఉండొచ్చు. ఆస్తుల విధ్వంసం, ఆర్థిక వ్యవస్థకు ఇతరత్రా జరిగిన నష్టం ఉక్రెయిన్‌లోనే రూ.82 లక్షల కోట్లు ఉంటుంది. యుద్ధం ముగిస్తే ఆ దేశంలో పునర్ నిర్మాణానికి రూ.56 లక్షల కోట్లు ఖర్చుపెట్టాల్సి వస్తుంది. ఇక రష్యాలో జరిగిన నష్టం గురించి అంచనాలు బయటకు రావటం లేదు. ఉక్రెయిన్‌తో పోల్చితే అది నాలుగో వంతే ఉండొచ్చు. ఈ శతాబ్దంలో అమెరికా ప్రత్యక్షంగా యుద్ధాలు చేసిన చోటా (ఆఫ్ఘానిస్థాన్, ఇరాక్), పరోక్షంగా యుద్ధాలను రగిల్చిన చోటా ఎక్కడా శాంతిని నెలకొల్పిన దాఖలాల్లేవు.అవకాశవాదమే పైచేయి అవ్వటంతో మధ్యలోనే తప్పుకొని బాధితులనే పరిస్థితులను చక్కదిద్దుకోమని వదిలివేయటమే ఎక్కువ. ఆఫ్ఘానిస్థాన్‌లో అదే చేసింది. చివరికి తాలిబన్లకే అక్కడ అధికారం అప్పగించింది. వాళ్లక్కడ ఆటవిక పాలనను అమలుచేస్తున్నారు. ఉక్రెయిన్ విషయంలో కూడా అదే చేసే అవకాశం ఉంది. రష్యా కోరిన విధంగా భూభాగాలను అప్పగించి శాంతిని కుదుర్చుకోవాలనే లోపాయికారిగా చెబుతోంది. అణ్వస్త్రాలను తయారుచేసే సామర్థ్యాన్ని సంతరించుకుంటోందన్నెపంతో ఇరాన్‌తో యుద్ధం మొదలుపెట్టి, చేయాల్సిన విధ్వంసం చేసిన తర్వాత అనుకున్నది సాధించలేని అశక్తతలో పడిపోయింది. ఎన్ని బీరాలు పలికినా ఇరాన్ నియంత్రణను కాదని హోర్ముజ్ జలసంధిలో చమురు రవాణాను సమగ్రంగా పునరుద్ధరించలేకపోయింది. అందుకే అవకాశవాదాన్ని మరోమారు ఆశ్రయించి రష్యా చమురు విక్రయాలకు అనుమతించింది. అన్ని రంగాల్లో ముందున్నామని ప్రకటించుకునే అమెరికా అవకాశవాదంలోనూ అగ్రగామిగా ఉండటం కొత్తేమీ కాకపోవచ్చు. కానీ మారిన అంతర్జాతీయ పరిస్థితుల్లో, ఆసియా దేశాలు దూసుకుపోతున్న శతాబ్దంలో అమెరికా ఏకాకిగా మారే తరుణం ఎంతో దూరంలో లేదు. ఇప్పటికే ఆ ఛాయలు కన్పిస్తున్నాయి. ఇజ్రాయెల్ తప్ప ఎవరూ ఇప్పుడు అమెరికాను విశ్వసించటం లేదు. భారత్ వాణిలో కూడా ఇటీవల మార్పులు వస్తున్నాయి. అమెరికా ఒంటరితనాన్ని కోరితెచ్చుకుంటోందని విదేశాంగమంత్రి జైశంకర్ వ్యాఖ్యానించటమే అందుకు నిదర్శనం.

ఎదురుగాలే ఎదుగుదలకు ఊతం!

పరిస్థితులన్నీ అనుకూలిస్తూ అంతా మనం అనుకున్నట్టే జరుగుతుంటే జీవితం సాఫీగా సాగిపోతుంది. కానీ మనలో దాగి ఉన్న అసలు సామర్థ్యం బయటపడేది మాత్రం ప్రతికూల పరిస్థితులు ఎదురైనప్పుడే. నిజానికి జీవితంలో ఎదురయ్యే ప్రతికూలతలన్నీ అడ్డంకులు కావు. చాలాసార్లు అవే మన ప్రగతికి సోపానాలు. గాలిపటం గాలితో కలిసి ఎగరదు. గాలికి ఎదురుగా పైకి ఎగురుతుంది. వెనుకనుంచి గాలి వీస్తే గాలితో పాటు కొట్టుకుపోతుంది. ఎదురుగాలే దాన్ని పైకి లేపుతుంది.



బలమైన ఈదురుగాలులూ, భారీ అలలతో కూడిన సముద్రంలోకి వెళ్లినప్పుడే నౌక కెప్టెన్ నైపుణ్యం ఏంటో తెలుస్తుంది. వాతావరణం అనుకూలంగా ఉండి అలలులేని సముద్రంలో ఎవరైనా ఓడను నడపగలరు. తుపానులో కూడా దిశను కోల్పోకుండా ఓడను గమ్యం వైపు నడపగలిగినవాడే నిజమైన నావికుడు. ప్రతికూల పరిస్థితులే మనలోని నైపుణ్యాలను మెరుగుపరుస్తాయి. మనం చేసే ప్రతి పనినీ అందరూ ఆమోదించాలని ఆశించడం సహజం. కానీ అది సాధ్యం కాదు. మన ఆలోచనలనూ, నిర్ణయాలనూ, పనితీరునూ ఎవరైనా విమర్శించవచ్చు. అంతమాత్రాన వాళ్లు శత్రువులు కారు. కొన్నిసార్లు మనకు కనిపించని లోపాన్ని మరొకరు చూపిస్తారు. విమర్శ ఎదురైనప్పుడు, 'నన్నెందుకు విమర్శించారు' అని బాధపడటంకన్నా 'ఇందులో నేర్చుకోవాల్సింది ఏదైనా ఉందా?' అని ఆలోచించాలి. విమర్శను అహంకారంతో తిరస్కరిస్తే ఒక పాఠాన్ని కోల్పోవచ్చు. విమర్శలోని ఉపయోగకరమైన అంశాన్ని 'ఫీడ్ బ్యాక్'లా స్వీకరిస్తే అది మనల్ని మరింత మెరుగుపరుచుకునే అపకాశమవుతుంది. మన తప్పును చూపించే వ్యక్తి మనకు నచ్చకపోవచ్చు. కానీ అతడు చూపించిన తప్పు మనకు ఉపయోగపడవచ్చు. ఇదే 'గ్రోత్ మైండ్‌సెట్'లోని సారం! అలాగే ప్రతి తిరస్కరణా మన విలువను తగ్గించదు. కొన్నిసార్లు అది సామర్థ్యానికి మరింత పదును పెడుతుంది. ఉహించని ప్రతికూల పరిస్థితులు ఎదురైనప్పుడు, 'నాకే ఇలా ఎందుకు జరుగుతోంది?' అనుకోకుండా, 'ఈ పరిస్థితి నాకు ఏం నేర్పడానికి వచ్చింది!' అని ప్రశ్నించుకోవాలి. ఆ ప్రశ్న మన దృష్టికోణాన్ని మార్చగలదు. ప్రతికూలతను శాపంగా చూసే మనస్తత్వం నుంచి పాఠంగా చూసే దిశగా తీసుకెళ్లగలదు.

గాలిపటం ఎప్పుడూ గాలితో 'యుద్ధం' చేయదు. గాలిని ఉపయోగించుకుంటుంది. మనమూ ప్రతికూల పరిస్థితులతో పోరాడనక్కర్లేదు. వాటిని అర్థం చేసుకుని మన ఎదుగుదలకు అనుకూలంగా మలచుకోవాలి. గాలిపటం ఎంత ఎత్తుకు ఎగిరినా దారంతో కలిసి ఉన్నంతవరకే అది సురక్షితం. ఎగరడానికి గాలి ఒక్కటే సరిపోదు. పటం దృఢంగా ఉండాలి. దారం బలంగా ఉండాలి. పట్టుకున్న చేయి స్థిరంగా ఉండాలి. సరైన దిశ కూడా ముఖ్యం. జీవితంలో ప్రతికూలతలు ఉంటేనే మన ఎదుగుదల జరిగిపోతుందని కాదు. వాటిని ఎంత సమర్థంగా ఎదుర్కొన్నామన్నది ముఖ్యం. క్రమశిక్షణ, విలువలు, ఆత్మవిశ్వాసం అనే 'దారం'తో జీవితాన్ని అనుసంధానించుకున్నప్పుడే ఎంత ఎత్తుకు ఎదిగినా మనమూ స్థిరంగా ఉండగలం. అసలు 'ఎదురు గాలి' అనేదే ఉండకూడదని కోరుకోవడం కంటే, ఎంతటి ఎదురు గాలిలోనైనా ఎగరగలిగే బలమైన 'రెక్కల'ను కోరుకుందాం!

సీఈసీ తొలగింపు అంత సులభం కాదు!

సర్ ప్రక్రియలో అక్రమాలు జరిగాయని ఆధారాలతో రుజువులు చూపిస్తున్న ఉద్యమకారులు ఆయన రాజీనామా చేయాలని కోరుతున్నారే కానీ, తొలగించాలని డిమాండ్ చేయలేకపోతున్నారు. కారణం– ఎన్నికల సంఘం సభ్యుల నియామక ప్రక్రియలో చోటుచేసుకున్న మార్పులే. ప్రస్తుతం అమల్లో వున్న నిబంధనల ప్రకారం ఎన్నికల సంఘం ప్రధాన అధికారికి పటిష్ఠమైన రక్షణ వ్యవస్థ ఉంది. తనంతట తానుగా ఆయన రాజీనామా చేస్తే మినహా తొలగించడం లేదా బర్తరఫ్ చేయడం సులభం కాదు.

రాజ్యాంగం ప్రకారం ఆయనను తొలగించాలంటే సుప్రీంకోర్టు న్యాయమూర్తిని తొలగించే పద్ధతిని పాటించాలి. సీఈసీని తొలగించే పద్ధతిని అభిశంసించడం అంటారు. ఇందుకు 100 లోక్‌సభ లేదా 50 మంది రాజ్యసభ సభ్యులు స్పీకర్/రాజ్యసభ ఛైర్మన్‌కు నోటీసు అందజేయాలి. ఆ తర్వాత సీఈసీపై వచ్చిన ఆరోపణలపై ముగ్గురు సభ్యులతో కూడిన కమిటీ విచారణ జరపాలి. ఉభయ సభలలోనూ మూడింట రెండొంతుల మంది సభ్యులు ఆమోదంతో తీర్మానం నెగ్గాలి. దానిని రాష్ట్రపతి ఆమోదించినప్పుడు మాత్రమే చీఫ్ ఎలక్షన్ కమిషనర్‌ను తొలగించడం సాధ్యం అవుతుంది. సీఈసీ రాజీనామా చేయాలంటూ దేశ రాజధాని అట్టుడికిపోతున్నా జ్ఞానేష్‌కుమార్ నిమ్మకు నీరెత్తినట్టు ఉండడానికి కారణం ఇదే.

అనంత జనశక్తి
జనం కోసమే మా అక్షరం
శుక్రవారం ⁞ 27.11.2026 ⁞ 01

ప్రజాస్వామ్య బలోపేతానికి ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి: దేవినేని ఉమా

- గొల్లపూడిలో 268వ బూత్‌లో ఓటు హక్కు వినియోగించుకున్న మాజీ మంత్రి దేవినేని ఉమా

విజయవాడ రూరల్, నవంబర్ 26, అనంత జనశక్తి న్యూస్



రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న తొలి దశ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా విజయవాడ రూరల్ పరిధిలోని గొల్లపూడి పంచాయితీ సాయిపురం కాలనీలో 268వ బూత్‌లో మాజీ మంత్రి, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవినేని ఉమామహేశ్వరరావు తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.ఈ సందర్భంగా ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ఓటు వేయడం ప్రతి పౌరుడి హక్కుతో పాటు బాధ్యత అని పేర్కొన్నారు. మన ప్రాంత అభివృద్ధి, భవిష్యత్తు కోసం ప్రతి ఒక్కరూ ఎన్నికల్లో చురుకుగా పాల్గొని తమ ఓటు హక్కును తప్పని సరిగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.

ఎన్.పి.కుంటలో కూటమి ప్రచారానికి జనప్రభంజనం

- ఎమ్మెల్యే కందికుంట, మాజీ ఎమ్మెల్యే పార్థసారథికి ప్రజల ఘన స్వాగతం.. అభ్యర్థుల విజయానికి విస్తృత ప్రచారం

ఎన్.పి.కుంట, నవంబర్ 26

(అనంత జనశక్తి న్యూస్):

ఎన్.పి.కుంట మేజర్ పంచాయతీలో కూటమి ఎన్నికల ప్రచారం జనప్రభంజనాన్ని తలపించింది. కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, మాజీ ఎమ్మెల్యే ఎంఎస్ పార్థసారథి నిర్వహించిన ప్రచారానికి గ్రామ ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. కూటమి బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి పాలగిరి మహబూబ్ భాష, వార్డు సభ్యుల అభ్యర్థులకు మద్దతుగా నిర్వహించిన రోడ్‌షోలో నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అడుగడుగునా ప్రజల స్వాగతం, ఆత్మీయతతో ప్రచారం ఉత్సాహంగా సాగింది.

అంబేద్కర్‌కు ఘన నివాళులు

భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ కదిరి నియోజకవర్గ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. తొలుత భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళుల ర్పించారు. అనంతరం రాజ్యాంగ విలువలు, ప్రజాస్వామ్య స్ఫూర్తిని కాపాడేందుకు రాజ్యాంగ ప్రతిజ్ఞ చేయించారు.రాజ్యాంగం కల్పించిన హక్కులు, సమానత్వం, సామాజిక న్యాయం ప్రతి ఒక్కరికీ అందాలని, రాజ్యాంగ స్ఫూర్తితో ప్రజాసేవలో ముందుకు సాగాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

అభ్యర్థులకు మద్దతుగా రోడ్‌షో

అనంతరం ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, మాజీ ఎమ్మెల్యే ఎంఎస్ పార్థసారథి ఎన్.పి.కుంట మేజర్ పంచాయతీలో విస్తృతంగా పర్యటించారు. కూటమి బలపరిచిన సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థులకు మద్దతుగా రోడ్‌షో నిర్వహించారు.గ్రామంలోని ప్రధాన వీధుల్లో పర్యటిస్తూ ప్రజలను నేరుగా కలుసుకున్నారు. వారి సమస్యలను అడిగి తెలుసుకుంటూ గ్రామ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంపై నాయకులు చర్చించారు. ఇద్దరు నాయకులకు ప్రజలు ఘన స్వాగతం పలకడంతో ప్రచార కార్యక్రమం సందడిగా సాగింది.

గ్రామాభివృద్ధికి ప్రాధాన్యత

ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ మాట్లాడుతూ గ్రామ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించే నాయకత్వాన్ని ఎన్నుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్.పి.కుంటలో మౌలిక సదుపాయాల కల్పన, రహదారుల అభివృద్ధి, పారిశుద్ధ్యం, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు.ప్రజల ఆశీర్వాదంతో గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కూటమి కట్టుబడి ఉందని పేర్కొన్నారు. కూటమి సర్పంచ్ అభ్యర్థి పాలగిరి మహబూబ్ భాషకు, వార్డు సభ్యుల అభ్యర్థులకు ప్రజలు అండగా నిలవాలని కోరారు. సర్పంచ్ అభ్యర్థి మంచం గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని గ్రామ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



కార్యకర్తల్లో నూతన ఉత్సాహం

ఎన్.పి.కుంట మేజర్ పంచాయతీలో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, మాజీ ఎమ్మెల్యే ఎంఎస్ పార్థసారథి ప్రచారానికి లభించిన స్పందన కూటమి శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపింది. నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా ప్రచారాన్ని కొనసాగిస్తూ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు .ఈ కార్యక్రమంలో ఎన్.పి.కుంట మండల కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం 44వ వార్డులో ఓటు హక్కు వినియోగించుకున్న మంత్రి కందుల దుర్గేష్



- ప్రజాస్వామ్యంలో ఓటు రాజ్యాంగం కల్పించిన హక్కు.. ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలి: మంత్రి దుర్గేష్

- గోదావరి పుష్కరాలకు రాజమహేంద్రవరాన్ని మహానగరంగా తీర్చిదిద్దుతాం: మంత్రి కందుల దుర్గేష్

రాజమహేంద్రవరం నవంబర్ 26, అనంత జనశక్తి న్యూస్

ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరికీ ఓటు అనేది రాజ్యాంగం కల్పించిన అత్యంత విలువైన హక్కని, పౌరులందరూ బాధ్యతగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ పిలుపునిచ్చారు. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ (మున్సిపల్ కార్పొరేషన్) ఎన్నికల సందర్భంగా.. గురువారం నాడు ఆయన నగరంలోని 44వ వార్డులో శ్రీ శ్యామలాంబ మోడల్ స్పెషల్ మున్సిపల్ కార్పొరేషన్ అప్పర్ ప్రైమరీ స్కూల్లో ఓటు వేసి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. 44వ వార్డు నుంచి కూటమి అభ్యర్థిగా కంటిపూడి రాజేంద్ర ప్రసాద్ పోటీలో ఉన్నారని పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఓటింగ్ ప్రక్రియలో ఉత్సాహంగా పాల్గొనడం చూస్తుంటే ప్రస్తుత కూటమి ప్రభుత్వంపై ప్రజలకు ఉన్న నమ్మకానికి ఇది నిదర్శనమని ఆయన అభిప్రాయపడ్డారు. కూటమి ప్రభుత్వ పాలనలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు సమపాళ్లలో శరవేగంగా ముందుకు సాగుతున్నాయని మంత్రి తెలిపారు.రాజమహేంద్రవరం నగర భవిష్యత్తు ప్రణాళికలను ప్రస్తావిస్తూ.. 50 వార్డుల నుంచి 72 వార్డులకు విస్తరించిన ఈ నగరాన్ని ఒక మహానగరంగా నిర్మించుకోవాల్సిన అవసరం ఉందని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు. రాబోయే గోదావరి పుష్కరాల నాటికి రాజమహేంద్రవరాన్ని మహోద్యుతంగా తీర్చిదిద్దుకుందామని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.నగర సమగ్రాభివృద్ధి కోసం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని మంత్రి కందుల దుర్గేష్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మేయర్ అభ్యర్థిగా బరిలో నిలిచిన బిజెపి నేత రేలంగి శ్రీదేవికి 'కమలం' గుర్తుపై ఓటు వేయాలని, అదేవిధంగా ఆయా వార్డుల్లో కూటమి తరపున పోటీ చేస్తున్న అభ్యర్థులకు 'గాజు గ్లాసు', 'కమలం', 'సైకిల్' గుర్తులపై ఓటు వేసి గెలిపించడం ద్వారా నగర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు.

పోలీసుల తీరుపై ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ఆగ్రహం

- అహోబిలం వద్ద తన వాహనంపై, కార్యకర్తలపై దాడికి యత్నించారంటూ ఆరోపణ

- నిందితులను అదుపులోకి తీసుకోకుండా తననే అరెస్టు చేస్తామంటున్నారని ఆవేదన..

ధర్నాకు దిగిన ఎమ్మెల్యే

ఆళ్లగడ్డ నవంబర్ 26,అనంత జనశక్తి న్యూస్

నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని అహోబిలం వద్ద చోటుచేసుకున్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో పోలీసుల తీరుపై ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తన వాహనంపై, పార్టీ కార్యకర్తలపై రాళ్లు, కర్రలతో దాడికి ప్రయత్నించారని ఆరోపిస్తూ పోలీసుల తీరును ప్రశ్నించారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిని అరెస్టు చేయకుండా తననే అరెస్టు చేస్తామని పోలీసులు హెచ్చరిస్తున్నారని పేర్కొంటూ ధర్నాకు దిగారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రౌడీషీటర్‌గా, పీడీ చట్టం కింద కేసులు ఉన్న వ్యక్తిగా పేర్కొంటున్న సీసా వెంకటేశ్వర్లును గత వారం రోజులుగా గృహ నిర్బంధంలో ఉంచాలని పోలీసు అధికారులను కోరుతున్నప్పటికీ ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. తాను అహోబిలం వస్తున్న సమయంలో గేటు వద్ద సీసా వెంకటేశ్వర్లు అనుచరులు రాళ్లు, కర్రలతో ఉన్నట్లు గుర్తించి ఎస్పీకి, సీఐకి సమాచారం ఇచ్చినా ఎందుకు స్పందించలేదని నిలదీశారు.తన వాహనంతో పాటు కార్యకర్తలపై రాళ్లు, కర్రలతో దాడికి దిగిన ఘటనను చూస్తుంటే పోలీసు శాఖలోని కొందరి మద్దతు దాడికి పాల్పడిన వారికి ఉందనే అనుమానం కలుగుతోందని ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో విధులు నిర్వహించిన పోలీసు సిబ్బందికి ప్రస్తుత ఎన్నికల విధులు ఎలా కేటాయిస్తారని ప్రశ్నించారు. అహోబిలంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నప్పటికీ సంబంధిత వ్యక్తులను అదుపులోకి తీసుకోకుండా



తనను అరెస్టు చేస్తామని ఎస్పీ చెప్పడం ఏమిటని అఖిలప్రియ ప్రశ్నించారు. తాను ఇక్కడి నుంచి కదిలేది లేదని, అరెస్టు చేయాలనుకుంటే చేయవచ్చని చెబుతూ అక్కడే బైఠాయించి నిరసన తెలిపారు. అహోబిలం వద్ద చోటుచేసుకున్న పరిణామాలతో రాజకీయ వాతావరణం వేడెక్కింది. ఎమ్మెల్యే చేసిన ఆరోపణలపై పోలీసు శాఖ స్పందన, ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

రాజ్యాంగ విలువలను ప్రతి ఒక్కరూ కాపాడాలి



- శ్రీ సత్య సాయి జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

- పుట్టపర్తి కలెక్టరేట్‌లో ఘనంగా భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలు

పుట్టపర్తి, నవంబర్ 26:అనంత జనశక్తి న్యూస్

భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం పుట్టపర్తిలోని జిల్లా కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్ నందు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రపంచంలోనే అతిపెద్ద లిఖిత రాజ్యాంగం మన దేశానిదని, దేశ పౌరులందరికీ సమాన హక్కులు, స్వేచ్ఛను కల్పించిన మహోన్నత గ్రంథం భారత రాజ్యాంగమని కొనియాడారు.ప్రభుత్వ అధికారులు, సిబ్బంది రాజ్యాంగ స్ఫూర్తితో ప్రజలకు పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన సేవలు అందించాలని సూచించారు.ప్రతి పౌరుడు తమ హక్కులతో పాటు ప్రాథమిక విధులను కూడా బాధ్యతాయుతంగా నిర్వర్తించినప్పుడే దేశం మరింత అభివృద్ధి చెందుతుందని ఆయన పేర్కొన్నారు.అనంతరం జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ అధికారులు, సిబ్బంది అందరూ భారత రాజ్యాంగ పీఠికను సామూహికంగా పఠించి, ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో డిఆర్ఓ కొండయ్య, ఎస్‌డిసి విజయ కుమారి,ఎస్‌డిసి మహబూబ్ భాష,వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ పరిపాలనా అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

ఓటర్ల ఉత్సాహం పటిష్ట పోలీసు నిఘా మధ్య పోలింగ్



- ప్రశాంత వాతావరణంలో కొనసాగిన సర్పంచ్ ఎన్నిక.....

- ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఓటర్ల ఉత్సాహం...

ధర్మవరం, నవంబర్ 26 అనంత జనశక్తి న్యూస్ :

పోతుకుంట గ్రామ పంచాయతీలో సర్పంచ్ ఎన్నికల పోలింగ్ ప్రశాంత వాతావరణంలో కొనసాగుతోంది. ఓటర్లు పెద్ద సంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు. ఇప్పటివరకు పంచాయతీలో 80 శాతం పోలింగ్ నమోదైనట్లు సమాచారం. ఉదయం నుంచే ఓటర్లు ఉత్సాహంగా పోలింగ్ కేంద్రాలకు చేరుకోవడంతో సందడి వాతావరణం నెలకొంది. ఎన్నికల ప్రక్రియ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా సజావుగా సాగుతోంది. ఎన్నికల నేపథ్యంలో జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ నేతృత్వంలో పోలీసు శాఖ పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. ధర్మవరం డీఎస్పీ జగన్నాథ రాజు ఆధ్వర్యంలో పోలింగ్ కేంద్రాల వద్ద భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోలీసులు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ పరిస్థితులను పర్యవేక్షిస్తున్నారు. పోలింగ్ కేంద్రాల పరిసరాల్లో నిరంతర భద్రతా నిఘా కొనసాగిస్తూ, ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా ముగిసేలా అధికారులు చర్యలు చేపట్టారు.

సమాజ సేవతో జన్మదిన వేడుకలు.. రోగులకు పండ్లు, అన్నదానం

- గుడిబండలో సమాజ సేవకుడు హరినాథరెడ్డి పుట్టినరోజు సందర్భంగా సేవా కార్యక్రమాలు

గుడిబండ నవంబర్ 26,అనంత జనశక్తి న్యూస్

పుట్టినరోజు వేడుకలను ఆడంబరాలకు దూరంగా సమాజహిత కార్యక్రమాలతో జరుపుకోవడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. సమాజ సేవకుడు హరినాథరెడ్డి పుట్టినరోజును పురస్కరించుకుని గుడిబండ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, హార్లిక్స్ వంటి పౌష్టికాహార పదార్థాలు పంపిణీ చేయడంతో పాటు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు పంపిణీ చేసి, భోజనం అందించారు.పుట్టినరోజును ఇతరులకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలతో జరుపుకోవాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా ముఖ్య నాయకుడు మంజునాథరెడ్డి మాట్లాడుతూ..హరినాథరెడ్డి గత కొన్నేళ్లుగా సమాజ సేవలో చురుగ్గా పాల్గొంటూ పేదలు, నిరుపేదలు, అభాగ్యులకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తున్నారని కొనియాడారు. ఆయన సేవా కార్యక్రమాలు మరింత విస్తరించి, భవిష్యత్తులో మరెంతో మందికి అండగా నిలవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మంజునాథరెడ్డి, ఏ.వి.టి. నారాయణస్వామి, జి.టి. వెంకటేష్, గోవింద, అశ్వత్ పాల్గొన్నారు.



పంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తా.

పుట్టపర్తి రూరల్ నవంబర్ 26 అనంత జన శక్తి న్యూస్.

తెలుగుదేశం పార్టీ సానుభూతిపరురాలుగా బరిలో నిల్చామని, తమను గెలిపిస్తే పంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తానని, కప్పల బండ పంచాయతీ అభ్యర్థి లెక్కల భాగ్యమ్మ ఓటర్లను కోరారు. కప్పల బండ పంచాయతీ పరిధిలో 10147 ఓట్లు ఉండగా, నలుగురు అభ్యర్థులు సర్పంచ్ అభ్యర్థులుగా వరిలో ఉన్నారు. జనరల్ మహిళకు కప్పల బండ పంచాయతీ కేటాయించగా పంచాయతీ సర్పంచిగా గెలుపొందాలని ధీమాతో ఒకరి మీద ఒకరు పోటీతో నలుగురు అభ్యర్థులు ప్రచారం నిర్వహిస్తున్నారు. వారిలో ముఖ్యంగా తెలుగుదేశం నాయకులు లెక్కల గోపాల్ భార్య భాగ్యమ్మ ప్రచారం ముమ్మరం చేసింది. గురువారం కప్పల బండ, మామిళ్ళ కుంట క్రాస్ ,గ్రామంలో ఇంటింటికి వెళ్లి తనకు కేటాయించిన గంప గుర్తును ఓటర్లకు తెలిపి ఓటు వేసి గెలిపించాలని కోరారు. తమను గెలిపిస్తే పంచాయతీలో సమస్యలు లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని, అభివృద్ధికి తోడ్పడే వారిని ఎన్నుకోవాలని ఆమె సూచించారు. రాజకీయ అనుభవం లేని వారిని ఎన్నుకుంటే అభివృద్ధి ఉండదని తెలిపారు. ఈ సందర్భంగా ఆమె వెంట తెలుగుదేశం నాయకులు లెక్కల గోపాల్, వార్డు మెంబర్లు అనూష, లక్ష్మీ నరసమ్మ, నాయకులు, రిటైర్డ్ టీచర్ శివయ్య, జయమ్మ గంగాద్రి శివయ్య బాల శ్రీనివాసులు, మహేష్, దిలీప్, తదితరులు పాల్గొన్నారు.



వివాహానికి హాజరైన బొంబాయి

యాడికి, నవంబర్ 26, అనంత జనశక్తి న్యూస్:

మండల కేంద్రంలోని శ్రీ చౌడేశ్వరి దేవి కళ్యాణ మండపంలో ఓగేటి వివాహ వేడుకకు గురువారం వైఎస్ఆర్సీపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ బొంబాయి రమేష్ నాయుడు , మాజీ ఉపసర్పంచ్ కాసా చంద్రమోహన్ , బొంబాయి బ్రదర్ మాజీ ఎంపిటిసి వెంకటనాయుడు లు హాజరయ్యారు.నిండు నూరేళ్ళు సుఖశాంతులతో ఉండాలని నూతన వధువరులను వైఎస్ఆర్సీపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ బొంబాయి రమేష్ నాయుడు ,మాజీ ఉపసర్పంచ్ కాసా చంద్రమోహన్ , బొంబాయి బ్రదర్ మాజీ ఎంపిటిసి వెంకటనాయుడు లు ఆశీర్వదించి , బహుమతి ని అందచేశారు.అనంతరం విందును స్వీకరించారు. ఈయన తో పాటు పలువురు పాల్గొన్నారు.

కుష్ఠు రోగులకు పుట్టపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అవగాహన.

- పలమనేరు లో కుష్ఠు రోగులకు శస్త్ర చికిత్స.....

పుట్టపర్తి రూరల్ నవంబర్ 26 అనంత జన శక్తి న్యూస్.

పుట్టపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పుట్టపర్తి డివిజన్ పరిధిలో అంగవైకల్యం కలిగిన కుష్ఠు వ్యాధిగ్రస్తులకు పలమనేరులోని ఆసుపత్రిలో శస్త్ర చికిత్సలు చేయించవలయున్న ఉద్దేశ్యంతో డివిజన్ పరిధిలో గల అంగవైకల్యం కలిగిన కుష్ఠు రోగులను గుర్తించి, వారిని పలమనేరు వెళ్లాలని సూచించారు. కుష్ఠు వ్యాధి వ్యాపించే విధానం, నివారణ చర్యల గురించి అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కుష్ఠు వ్యాధి నివారణ అధికారి డా. ప్రణయ్, వైద్యాధికారిణి డా. కె. గాయత్రి, డీపీఎంఓ రెడ్డి కుమార్ రెడ్డి, ఫిజియోథెరపిస్ట్ పీటర్, సీహెచ్ఓ శివరాం, హెల్త్ సూపర్‌వైజర్ బి.వి. రమణ, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.



అనంత జనశక్తి
జనం కోసమే మా అక్షరం
శుక్రవారం
27.11.2026

రాజ్యాంగ విలువల ఆచరణే ప్రజాస్వామ్యానికి పునాది



- విశిష్ట రాజ్యాంగ ఆశయాల సాధనకు ప్రతి పౌరుడు కట్టుబడి ఉండాలి
- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

విజయవాడ నవంబర్ 26,అనంత జనశక్తి న్యూస్

భారత మహోన్నత రాజ్యాంగం కల్పించిన హక్కులను తెలుసుకోవడంతో పాటు రాజ్యాంగం నిర్దేశించిన బాధ్యతలను ప్రతి పౌరుడు నిబద్ధతతో పాటించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ పిలుపునిచ్చారు. రాజ్యాంగ విలువలు, ప్రజాస్వామ్య స్ఫూర్తి, సమానత్వం, న్యాయం, సౌభ్రాతృత్వ భావాలను ప్రతిఒక్కరూ తమ జీవితాల్లో ఆచరించాలని పేర్కొన్నారు.

గురువారం భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ఈ వేడుకల్లో కలెక్టర్ లక్ష్మీశ అధికారులతో కలిసి పాల్గొన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత డా. బి.ఆర్.అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రాజ్యాంగ పీఠికను చదివి రాజ్యాంగ ఆశయాలు, విలువలకు కట్టుబడి ఉండాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాజ్యాంగం దేశ ప్రజలకు సమాన హక్కులు, స్వేచ్ఛ, న్యాయం కల్పిస్తూ ప్రజాస్వామ్య వ్యవస్థకు పునాదిగా నిలుస్తుందని పేర్కొన్నారు. రాజ్యాంగంలోని ప్రాథమిక సూత్రాలను గౌరవిస్తూ, దేశ సమగ్రత, ఐక్యతను కాపాడేందుకు ప్రతిఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా రాజ్యాంగ రూపకల్పనలో భాగస్వాములైన మహనీయుల సేవలను స్మరించుకుంటూ, రాజ్యాంగ లక్ష్యాల సాధనకు కృషిచేయాలని కలెక్టర్ లక్ష్మీశ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, కలెక్టరేట్ ఏవో ఎస్.శ్రీనివాసరెడ్డి, కలెక్టరేట్ వివిధ సెక్షన్ల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వైకాపా నుంచి టీడీపీలోకి ఏడు కుటుంబాలు



- మంత్రి అచ్చెన్నాయుడు సమక్షంలో పార్టీలో చేరిన అక్కయ్యవలస గ్రామస్తులు

కోటబొమ్మాళి, నవంబర్ 26 (అనంత జనశక్తి న్యూస్):

శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి మండలం అక్కయ్యవలస గ్రామంలో రాజకీయ పరిణామం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఏడు కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరాయి. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సమక్షంలో వారు పార్టీ మారారు.ని మ్మాడలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో గిన్ని ధనుంజయ రెడ్డి, కోళ్ల నీలకంఠ రెడ్డి, గిన్ని ధర్మారెడ్డి, కోళ్ల జనార్దన్ రెడ్డి, గిన్ని జగ్గారావు, గిన్ని ఆమోస్ రెడ్డి తదితరులకు మంత్రి అచ్చెన్నాయుడు పసుపు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా నూతనంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ.. తెలుగుదేశం పార్టీ విధానాలు, కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల పట్ల ఆకర్షితులై పార్టీలో చేరినట్లు తెలిపారు. గ్రామంలో పార్టీ బలోపేతానికి, అభివృద్ధి కార్యక్రమాల అమలుకు సమష్టిగా కృషి చేస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కింజరాపు హరివరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ ఏర్పాట్లపై జాయింట్ కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



- ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కు...
- వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలి....

ధర్మవరం నవంబర్ 26 అనంత జనశక్తి న్యూస్ :

తొలి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టింది. ఇందులో భాగంగా గురువారం జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం. మౌర్య భరద్వాజ్ పోతుకుంట, కునుతూరు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసి పోలింగ్ సరళిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాటు చేసిన తాగునీరు, విద్యుత్ సరఫరా, నీడ కోసం టెంట్లు, దివ్యాంగులు, వృద్ధుల కోసం ర్యాంపుల సదుపాయాలను క్షుణ్ణంగా పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో బ్యాలెట్ బాక్సుల భద్రత, ఓటర్ల జాబితా పరిశీలన, పోలింగ్ సిబ్బంది విధుల నిర్వహణపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల సంఘం నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని సిబ్బందికి సూచించారు. అలాగే పోలింగ్ కేంద్రాల పరిసరాల్లో అమలవుతున్న 144 సెక్షన్, పోలీసు బందోబస్తు ఏర్పాట్లను సమీక్షించారు. ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు, భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులను ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల వద్ద క్యూలైన్లలో వేచి ఉన్న ఓటర్లతో మాట్లాడి ఏర్పాట్లపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైనదని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఎన్నికల విధుల్లో ఉన్న అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పోలింగ్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ ఎం. మౌర్య భరద్వాజ్ స్పష్టం చేశారు. ఈ తనిఖీల్లో ధర్మవరం తహశీల్దార్ దేవరాజు, ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పంటల బీమా బూటకం కాదు.. గణాంకాలే వాస్తవాలకు నిదర్శనం



- - ఖరీఫ్–2026లో రెట్టింపునకు పైగా పెరిగిన పంటల బీమా నమోదులు
- 17.07 లక్షల హెక్టార్లకు బీమా రక్షణ.. దేశంలో ఆరో స్థానంలో ఆంధ్రప్రదేశ్
- పెండింగ్ బీమా ప్రీమియం చెల్లింపులకు రూ.3 వేల కోట్లతో కార్యాచరణ
- ప్రకృతి విపత్తుల బాధిత రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు
- రైతుల సంక్షేమంపై వైసీపీ అపోహలు సృష్టించడం సరికాదు
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

అమరావతి, నవంబర్ 26:అనంత జనశక్తి న్యూస్

రాష్ట్రంలో పంటల బీమా అమలు, ఇన్‌పుట్ సబ్సిడీపై వాస్తవాలను విస్మరించి రైతులను తప్పుదోవ పట్టించేలా వైసీపీ అధిష్టానం తప్పుడు ప్రచారం చేయటం సరికాదని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. రైతులకు ఆర్థిక భద్రత కల్పించడం, ప్రకృతి విపత్తుల సమయంలో ఆదుకోవడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఖరీఫ్-2025తో పోలిస్తే ఖరీఫ్-2026లో పంటల బీమా నమోదులు రెట్టింపునకు పైగా పెరగడమే ప్రభుత్వ చర్యలకు నిదర్శనమన్నారు. ఖరీఫ్-2026లో రాష్ట్రవ్యాప్తంగా సాగైన 31.01 లక్షల హెక్టార్లలో 17.07 లక్షల హెక్టార్లు, అంటే సుమారు 42 లక్షల ఎకరాలు బీమా పరిధిలోకి వచ్చాయని మంత్రి తెలిపారు. మొత్తం సాగు విస్తీర్ణంలో 55.05 శాతం బీమా కవరేజీ సాధించామని, బీమా చేసిన విస్తీర్ణం పరంగా ఆంధ్రప్రదేశ్ దేశంలో ఆరో స్థానంలో నిలిచిందని వివరించారు. ఖరీఫ్-2025లో 18.88 లక్షలుగా ఉన్న బీమా దరఖాస్తులు ఖరీఫ్-2026లో 44.09 లక్షలకు పెరిగి 2.3 రెట్ల వృద్ధి నమోదైందన్నారు. రుణం పొందని రైతుల దరఖాస్తులు 2.00 లక్షల నుంచి 25.27 లక్షలకు పెరిగి 12.6 రెట్ల వృద్ధి సాధించాయని తెలిపారు. బీమా విస్తీర్ణం 7.67 లక్షల హెక్టార్ల నుంచి 17.07 లక్షల హెక్టార్లకు పెరిగి 2.2 రెట్ల వృద్ధి సాధించగా, బీమాలో చేరిన రైతుల సంఖ్య 7.43 లక్షల నుంచి 17.10 లక్షలకు పెరిగి 2.3 రెట్ల వృద్ధి నమోదైందన్నారు. స్వచ్ఛంద నమోదు విధానానికి రైతుల నుంచి లభిస్తున్న స్పందనకు ఈ గణాంకాలే నిదర్శనమని పేర్కొన్నారు.నమోదు గడువు పొడిగింపు, 2026 జూలై 29 నుంచి 31 వరకు నిర్వహించిన ప్రత్యేక ఇంటింటి ప్రచార కార్యక్రమాలు, రైతు సేవా కేంద్రాల వారీ పర్యవేక్షణ ఇందుకు దోహదపడ్డాయని వివరించారు.గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పంటల బీమా ప్రీమియం బకాయిలు పేరుకుపోవడం వల్లే రైతులకు బీమా పరిహారం అందడంలో ఇబ్బందులు తలెత్తాయని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ సమస్యను పరిష్కరించేందుకు కేంద్ర ప్రభుత్వంతో ప్రత్యేకంగా చర్చించి, పెండింగ్ ప్రీమియం బకాయిలను విడతలవారీగా చెల్లించే కార్యాచరణకు ఆమోదం సాధించామని తెలిపారు. దీంతో రాష్ట్రంలో పంటల బీమా పథకాన్ని సమర్థంగా అమలు చేసేందుకు మార్గం సుగమమైందన్నారు. ఇందులో భాగంగా 2026-27లో రూ.500 కోట్లు, 2027-28లో రూ.1,000 కోట్లు, 2028-29లో రూ.1,500 కోట్లు చొప్పున మొత్తం రూ.3,000 కోట్లు చెల్లించే ప్రతిపాదనకు భారత ప్రభుత్వ వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ ఆమోదం తెలిపిందన్నారు. రాష్ట్ర వాటా అందిన వెంటనే పెండింగ్ క్లెయిమ్‌లను పరిష్కరించాలని కేంద్ర ప్రభుత్వం బీమా కంపెనీలను ఆదేశించిందని వెల్లడించారు. వైసీపీ పాలనలో చేసిన తప్పుల భారం రైతులపై పడకుండా సరిదిద్దుతున్నాం. గొడ్డలిపార్టీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి ముందుగా తన ప్రభుత్వ హయాంలో పేరుకుపోయిన బకాయిల సంగతిని గుర్తుంచుకోవాలి. మీరు సృష్టించిన సమస్యలను మేము పరిష్కరిస్తూ రైతులకు మేలు చేస్తున్నాం.గత ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకుని కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేయడం సరికాదని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.పంటల బీమా విధానంలో మార్పులు మంత్రివర్గ ఉపసంఘం సిఫారసుల మేరకే చేపట్టామని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. ఖరీఫ్-2024లో ఈపంట ఆధారంగా ఉచిత పంటల బీమా అమలు చేయగా, రబీ 2024-25 నుంచి రైతులను భాగస్వాములను చేస్తూ స్వచ్ఛంద నమోదు విధానాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు.కేంద్ర ప్రభుత్వం కూడా ఖరీఫ్-2020 నుంచి ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనను దేశవ్యాప్తంగా స్వచ్ఛంద పథకంగా అమలు చేస్తోందని గుర్తుచేశారు. ఈ పథకంలో రైతుల ప్రీమియం వాటా ఖరీఫ్ ఆహార, నూనెగింజల పంటలకు గరిష్ఠంగా 2 శాతం, రబీ పంటలకు 1.5 శాతం, వార్షిక వాణిజ్య, ఉద్యాన పంటలకు 5 శాతం మాత్రమేనని తెలిపారు. మిగిలిన ప్రీమియం సబ్సిడీని వర్తించే నిబంధనల ప్రకారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 50:50 నిష్పత్తిలో భరిస్తున్నాయని వివరించారు. పెండింగ్ బీమా క్లెయిమ్‌ల పరిష్కారానికి ప్రభుత్వం పక్కా కార్యాచరణ రూపొందించిందని మంత్రి తెలిపారు. పీఎంఎఫ్‌బీవై మార్గదర్శకాల ప్రకారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రీమియం సబ్సిడీ వాటాలు అందిన అనంతరం బీమా కంపెనీలు క్లెయిమ్‌లను పరిష్కరిస్తాయని వివరించారు. రబీ 2022-23 నుంచి ఖరీఫ్-2025 వరకు పెండింగ్‌లో ఉన్న రాష్ట్ర వాటా ప్రీమియం సబ్సిడీని మూడు ఆర్థిక సంవత్సరాల్లో చెల్లించేందుకు ప్రతిపాదనలు సమర్పించామని తెలిపారు. ఈ మేరకు రబీ 2022-23 పెండింగ్ ప్రీమియం కోసం రూ.500 కోట్లు విడుదల చేయగా, అందులో రూ.250 కోట్లు ఇప్పటికే బీమా కంపెనీలకు చెల్లించామని, మిగిలిన బిల్లులు పరిశీలనలో ఉన్నాయని తెలిపారు. రాష్ట్ర వాటా చెల్లింపులకు అనుగుణంగా సంబంధిత సీజన్ల రైతులకు పరిహారం దశలవారీగా అందుతుందని వివరించారు.ఖరీఫ్-2026 నుంచి కేంద్ర ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ప్రత్యేక ఎస్క్రో ఖాతా విధానాన్ని అమలు చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ అంచనా ప్రీమియం వాటాలో కొంత భాగాన్ని ముందుగానే జమ చేసేందుకు ఈ ఖాతాలో మరో రూ.250 కోట్లు జమ చేశామని తెలిపారు.ఇందులో నుంచి ఖరీఫ్-2026కు రూ.83 కోట్లు, రబీ 2026-27కు రూ.44 కోట్లు అడ్వాన్స్ ప్రీమియంగా బీమా కంపెనీలకు చెల్లించామన్నారు. పంటల బీమా క్లెయిమ్‌ల లెక్కింపునకు అవసరమైన పంట కోత ప్రయోగాలు (CCEs), యెస్‌టెక్ (YESTECH) ఆధారిత దిగుబడి అంచనాలు, వాటి తనిఖీ, ధ్రువీకరణ ప్రక్రియలను త్వరితగతిన పూర్తి చేసి ఖరీఫ్-2026కు సంబంధించిన అర్హమైన పరిహారాన్ని రైతులకు అందించేందుకు చర్యలు చేపడుతున్నామని వివరించారు. ప్రకృతి విపత్తుల వల్ల పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. 2024 జూలై, ఆగస్టు-సెప్టెంబర్ నెలల్లో సంభవించిన వరదలు, భారీ వర్షాలు, 2025 మార్చిలో కురిసిన అకాల వర్షాల కారణంగా నష్టపోయిన 2.07 లక్షల మంది రైతులకు రూ.310.30 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ అందించామని వెల్లడించారు. రెవెన్యూ (DMII) శాఖ జీవో ఎంఎస్ నంబర్ 1, తేదీ 07.01.2025 ద్వారా SDRF/NDRF ప్రమాణాల కంటే అధికంగా రాష్ట్ర సహాయ రేట్లను నిర్ణయించామని తెలిపారు. వరి, పత్తి, వేరుశనగ, చెరకు పంటలకు హెక్టారుకు సబ్సిడీని రూ.17,000 నుంచి రూ.25,000కు పెంచామని, ఎంపిక చేసిన ఇతర పంటలకు హెక్టారుకు రూ.15,000 చొప్పున పెంచిన రాష్ట్ర రేటు వర్తిస్తుందని వివరించారు. పంటల బీమా పరిహారం బీమా చేసిన విస్తీర్ణానికి వర్తిస్తుందని, అయితే ఇన్‌పుట్ సబ్సిడీ పొందేందుకు బీమా తప్పనిసరి కాదని స్పష్టం చేశారు. బీమా ఉన్నా లేకపోయినా 33 శాతం లేదా అంతకంటే ఎక్కువ పంట నష్టం నమోదైన రైతులకు నిబంధనల ప్రకారం గరిష్ఠంగా 2 హెక్టార్ల అర్హమైన నష్ట విస్తీర్ణం వరకు ఇన్‌పుట్ సబ్సిడీ వర్తిస్తుందని తెలిపారు.ఖరీఫ్-2026 కరువు, అర్ణబ్, మురాసు తుఫాన్లు, సెప్టెంబర్ వరదలు, భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న వ్యవసాయ పంటలకు సంబంధించి క్షేత్ర స్థాయి నష్టం నమోదు పూర్తయిందని మంత్రి వెల్లడించారు. నాలుగు విపత్తులకు కలిపి 14,59,225 మంది రైతులకు చెందిన 12,06,269.84 హెక్టార్ల లో పంట నష్టం నమోదైందని, పెంచిన రాష్ట్ర సహాయ రేట్ల ప్రకారం రూ.2,532.89 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ అవసరమని అంచనా వేసినట్లు తెలిపారు. ఖరీఫ్-2026 కరువు కారణంగా 20 జిల్లాల్లో 9,87,231 మంది రైతులకు చెందిన 9,30,899.69 హెక్టార్లలో పంట నష్టం నమోదైందని, ఇందుకు రూ.1,863.23 కోట్లు అవసరమని వివరించారు. అక్టోబర్‌లో సంభవించిన అర్ణబ్ తుఫాను కారణంగా 13 జిల్లాల్లో 3,82,866మంది రైతులకు చెందిన 2,24,167.09 హెక్టార్లలో నష్టం నమోదైందని, రూ.559.77 కోట్లు అవసరమని తెలిపారు. నవంబర్‌లో సంభవించిన మురాసు తుఫాను కారణంగా 9 జిల్లాల్లో 52,402 మంది రైతులకు చెందిన 32,621.68 హెక్టార్లలో పంట నష్టం నమోదైందని, ఇందుకు రూ.78.65 కోట్లు అవసరమని పేర్కొన్నారు. సెప్టెంబర్‌లో సంభవించిన వరదలు, భారీ వర్షాల కారణంగా 13 జిల్లాల్లో 36,726 మంది రైతులకు చెందిన 18,581.38 హెక్టార్లలో నష్టం నమోదైందని, రూ.31.24 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ అవసరమని వెల్లడించారు.

ఖరీఫ్-2026 కరువుకు సంబంధించి క్షేత్రస్థాయి ఎన్యూమరేషన్ ఆధారంగా సమర్పించిన రూ.2,743.78 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ ప్రతిపాదనలు, మోంథా తుఫాను సహా ఇతర విపత్తులకు సంబంధించిన ప్రతిపాదనలు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయని మంత్రి తెలిపారు. అర్హులైన రైతులకు నిబంధనల ప్రకారం సహాయం అందించేందుకు చర్యలు కొనసాగుతున్నాయన్నారు. రబీ 2026-27 సీజన్‌లో రైతులు తమ పంటలకు బీమా రక్షణ కల్పించుకోవాలని సూచించారు. వరి, మామిడి పంటలకు 2026 డిసెంబర్ 31లోగా, మిగిలిన నోటిఫై చేసిన పంటలకు డిసెంబర్ 15లోగా సమీప బ్యాంకు, కామన్ సర్వీస్ సెంటర్ (CSC), మీ-సేవ కేంద్రాల ద్వారా నమోదు చేసుకోవాలని కోరారు. సందేహాల నివృత్తికి కిసాన్ కాల్ సెంటర్ 18001801551 లేదా హెల్ప్‌లైన్ 155251ను సంప్రదించవచ్చని తెలిపారు. రైతాంగ సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో పంటల బీమా రక్షణను విస్తరించడంతోపాటు ప్రకృతి విపత్తుల్లో నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. పంటల బీమా నమోదుల్లో సాధించిన పురోగతిని, ప్రీమియం చెల్లింపులకు రూపొందించిన కార్యాచరణను, ఇన్‌పుట్ సబ్సిడీ సహాయాన్ని విస్మరించి అపోహలు సృష్టించడం తగదన్నారు. రైతుల సంక్షేమాన్ని రాజకీయ కోణంలో చూడటం సరికాదు. రైతులకు ఆర్థిక భరోసా కల్పించడం, పంట నష్టపరిహారం అందించడం మా బాధ్యత. అర్హులైన ప్రతి రైతుకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేస్తాం. రైతుల ప్రయోజనాల పరిరక్షణలో రాజీపడే ప్రసక్తే లేదు అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

అడవులు కాలిపోతున్నాయి నష్టపోయేది మనమే



- ప్రముఖ పర్యావరణవేత్త, రాజయోగి డాక్టర్ భాస్కర్ నాయుడు ...
- అడవులు కాలిపోతున్నాయి - భవిష్యత్తు ప్రమాదంలో పడుతోంది!

కొత్తచేరువు నవంబర్ 26 అనంత జన శక్తి న్యూస్.

ఆంధ్రప్రదేశ్‌లో 1,073 పెద్ద అటవీ అగ్నిప్రమాదాలు*
202324 అటవీ అగ్ని సీజన్‌లో ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం 1,073 పెద్ద అటవీ అగ్నిప్రమాదాలు నమోదయ్యాయి. దాదాపుగా 5 28 676 స్క్వేర్ కిలోమీటర్స్ అడవులు దగ్ధమయ్యాయి.
దేశంలోనే 3వ స్థానంలో ఆంధ్రప్రదేశ్ ఉందని వారు తెలియజేశారు.
భారతదేశంలో పెద్ద అటవీ అగ్నిప్రమాదాలు సంభవించిన రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్‌కు 3వ స్థానం లభించడం ఎంతో ఆందోళనకర మనీ వారు పేర్కొన్నారు చెట్లతో పాటు జీవవైవిధ్యం కూడా అంతమవుతుంది
ఇలాగే అగ్నిప్రమాదాలు కొనసాగితే కోటానుకోట్ల చెట్లతో పాటు ఎన్నో జీవరాసులు అంతమైపోతాయి. జీవవైవిధ్యం తగ్గిపోతుంది, వాతావరణ సమతుల్యత దెబ్బతింటుంది, నేలలోని తేమ, సారవంతమైన పొరలు నాశనమవుతాయి.అడవులను కాపాడుకోవడం మనందరి బాధ్యత
అడవులు కాలిపోతుంటే కేవలం చెట్లు మాత్రమే కాదు, మన భవిష్యత్తుకు ఆధారమైన గాలి, నీరు, జీవవైవిధ్యం కూడా ప్రమాదంలో పడతాయి.
ప్రకృతి మనకు ఇచ్చిన అడవులను కాపాడుకోవడం మనందరి బాధ్యత. మన కుటుంబాన్ని కాపాడుకున్నట్లుగానే సమస్త జీవరాసుల కుటుంబాలను కాపాడాలి. అదే మానవత్వం అని వారు గుర్తు చేశారు మీరే ఆలోచించండి మీకేమో ప్రకృతి పని చేయాలి, పంచభూతాలు పని చేయాలి. మరి మీరు చేస్తున్నది ఏమిటి? దయచేసి ఆలోచించండి. అంటూ ప్రశ్నించారు.

సమన్వయంతో అనంత సుందరీకరణకు పునాదులు వేద్దాం..



- కార్మికులు చిరునవ్వుతో విధులు నిర్వర్తించాలి..
- నగర ప్రజలకు మెరుగైన సేవలందించాలి
- కార్మికులతో మేయర్ రమేష్ గౌడ్ ఆత్మీయ ముచ్చట్లు

అనంతపురం, నవంబర్ 26 : అనంత జనశక్తి న్యూస్

డిప్యూటీ మేయర్ స్వాతి, నగర ప్రజాప్రతినిధులు, కార్పొరేటర్లు, అధికారుల సమన్వయంతో అనంత సుందరీకరణకు పునాదులు వేద్దామని నగర మేయర్ రమేష్‌గౌడ్ పేర్కొన్నారు.గురువారం నగర పారిశుద్ధ్య నిర్వహణలో కీలకమైన మస్టర్ పాయింట్‌ను మేయర్ రమేష్‌గౌడ్ పరిశీలించారు.అక్కడ విధులకు హాజరైన పారిశుద్ధ్య కార్మికులు, సిబ్బందితో ఆయన ఆప్యాయంగా ముచ్చటించి వారిలో ఉత్సాహం నింపారు. విధులను చిరునవ్వుతో, ఆనందంగా నిర్వర్తిస్తూ నగర పరిశుభ్రతకు అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మేయర్ రమేష్ గౌడ్ మాట్లాడుతూ.. మస్టర్ పాయింట్‌లో కార్మికుల వాహనాలను క్రమపద్ధతిలో నంబర్లతో గుర్తించేలా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వాహనాల వెనుక భాగాలతో పాటు వాటి పరిసరాలను కూడా ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని స్పష్టం చేశారు. పారిశుద్ధ్య పనుల్లో క్రమశిక్షణ, పరిశుభ్రత, బాధ్యతాయుతమైన విధానాలు పాటించినప్పుడే మెరుగైన ఫలితాలు సాధించగలమన్నారు. పని ఒత్తిడిని పక్కన పెట్టి ఉల్లాసంగా విధులు నిర్వహించాలని, మనస్ఫూర్తిగా పనిచేసినప్పుడే సేవల్లో నాణ్యత పెరుగుతుందని పేర్కొన్నారు. విధులను కేవలం ఉద్యోగ బాధ్యతగా కాకుండా నగర ప్రజలకు అందించే సేవగా భావించాలని సూచించారు. ప్రజలు చెల్లించే పన్నులకు తగిన ప్రతిఫలంగా నగరపాలక సంస్థ నుంచి అవసరమైన సేవలను సకాలంలో, సమర్థవంతంగా అందించాల్సిన బాధ్యత ప్రతి ఉద్యోగి, కార్మికుడిపై ఉందన్నారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకునేలా అందరూ పనిచేయాలని కోరారు.

అందరి సమన్వయంతోనే అనంత సుందరీకరణ

డిప్యూటీ మేయర్ స్వాతి, నగర ప్రజాప్రతినిధులు, కార్పొరేటర్లు, అధికారులు, ఉద్యోగుల సమష్టి సహకారంతో నగర అభివృద్ధి, సుందరీకరణకు పునాదులు వేద్దామని మేయర్ రమేష్ గౌడ్ పిలుపునిచ్చారు. నగరపాలక సంస్థలోని అన్ని విభాగాలు పరస్పర సమన్వయంతో పనిచేస్తేనే పరిశుభ్రమైన, సుందరమైన అనంతపురాన్ని నిర్మించగలమని అన్నారు. ప్రజాప్రతినిధులు, కార్పొరేటర్లు, అధికారులు, సిబ్బంది ఒకే లక్ష్యంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

కార్మికులతో ఎంహెచ్ఓ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ల ముచ్చట్లు

మేయర్ పర్యటన సందర్భంగా ఎంహెచ్ఓ డాక్టర్ రాజా రవీంద్రనాథ్ చౌదరి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామాంజనేయులు తదితరులు కూడా మస్టర్ పాయింట్‌లో కార్మికులతో మాట్లాడారు. పారిశుద్ధ్య పనుల నిర్వహణ, విధుల క్రమబద్ధీకరణ, నగర పరిశుభ్రతకు సంబంధించిన అంశాలపై సిబ్బందితో చర్చించారు. కార్మికులకు అవసరమైన సూచనలు చేస్తూ సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ అధికారులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

కార్తీక దీపం కాంతితో దర్శనమిచ్చిన స్పటిక లింగం



యాడికి, నవంబర్ 26 ,అనంత జనశక్తి న్యూస్ :

మండల కేంద్రంలోని హాస్పిటల్ కాలనీలోని హైస్కూల్ గ్రౌండ్ సమీపంలో ఉన్న నాగుల కట్ట వీధిలో వెలసిన శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి దేవస్థానంలో గురువారం కార్తీక దీపం కాంతితో స్పటిక లింగం రూపంలో శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్పటిక లింగం కు పంచామృత అభిషేకాలు చేసి, వివిధ పూలమాలలతో అలంకరణ చేశారు. అర్చనలు చేసి, ప్రత్యేక హారతులను సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామిని దర్శించి టెంకాయలను కానుకలను సమర్పించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఉదయం అభిషేకాలు చేసిన దాతలను ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. సాయంత్రం కార్తీక దీపాలను వెలిగించారు. భజన కార్యక్రమంను నిర్వహించారు.ఓం నమః శివాయ అనే నామం మారుమ్రోగింది.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

మాలధారణలో భక్తి.... అన్నవితరణలో సేవా పరిమళం....!!

- సాయినాథుని సన్నిధిలో స్వాములకు తొమ్మిదో రోజు ఘనంగా అన్నసేవ
- భక్తి మార్గంలో అడుగులు వేస్తున్న స్వాములకు అన్నమే ఆత్మీయ ఆహ్వానం
- దీక్షలో ఉన్న భక్తుల ఆకలి తీర్చడమే సాయిసేవగా కొనసాగుతున్న అన్నవితరణ
- 700 నుంచి 800 మంది స్వాములకు ప్రతిరోజూ మధ్యాహ్నం అన్నప్రసాదం



శ్రీ సత్యసాయి జిల్లా ప్రతినిధి,

నవంబర్ 26, అనంత జనశక్తి న్యూస్:

ధర్మవరం పట్టణంలోని శ్రీ షిరిడీ సాయిబాబా మందిరం భక్తి పరిమళాలతో పాటు సేవా స్ఫూర్తిని చాటుతోంది. మాలధారణతో దీక్షను కొనసాగిస్తున్న స్వాములకు సాయినాథుని సన్నిధిలో అన్నప్రసాదాన్ని అందిస్తూ నిర్వహిస్తున్న అన్నవితరణ కార్యక్రమం తొమ్మిదోరోజుకు చేరుకుంది. భక్తికి సేవ తోడైతే ఆధ్యాత్మికత మరింత పరిపూర్ణమవుతుందనే భావనకు ఈ కార్యక్రమం ప్రతిరూపంగా నిలుస్తోంది.మాలధారణలో భక్తి.. అన్నవితరణలో సేవా పరిమళం అనే భావంతో డోలా ఓబులమ్మ, రాజారెడ్డి ఆధ్వర్యంలో ప్రతిరోజూ మధ్యాహ్నం 1 గంట నుంచి 2 గంటల వరకు అన్నవితరణ నిర్వహిస్తున్నారు. తొమ్మిదోరోజు కూడా సుమారు 700 నుంచి 800 మంది మాలధారణ స్వాములకు భోజన సదుపాయం కల్పించారు. సాయినాథుని దర్శనం అనంతరం భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరిస్తూ ఆధ్యాత్మిక అనుభూతిని పొందారు. దీక్షలో ఉన్న భక్తుల ఆకలి తీర్చడమే సాయిసేవగా భావిస్తూ నిర్వాహకులు ప్రతిరోజూ ఈ సేవా కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. మాలధారణ చేపట్టి నియమ నిష్ఠలతో స్వామి దీక్షలో ఉన్న భక్తులకు సమయానికి భోజనం అందించడం ద్వారా సేవాభావాన్ని చాటుతున్నారు. భక్తులకు అన్నం పెట్టడాన్ని సాయిబాబాకు సమర్పించే సేవగా భావిస్తూ కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. అన్నప్రసాదం రూపంలో సాయినాథుని కరుణను పంచుతున్న సేవ భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఒకవైపు మాలధారణతో ఆధ్యాత్మిక నియమాలను పాటిస్తున్న స్వాములు, మరోవైపు వారికి భోజనం అందిస్తూ సేవ చేస్తున్న నిర్వాహకులు.. ఇలా మందిర ప్రాంగణం భక్తి, సేవల సమ్మేళనంగా మారుతోంది.తొమ్మిదో రోజు అన్నవితరణ కార్యక్రమంలో స్వాములకు ఆత్మీయంగా భోజనం వడ్డించారు. ప్రతిరోజూ వందలాది మంది భక్తులకు అన్నప్రసాదం అందిస్తూ కొనసాగిస్తున్న ఈ సేవా కార్యక్రమం పట్ల మాలధారణ భక్తులు హర్షం వ్యక్తం చేశారు. సాయినాథుని సన్నిధిలో భక్తికి అన్నసేవ జతకావడం.. సేవలోనే సాయిని దర్శించుకునే ఆధ్యాత్మిక భావనకు నిదర్శనంగా నిలుస్తోంది.



భారత రాజ్యాంగం ఒక చారిత్రాత్మక రోజు.



- ఎంపీడీవో వెంకటేష్

శ్రీ సత్య సాయి జిల్లా ప్రతినిధి, నవంబర్ 26, అనంత జనశక్తి న్యూస్:

భారత రాజ్యాంగం ఒక చారిత్రాత్మక రోజు అని ఎంపీడీవో వెంకటేష్, ఏవో నబి తెలిపారు. ఈ సందర్భంగా వారు ఎంపీడీవో కార్యాలయంలో భారత రాజ్యాంగ దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం చిత్రపటానికి పూలు వేసి, అందరి చేత ప్రతిజ్ఞ చేయించారు. తదుపరి ఎంపీడీవో మాట్లాడుతూ..... 2015 నుంచి నవంబర్ 26ను అధికారికంగా రాజ్యాంగ దినోత్సవంగా జరుపుకుంటున్నామని, రాజ్యాంగ దినోత్సవ ప్రాముఖ్యత భారత రాజ్యాంగ విలువలు, ఆశయాలను ప్రజలకు తెలియజేయడం మనందరి బాధ్యత అని తెలిపారు.ప్రజాస్వామ్యం, లౌకికవాదం, సమానత్వం, స్వేచ్ఛ, న్యాయం వంటి సూత్రాలపై అవగాహన కల్పించడం.పౌరుల ప్రాథమిక హక్కులు, విధుల గురించి తెలియజేయాలని తెలిపారు.
రాజ్యాంగ రూపకల్పనలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చేసిన కృషిని స్మరించుకోవాలి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

- ప్రశాంత పోలింగ్‌పై కలెక్టర్ నిశిత పరిశీలన
- క్షేత్రస్థాయిలో ఏర్పాట్లు.. సిబ్బందికి పలు సూచనలు
- నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని పిలుపు

శ్రీ సత్యసాయి జిల్లా ప్రతినిధి,

నవంబర్ 26, అనంత జనశక్తి న్యూస్:

తొలి విడత గ్రామ పంచాయతీ సాధారణ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఏ. శ్యామ్ ప్రసాద్ గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ధర్మవరం డివిజన్ పరిధిలోని కనుముక్కల, బసంపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఆయన ఆకస్మికంగా సందర్శించి ఎన్నికల నిర్వహణ తీరును తనిఖీ చేశారు.పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్ల క్యూలైన్లు, ఓటింగ్ ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్.. విధుల్లో ఉన్న ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, ఇతర సిబ్బందితో మాట్లాడి పోలింగ్ శాతం వివరాలను తెలుసుకున్నారు. బ్యాలెట్ బాక్సుల భద్రత, పోలింగ్ కేంద్రాల పరిసరాల్లో 144 సెక్షన్ అమలు, పోలీసు బందోబస్తు తదితర అంశాలను పరిశీలించారు.
ఎన్నికల సంఘం మార్గదర్శకాలను తూ.చ. తప్పకుండా పాటించాలని, పోలింగ్ సమయంలో సాంకేతికంగా లేదా ఇతరత్రా సమస్యలు ఎదురైతే వెంటనే జోనల్ అధికారులు, కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించాలని సిబ్బందిని ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా కొనసాగేలా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించారు.ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ప్రతి ఓటు కీలకమని కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ పేర్కొన్నారు.ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు, భయభ్రాంతులకు లోనుకాకుండా స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. కలెక్టర్ తనిఖీల సందర్భంగా జోనల్ అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామీణ గడ్డపై ఓటు హోరు.. 87 శాతం పోలింగ్

- పంచాయతీ పోరులో ఓటర్ల తీర్పునకు భారీ స్పందన
- 20 పంచాయతీల్లో వెల్లువెత్తిన ఓటర్ల చైతన్యం
- సర్పంచ్ అభ్యర్థుల భవితవ్యాన్ని తేల్చిన గ్రామీణ ఓటర్లు

శ్రీ సత్యసాయి జిల్లా ప్రతినిధి, నవంబర్ 26, అనంత జనశక్తి న్యూస్:



ధర్మవరం రూరల్ పరిధిలో గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్‌కు ఓటర్లు భారీగా స్పందించారు. 20 గ్రామ పంచాయతీల పరిధిలో గురువారం జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో 87 శాతం ఓట్లు పోలయ్యాయని ఎంపీడీవో వెంకటేశు తెలిపారు.మొత్తం 34,780 మంది ఓటర్లు ఉండగా, ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ మధ్యాహ్నం 1:30 గంటల వరకు కొనసాగింది. పోలింగ్ పురోగతిని మూడు దశల్లో అధికారులు సమీక్షించారు. ఉదయం నుంచే పలు పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరడంతో గ్రామీణ ప్రాంతాల్లో ఎన్నికల సందడి నెలకొంది.
మొదటి దశలో 49 శాతం, రెండో దశలో 76 శాతం పోలింగ్ నమోదవగా, చివరి దశకు వచ్చేసరికి మొత్తం పోలింగ్ 87 శాతానికి చేరుకుంది. అధిక సంఖ్యలో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవడం గ్రామ పంచాయతీ ఎన్నికలపై ప్రజల్లో ఉన్న ఆసక్తిని చాటింది.
ధర్మవరం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లోనూ గణనీయమైన పోలింగ్ నమోదైంది. ధర్మవరం రూరల్‌లో 87 శాతం, బత్తలపల్లిలో 82.27 శాతం, తాడిమర్రిలో 84 శాతం, ముదిగుబ్బలో 79 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు.ధర్మవరం రూరల్ పరిధిలోని 20 గ్రామ పంచాయతీల సర్పంచ్ ఎన్నికల ఫలితాలను రాత్రిలోపు ప్రకటించే అవకాశం ఉందని ఎంపీడీవో వెంకటేశు తెలిపారు.

తొలి అడుగులోనే బంగారు పతకం

- ధర్మవరం వైద్యురాలు డాక్టర్ డి. రజిత ఘనత
- తొలి బ్యాచ్‌లోనే యూనివర్సిటీ గోల్డ్ మెడల్.. ఇన్‌సర్వీస్ వైద్యురాలిగా అరుదైన విజయం

శ్రీ సత్యసాయి జిల్లా ప్రతినిధి,

నవంబర్ 26, అనంత జనశక్తి న్యూస్:

అనంతపురం ప్రభుత్వ వైద్య కళాశాల రేడియాలజీ విభాగానికి చెందిన డాక్టర్ డి. రజిత తొలి బ్యాచ్‌లోనే యూనివర్సిటీ గోల్డ్ మెడల్ సాధించి అరుదైన ఘనతను సొంతం చేసుకున్నారు. డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం నిర్వహించిన పోస్ట్‌గ్రాడ్యుయేట్ పరీక్షల్లో రేడియాలజీలో అత్యధిక మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో గోల్డ్ మెడల్‌కు ఎంపికయ్యారు. ప్రస్తుతం ధర్మవరం ఏరియా ఆసుపత్రిలో వైద్య సేవలు అందిస్తున్న ఆమె విజయం ధర్మవరం ప్రాంతంతో పాటు అనంతపురం ప్రభుత్వ వైద్య కళాశాలకు గర్వకారణంగా నిలిచింది.
2023లో 12 పీజీ సీట్లతో ప్రారంభమైన రేడియాలజీ విభాగం తొలి బ్యాచ్ నుంచే యూనివర్సిటీ గోల్డ్ మెడల్ సాధించడం విశేషం. ఈ విభాగం ప్రారంభమైన తర్వాత విశ్వవిద్యాలయం నుంచి గోల్డ్ మెడల్ అందుకోవడం ఇదే తొలిసారి కావడం మరింత ప్రత్యేకతను సంతరించుకుంది.
విధి నిర్వహణతో పాటు ఉన్నత విద్యలోనూ ప్రతిభ
ఇన్‌సర్వీస్ కోటాలో పీజీ వైద్య విద్యను అభ్యసించిన డాక్టర్ రజిత ఒకవైపు వైద్య సేవలు అందిస్తూనే మరోవైపు ఉన్నత విద్యను కొనసాగించి ఈ ఘనత సాధించారు.కఠోర శ్రమ, పట్టుదల, అంకితభావంతో సాధించిన ఈ విజయం ఇన్‌సర్వీస్ వైద్యులకు స్ఫూర్తిదాయకంగా నిలిచింది.డాక్టర్ రజితను అనంతపురం ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య డాక్టర్ ఎం. విజయశ్రీ ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ ఛాంబర్‌లో ఘనంగా సత్కరించారు. పుష్పగుచ్ఛం, శాలువాతో అభినందించారు. తొలి బ్యాచ్‌లోనే గోల్డ్ మెడల్ సాధించడం కళాశాలకు గర్వకారణమని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.
రేడియాలజీ విభాగాధిపతి ఆచార్య డాక్టర్ సురేష్ మాట్లాడుతూ నాణ్యమైన బోధన, నిరంతర పర్యవేక్షణ, ప్రత్యేక శిక్షణ, అధ్యాపకుల సమిష్టి కృషి ఈ విజయానికి కారణమన్నారు. కార్యక్రమంలో విభాగానికి చెందిన వైద్యులు, అధ్యాపకులు, పీజీ విద్యార్థులు పాల్గొని డాక్టర్ రజితను అభినందించారు.
వైద్య సేవల్లో బాధ్యత.. విద్యలో అసాధారణ ప్రతిభ.. రెండింటినీ సమన్వయం చేసుకుంటూ యూనివర్సిటీ గోల్డ్ మెడల్ సాధించిన డాక్టర్ డి. రజిత విజయం భావితరాల వైద్యులకు స్ఫూర్తిదాయకంగా నిలిచింది.



27 ఓట్ల మెజార్టీతో ఆకుతోటపల్లిలో వైసీపీ జెండా ఎగరేసిన మల్లేశ్వరి

- రెండో వార్డు తీర్పు.. రాబోయే స్థానిక ఎన్నికలకు వైసీపీకి ఉత్సాహం

శ్రీ సత్యసాయి జిల్లా ప్రతినిధి, నవంబర్ 26, అనంత జనశక్తి న్యూస్:



ప్రజా తీర్పుతో బలం.... పార్టీ శ్రేణుల్లో కొత్త జోష్
ఆకుతోటపల్లి గ్రామ పంచాయతీ రెండో వార్డులో వైసీపీ అభ్యర్థి శ్రీమతి సి. మల్లేశ్వరి 27 ఓట్ల మెజార్టీతో ఘన విజయం సాధించారు.రాప్తాడు మాజీ శాసనసభ్యులు తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ఆశీస్సులతో ఎన్నికల బరిలో నిలిచిన మల్లేశ్వరి ప్రత్యర్థిపై ఆధిక్యం సాధించి తన విజయాన్ని నమోదు చేసుకున్నారు. ఈ ఫలితం ఆకుతోటపల్లిలో వైసీపీకి ఉన్న క్షేత్రస్థాయి బలానికి నిదర్శనంగా పార్టీ వర్గాలు అభివర్ణిస్తున్నాయి.
నమ్మకాన్ని నిలబెట్టుకోవడమే లక్ష్యం.
విజయం అనంతరం మల్లేశ్వరి మాట్లాడుతూ..... తనకు 27 ఓట్ల మెజార్టీ అందించిన రెండో వార్డు ప్రజలకు, ఎన్నికల్లో సహకరించిన వైసీపీ నాయకులు, కార్యకర్తలకు పార్టీ తరపున పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు తనపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకునేలా వార్డులో నెలకొన్న సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే తన ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో వైసీపీకి మెజార్టీ సాధించేలా క్షేత్రస్థాయిలో పార్టీకి మరింత బలోపేతం చేయడానికి తన వంతు కృషి చేస్తానని మల్లేశ్వరి పేర్కొన్నారు.

ఘోర రోడ్డు ప్రమాదం.. నలుగురి దుర్మరణం!

- లారీని ఢీకొన్న తుఫాన్ వాహనం.. మరో ఐదుగురికి తీవ్ర గాయాలు

యాడికి, నవంబర్ 26, అనంత జనశక్తి న్యూస్:

అనంతపురం జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. యాడికి మండల పరిధిలోని రాయల చెరువు గ్రామ సమీపంలో గురువారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి చెందగా, మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనతో కావేటిసముద్రం గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.వివరాల్లోకి వెళితే.. తాడిపత్రి మండలం కావేటిసముద్రం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు సంజీవరెడ్డి కుమారుడి వివాహం హైదరాబాద్‌లో జరిగింది. ఈ వివాహ వేడుకకు హాజరై తిరిగి స్వగ్రామానికి తుఫాన్ వాహనంలో వస్తుండగా ఈ దుర్ఘటన చోటుచేసుకుంది.రాయలచెరువు గ్రామంలోని పెట్రోల్ బంకు సమీపంలో ప్రధాన రహదారి పక్కన నిలిపి ఉంచిన లారీని వేగంగా వచ్చిన తుఫాన్ వాహనం బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వాహనంలో ప్రయాణిస్తున్న కావేటిసముద్రం గ్రామానికి చెందిన వీరాంజనేయులు, హనుమంతరెడ్డి, మల్లికార్జున, సుహాసిని అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం. మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు.సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సీఐ శ్రీనివాసులు ప్రమాద స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. మృతదేహాలను పంచనామా నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఒకే గ్రామానికి చెందిన నలుగురు ప్రాణాలు కోల్పోవడంతో కావేటిసముద్రం గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. వివాహ వేడుకకు వెళ్లి ఆనందంగా తిరిగి వస్తున్న వారు విగతజీవులుగా మారడంతో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరవుతున్నారు.



సాయిబాబా కు కార్తీక మాసం పూజలు

యాడికి, నవంబర్ 26,అనంత జనశక్తి న్యూస్:



మండల కేంద్రంలోని బుగ్గ రోడ్డులో ఉన్న సాయిబాబా దేవాలయంలో గురువారం సాయిబాబా కు కార్తీక మాసం పూజలు నిర్వహించారు. సాయిబాబాకు అభిషేకాలు చేసి, వివిధ పూలమాలతో అలంకరించారు. అర్చనలు చేసి,హారతులను సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని సాయిబాబా ను దర్శించి,టెంకాయలను సమర్పించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అంద చేశారు. సాయంత్రం భజన కార్యక్రమంను నిర్వహించారు. అనంతరం సాయిబాబా ఉత్సవ మూర్తిని పల్లకి లో ఉంచి,సాయినాథ్ మహారాజ్ కు జై అంటూ.....దేవాలయం చూట్టు ప్రదక్షిణ చేశారు.ఈ కార్యక్రమంలో ఆలయకమిటి సభ్యులు,భక్తులు పాల్గోన్నారు.

అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసిన నంద్యాల ఆదిలక్ష్మి



- హాజరైన మాల మహానాడు సభ్యులు

యాడికి, నవంబర్ 26, అనంత జనశక్తి న్యూస్:

మండల కేంద్రంలో ఉన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి గురువారం 77వ భారత రాజ్యాంగం దినోత్సవం సందర్భంగా ఎంపీటీసీ నంద్యాల ఆదిలక్ష్మి ,ఎంపీటీసీ భర్త నంద్యాల రంగస్వామి , మాలహానాడు సభ్యులు పూలమాలు వేశారు.ఈ సందర్భంగా ఎంపీటీసీ నంద్యాల ఆదిలక్ష్మి , ఎంపీటీసీ భర్త నంద్యాల రంగస్వామి,మాలహానాడు సభ్యులు మాట్లాడుతూ భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం నవంబర్ 26న జరుపుకుంటామని, 1949 నవంబర్ 26న భారత రాజ్యాంగ సభ రాజ్యాంగాన్ని ఆమోదించారన్నారు.1950 జనవరి 26 నుంచి రాజ్యాంగం అమల్లోకి వచ్చిందని,భారత రాజ్యాంగ రూపకల్పనలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కీలక పాత్ర పోషించారన్నారు. భారత రాజ్యాంగాన్ని రూపొందించడానికి 2 సంవత్సరాల 11 నెలల 18 రోజులు పట్టిందన్నారు.ప్రతి ఒక్కరు రాజ్యాంగాన్ని గౌరవించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాల మహానాడు సభ్యులు సురేష్, విజయ్, బాలన్న, సుధాకర్ ,వినయ్, అనిల్, మాజీ ఎంపీటీసీ రామచంద్రుడు, దేవదాసు ఓబయ్య,ఇమ్మాన్యుయెల్, తదితరులు పాల్గొన్నారు.

19 వ విడత సామాజిక తనిఖీ

యాడికి , నవంబర్ 26, అనంత జనశక్తి న్యూస్

మండలంలో ప్రస్తుతము 19 విడత సామాజిక తనిఖీ కార్యక్రమంను ఎస్ఆర్పి నీలకంఠ ఆధ్వర్యంలో సామాజిక తనిఖీ జరుగుతున్నదని గురువారం ఎపిఓ మద్దిలేటి తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిఆర్పిలు యాడికి మండలం నందు 2025 ఏప్రిల్ 1 నుండి 2026 జూన్ 30 దాకా జరిగిన పనులన్నీటిని సామాజిక బృందం వారు ప్రస్తుతం తనిఖీ చేస్తున్నారని తెలిపారు. సంబంధిత లైన్ డిపార్ట్మెంట్స్ అయినా పంచాయతీరాజ్ ఫారెస్ట్ హౌసింగ్ పశుసంవర్ధక శాఖల పనులను కూడా తనిఖీ చేస్తున్నారని తెలిపారు.

శ్రీమంతం వేడుకల్లో పాల్గొన్న మండల తాజా జడ్పీటీసీ ప్రమీల నరసింహమూర్తి



అగళి నవంబర్ 26, అనంత జనశక్తి న్యూస్ :

మండల పరిధిలోని పి.బ్యాడిగెర గ్రామంలో గిరీష్ సోదరుడు మారుతి భార్య అకిల సీమంతం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల జడ్పీటీసీ సభ్యులు ప్రమీల నరసింహమూర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మారుతి, అకిల దంపతులకు శుభాకాంక్షలు తెలిపి, ఆశీర్వదించారు. అనంతరం తాజాగా మండల జడ్పీటీసీ సభ్యులుగా గెలుపొందిన ప్రమీల నరసింహమూర్తిని, తెదేపా నాయకులను గిరీష్ కుటుంభికులు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు మల్లికార్జున, శివానంద, కృష్ణారెడ్డి, బుజ్జి (నరేష్),కేంకేర రంగనాథప్ప, చంద్రశేఖర్, వారధి, నాగోజి,షౌకత్, మాజీ ఎంపిటిసి సురేష్ తదితర తెదేపానాయకులు కార్యకర్తలున్నారు

టిడిపి అభ్యర్థి ఇంటింటి ప్రచారం..



- గంప గుర్తుకు మన ఓటు..

గాండ్లపెంట, నవంబర్, 26, అనంత జనశక్తి న్యూస్,

మండలం పరిధిలో సర్పంచ్ ఎన్నికల ప్రచారంలో టిడిపి అభ్యర్థి బుసన గారి భారతి వాల్మీకి స్కూల్ పవన్ కుమార్ రెడ్డి కదిరి మున్సిపాల్ చైర్మన్ గురువారం ప్రచారంలో పాల్గొన్నారు ఎస్సీ కాలనీ మెయిన్ రోడ్ ద్వారా ఇంటింటికి వెళ్లి ప్రజలను ఓట్లు అడిగి గంప గుర్తుకే మన ఓటు ఆమె మాట్లాడుతూ కూటమి అధికారంలో వచ్చినప్పటికీ సేవ చేస్తున్నారు టిడిపి అభ్యర్థి బూసునగారి భారతి ని గెలిపిస్తే గ్రామ అభివృద్ధికి మరింతగా కృషి చేస్తామని తెలిపారు గ్రామంలో సిసి రోడ్లు లైట్లు సిసి కెమెరాలు నిర్మిస్తామన్నారు ఈ కార్యక్రమంలో భూసన గారి సూరి, చిన్నోడు సొసైటీ అధ్యక్షుడు రామంజులు రెడ్డి, ఆనంద్, అక్రమ భాష, పవన్, సికిందర్, మాజీ సర్పంచ్ సిద్ధారెడ్డి కూటమి నాయకులు పాల్గొన్నారు..

కనగానపలి మండలం నరసంపలి 7వ వార్డు పోలింగ్ కేంద్రంలో నవంబర్ 27న రీపోల్

- జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఏ. శ్యామ్ ప్రసాద్

పుట్టపర్తి, నవంబర్ 26:అనంత జనశక్తి న్యూస్



శ్రీ సత్యసాయి జిల్లా కనగానపల్లి మండలం నరసంపల్లి గ్రామ పంచాయతీ 7వ వార్డులోని పోలింగ్ కేంద్రం నంబర్-7లో పోలింగ్ సమయంలో బ్యాలెట్ బాక్సులో ఇంకు పోసి, బ్యాలెట్ పత్రాలను ధ్వంసం చేసి పోలింగ్ ప్రక్రియకు అంతరాయం కలిగించిన ఘటన నేపథ్యంలో, సంబంధిత పోలింగ్ కేంద్రంలో నిర్వహించిన పోలింగ్‌ను రద్దు చేస్తూ జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఏ. శ్యామ్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు.ఈ నేపథ్యంలో నవంబర్ 27వ తేదీ (శుక్రవారం) ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నరసంపల్లి గ్రామ పంచాయతీ 7వ వార్డు పోలింగ్ కేంద్రం నంబర్-7లో రీపోల్ నిర్వహించనున్నట్లు తెలిపారు.రీపోల్ పూర్తయ్యే వరకు నరసంపల్లి గ్రామ పంచాయతీలోని ఇతర పోలింగ్ కేంద్రాల ఓట్ల లెక్కింపు చేపట్టరాదని ఆదేశించారు. ఇతర పోలింగ్ కేంద్రాల బ్యాలెట్ బాక్సులను భద్రతతో ప్రత్యేక గదిలో ఉంచి, తాళం వేసి సీల్ చేయడంతో పాటు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. పోటీ అభ్యర్థులు తమ ఏజెంట్ల ద్వారా భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు అవకాశం కల్పించాలని పేర్కొన్నారు.రీపోల్ పూర్తయిన అనంతరం ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు ప్రకటించడంతో పాటు ఉపసర్పంచ్ ఎన్నిక నిర్వహించనున్నట్లు ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.రీపోల్‌ను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన పోలింగ్ సిబ్బంది, బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పత్రాలు, పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

పంచాయతీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా సమష్టిగా పనిచేయాలి – మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి

కోవెలకుంట్ల నవంబర్ 26, అనంత జనశక్తి న్యూస్

కోయిలకుంట్ల పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎన్డీఏ కూటమి బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులు, వార్డు సభ్యులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో రాష్ట్ర మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రచారంపై అభ్యర్థులు, నాయకులకు మంత్రి దిశానిర్దేశం చేశారు. ప్రతి గడపకు వెళ్లి ప్రజలను నేరుగా కలిసి ఓట్లు అభ్యర్థించాలని సూచించారు. ప్రజల సమస్యలను తెలుసుకుంటూ, వారి ఆదరాభిమానాలను పొందేలా ప్రచారం నిర్వహించాలని తెలిపారు.

కూటమి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలి

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని మంత్రి సూచించారు. ప్రభుత్వ కార్యక్రమాల ద్వారా ప్రజలకు కలుగుతున్న ప్రయోజనాలను ప్రతి ఒక్కరికీ తెలియజేయాలని పేర్కొన్నారు.

సమన్వయంతో పనిచేయండి.. గెలుపే లక్ష్యంగా ముందుకు సాగండి

నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. పార్టీ శ్రేణులంతా ఐక్యంగా కృషి చేస్తూ, కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ముందుకు సాగాలని దిశానిర్దేశం
చేశారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన మంత్రి కందుల దుర్గేష్

- ఎన్నికల ఏర్పాట్లపై మంత్రి కందుల దుర్గేష్ ఆరా

రాజమండ్రి నవంబర్ 26, అనంత జనశక్తి న్యూస్

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ ఎన్నికల నేపథ్యంలో నగరంలోని 4, 12, 16, 20, 25, 30వ వార్డులలో ఏర్పాటు చేసిన పలు పోలింగ్ కేంద్రాలను రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ గురువారం సందర్శించి, పోలింగ్ ప్రక్రియను క్షుణ్ణంగా పరిశీలించారు.ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ సరళిని, ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లను, ఓటర్లకు కల్పించిన మౌలిక సదుపాయాలను మంత్రి దుర్గేష్ స్వయంగా పరిశీలించారు. ఎండ తీవ్రత దృష్ట్యా క్యూ లైన్లలో వేచి ఉన్న ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, టెంట్ వంటి ఏర్పాట్లు చేయాలని, వృద్ధులు, దివ్యాంగుల కోసం ప్రత్యేక సదుపాయాలు కల్పించాలని ఆయన అధికారులకు సూచించారు. ఎన్నికలు అత్యంత ప్రశాంతంగా, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా, సజావుగా జరిగేలా అధికారులు, పోలీసు యంత్రాంగం తీసుకున్న భద్రతా చర్యల వివరాలను అడిగి తెలుసుకున్నారు.అనంతరం ఆయా వార్డుల అభ్యర్థులు, పోలింగ్ ఏజెంట్లు, స్థానిక నాయకులతో మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడారు. ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరూ పాటిస్తూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు సహకరించాలని కోరారు.ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత శక్తివంతమైన ఆయుధమని, నగర అభివృద్ధి, భవిష్యత్తు కోసం అర్హులైన ప్రతి ఒక్కరూ బాధ్యతగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని



ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ రాజమహేంద్రవరం నగర ప్రజలకు పిలుపునిచ్చారు.

రీసర్వే డ్రాఫ్ట్ ల్యాండ్ రిజిస్టర్ డేటా ఎంట్రీ పనులను సకాలంలో పూర్తి చేయాలి



- సంయుక్త కలెక్టర్ సి.విష్ణుచరణ్..

అనంతపురం, నవంబర్ 26 :అనంత జనశక్తి న్యూస్

వజ్రకరూరు మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో రీసర్వే ప్రక్రియను జిల్లా సంయుక్త కలెక్టర్ సి.విష్ణుచరణ్ తనిఖీ చేశారు. ఇందులో రీసర్వేకు సంబంధించిన డ్రాఫ్ట్ ల్యాండ్ రిజిస్టర్ డేటా ఎంట్రీ పనులు తహసీల్దార్ లాగిన్ నందు ఏవిధంగా జరుగుతున్నాయో ప్రత్యక్షంగా పరిశీలన చేశారు. అలాగే తహసీల్దార్, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్, మండల సర్వేయర్, విలేజ్ సర్వేయర్, విలేజ్ రెవెన్యూ ఆఫీసర్ల వద్ద డేటా ఎంట్రీ పనులు ఎందుకు ఆలస్యంగా జరుగుతున్నయోనని అడిగి తెలుసుకున్నారు. సకాలంలో రీసర్వే పనులు పూర్తి చేయకపోతే సంబంధించిన వారి మీద శాఖాపరమైన చర్యలు తీసుకొనడం జరుగుతుందని, రీ సర్వేలో ఎటువంటి నిర్లక్ష్యము వహించరాదని జెసి తెలియజేశారు.తహసీల్దార్ కార్యాలయంలో ఒక నెల కాలం నందు వచ్చిన పట్టాదారు పాసుపుస్తకం నమోదు కొరకు వచ్చిన దరఖాస్తులను మరియు దస్త్రాలను పరిశీలన చేయడం మరియు పిజిఆర్ఎస్ నందు వస్తున్న ఫిర్యాదులను ఏ విధంగా పరిష్కరిస్తున్నారు, పరిష్కరించిన దస్త్రాలను పరిశీలన చేయడం జరిగింది. ఈ సందర్భంగా భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్.అంబేద్కర్ చిత్రపటానికి జాయింట్ కలెక్టర్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సుయాష్ కుమార్, జిల్లా సర్వే మరియు భూ రికార్డుల శాఖ అధికారి కనకారావు, డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే రామాంజనేయులు,, మండల తహసీల్దార్ మరియు సర్వేయర్ ఇతర క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొనడం జరిగింది.

అనంతగిరి బాలికల ఆశ్రమ పాఠశాలలో ఘనంగా రాజ్యాంగ దినోత్సవ వేడుకలు

- రాజ్యాంగ విలువలు ప్రతి ఒక్కరికీ ఆదర్శం కావాలి – ప్రధానోపాధ్యాయురాలు మంగమ్మ

అనంతగిరి నవంబర్ 27:అనంత జనశక్తి న్యూస్

అనంతగిరి ప్రభుత్వ బాలికల ఆశ్రమ పాఠశాలలో గురువారం రాజ్యాంగ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం రాజ్యాంగ ప్రాముఖ్యత, రాజ్యాంగం కల్పించిన హక్కులు, పౌరుల బాధ్యతలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మంగమ్మ మాట్లాడుతూ భారత రాజ్యాంగం దేశ ప్రజలందరికీ సమాన హక్కులు, స్వేచ్ఛ, సమానత్వం, న్యాయం కల్పించే గొప్ప మార్గదర్శకమని పేర్కొన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా భారతదేశం నిలవడానికి రాజ్యాంగం పునాది అని తెలిపారు. ప్రతి విద్యార్థి రాజ్యాంగం గురించి తెలుసుకోవడంతో పాటు అందులో పొందుపరిచిన విలువలను తమ జీవితాల్లో ఆచరించాలని సూచించారు.కుల, మత, ప్రాంత, భాషా భేదాలకు అతీతంగా ప్రతి ఒక్కరినీ సమానంగా గౌరవించడం రాజ్యాంగం మనకు నేర్పిన గొప్ప సందేశమని అన్నారు. రాజ్యాంగం మనకు కల్పించిన హక్కులను వినియోగించుకోవడంతో పాటు దేశ పౌరులుగా మనపై ఉన్న బాధ్యతలను కూడా గుర్తించుకోవాలని విద్యార్థులకు వివరించారు. ముఖ్యంగా విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ, సమానత్వ భావన, సోదరభావం, సామాజిక బాధ్యతలను అలవర్చుకోవాలని సూచించారు.డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ అందించిన రాజ్యాంగ స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ గౌరవించాలని, ప్రజాస్వామ్య విలువలను కాపాడటంలో యువత, విద్యార్థులు కీలక పాత్ర పోషించాలని పేర్కొన్నారు. భవిష్యత్తులో మంచి పౌరులుగా ఎదిగి దేశ అభివృద్ధికి తోడ్పడాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాంబాబు, అప్పలస్వామి, జ్యోతి, పాఠశాల విద్యార్థులు పాల్గొని రాజ్యాంగ దినోత్సవ వేడుకలను విజయవంతం చేశారు.



అనంతగిరి ఏకలవ్య పాఠశాలలో జిల్లా అధికారుల తనిఖీ

- సిబ్బంది గైర్హాజరుపై విచారణ:హాజరు రికార్డులు, విధుల నిర్వహణపై ఆరా

అనంతగిరి, నవంబర్ 26:అనంత జనశక్తి న్యూస్

అల్లూరి జిల్లా కలెక్టర్ నిశాంతి ఆదేశాల మేరకు అనంతగిరిలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలను జిల్లా సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ (ఏపీసీ) డాక్టర్ స్వామి నాయుడు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.పాఠశాలలో కొంతమంది సిబ్బంది విధులకు సక్రమంగా హాజరు కావడం లేదని వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో ఆయన ఈ తనిఖీ చేపట్టడం ప్రాధాన్యత సంతరించుకుంది.తనిఖీలో భాగంగా పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది హాజరు వివరాలను పరిశీలించారు. విధులకు సిబ్బంది సమయానికి హాజరవుతున్నారా? వారికి కేటాయించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తున్నారా? అనే అంశాలపై ఆరా తీశారు. అదేవిధంగా పాఠశాలలో విద్యా బోధన, విద్యార్థులకు అందుతున్న విద్యా సదుపాయాలు, విద్యా సంబంధిత అంశాలను పరిశీలించారు. సిబ్బంది గైర్హాజరుపై వచ్చిన ఫిర్యాదులకు సంబంధించి అవసరమైన వివరాలను సేకరించి విచారణ చేపట్టారు.ఈ సందర్భంగా డాక్టర్ స్వామి నాయుడు మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. పాఠశాలల్లో పనిచేసే ప్రతి ఒక్కరూ తమ విధుల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఉపాధ్యాయులు, సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని తెలిపారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించకుండా, విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేలా చర్యలు తీసుకోవడమే ఈ తనిఖీ ముఖ్య ఉద్దేశమని స్పష్టం చేశారు.పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపడాలంటే ఉపాధ్యాయులు, సిబ్బంది క్రమశిక్షణతో విధులు నిర్వహించడం ఎంతో అవసరమని ఈ సందర్భంగా పేర్కొన్నారు.ఈ తనిఖీ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు కిల్లో బాలాజీ, బీబీ నాగేశ్వరరావు, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.



వృత్తి నైపుణ్యంతోనే ఉద్యోగ అవకాశాలు!

- జిల్లా ఉపాధి అధికారి చల్లా మధుభూషణరావు, జిల్లా సీడప్ జీడియం ప్రశాంత్ కుమార్ నాయుడు.

విజయవాడ నవంబర్ 26,అనంత జనశక్తి న్యూస్

గొల్లపూడిలోని లక్ష్మీదీప శిక్షణ కేంద్రంలో గురువారం నిర్వహించిన తల్లిదండ్రులు -ఉపాధ్యాయుల సమావేశానికి జిల్లా ఉపాధి అధికారి చల్లా మధు భూషణరావు, మరియు సీడప్ జిల్లా జేడియం నూకని ప్రశాంత్ కుమార్ నాయుడులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సిడ్ యాప్ (SEEDAP) ఆధ్వర్యంలో అమలవుతున్న పలు పథకాల ద్వారా గ్రామీణ యువతకు అందిస్తున్న నైపుణ్య శిక్షణ తీరు, ఉద్యోగ అవకాశాలు గురించి తల్లిదండ్రులు, విద్యార్థులకు వివరించారు. గతంలో శిక్షణ పొంది ఉద్యోగాలు సాధించిన అభ్యర్థుల విజయగాథలను తెలియజేసి విద్యార్థులను ప్రోత్సహించారు. తరువాత విద్యార్థులకు ఏకరూప దుస్తులు, ఇతర వస్తువులతో కూడిన కిట్లను అందజేశారు. శిక్షకుల వసతి, భోజన సదుపాయాలను తల్లిదండ్రులతో కలిసి పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.



శ్రేష్ఠ-2027 ప్రవేశ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

- నవంబర్ 30వ తేదీతో ముగియనున్న గడువు

అనంతపురం, నవంబర్ 26, అనంత జనశక్తి న్యూస్:

ప్రతిభావంతులైన షెడ్యూల్డ్ కులాలు, డీనోటిఫైడ్ తెగలకు చెందిన విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న శ్రేష్ఠ (NETS) పథకం కింద 2027 విద్యా సంవత్సరానికి ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ తెలిపారు. ఈ పరీక్షకు అర్హులైన బాలబాలికలు నవంబర్ 30వ తేదీ రాత్రి 11.50 గంటలలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జాతీయ పరీక్షల సంస్థ (ఎన్‌టీఏ) ఈ ప్రవేశ పరీక్షను నిర్వహిస్తోందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా ఎంపికైన విద్యార్థులకు 9వ, 11వ తరగతుల్లో ప్రతిష్టాత్మక పైవేటు వసతి పాఠశాలల్లో ప్రవేశాలు కల్పిస్తారని, వారి విద్యకు సంబంధించిన పూర్తి ఖర్చులను కేంద్ర ప్రభుత్వమే భరిస్తుందని వివరించారు.నవంబర్ 14 నుంచి ప్రారంభమైన దరఖాస్తుల స్వీకరణ ఈ నెల 30వ తేదీతో ముగియనుంది. దరఖాస్తుల్లో తప్పుల సవరణకు డిసెంబర్ 2 నుంచి 4వ తేదీ వరకు అవకాశం కల్పించారు. పరీక్షా కేంద్రాల నగరాల వివరాలను డిసెంబర్ 20న ప్రకటించనుండగా, జనవరి 3, 2027 నుంచి ప్రవేశ పత్రాలను వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ప్రవేశ పరీక్ష జనవరి 10వ తేదీన ఆదివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్నారు. పరీక్షను హిందీ, ఇంగ్లీష్ మాధ్యమాల్లో బహుళైచ్ఛిక ప్రశ్నల విధానంలో ఓఎంఆర్ పత్రం ద్వారా నిర్వహిస్తారు. ఈ పరీక్షకు ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని కలెక్టర్ తెలిపారు. అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.దరఖాస్తులు, ఇతర వివరాల కోసం [https://exams.nta.nic.in/shreshta/](https://exams.nta.nic.in/shreshta/?utm_source=chatgpt.com) వెబ్‌సైట్‌ను లేదా [https://nta.ac.in](https://nta.ac.in?utm_source=chatgpt.com) వెబ్‌సైట్‌ను సంప్రదించాలని తెలిపారు. పరీక్ష ఫలితాల విడుదల తేదీని తరువాత ప్రకటించనున్నట్లు వెల్లడించారు.

అనధికార ఇసుకరీచుల అడ్డగా యల్లనూరు....

- ఇసుక రిచుల ముసుగులో చిత్రావతి నది చిద్రం
- అడిగేవారెవరు.... స్పందించే వారెవరు....
- ఎవరికి వారే యమునా తీరే అన్నట్లు అధికారులు ....

యల్లనూరు, నవంబరు 26, అనంత జనశక్తి న్యూస్:



యల్లనూరు గ్రామ సమీపంలో చిత్రావతి నది పక్కన వ్యవసాయ పొలంలో ప్రభుత్వం ఇసుక తవ్వకాలకు గత రెండు సంవత్సరాల క్రితం అనుమతులను ఇచ్చింది ఇచ్చిన అనుమతులు పూర్తి అయిన, అనధికార తవ్వకాలు మాత్రం ఆగడం లేదు...

సుకుర్ షాబ్ కి చెందిన 1728Aలో 2.50 ఎకరాలు, అదే రైతుకు చెందిన మరో సర్వే నెంబరులో నాలుగు ఎకరాలలో ఇసుక తవ్వకాలకు అనుమతులు వచ్చాయి. గతంలో అనంతపురం చెందిన కొందరు వ్యక్తులు ప్రభుత్వం ద్వారా అనుమతులు పొంది ఇసుక తవ్వకాలను పూర్తి చేశారు. ఇసుక లేక పోవడంతో రీచ్ ను మూసేశారు. ప్రస్తుతం ఇక్కడ ఎటువంటి అనుమతులు లేకుండా జరుగుతున్న ఇసుక తవ్వకాలపై సమాచారాన్ని అడిగేందుకు మైన్స్ ఏడి, డిడికి ఫోన్ చేయగా వారి నుండి స్పందన లేదు

ప్రస్తుత తవ్వకాలకు అనుమతులు ఎక్కడ ....

గతంలో ఇసుక తవ్వకాలు పూర్తవడంతో సదరు వ్యక్తులు ఇసుక తవ్వకాలను నిలిపేసి వెళ్లిపోయారు. అకస్మాత్తుగా రెండు నెలల తర్వాత మరో వ్యక్తి ఇసుకతవ్వకాలకు ప్రారంభించారు. మూడు నెలలుగా ఇక్కడ ఎటువంటి అనుమతులు లేకుండానే ఇసుక తవ్వకాల తతంగం సాగుతూనే ఉంది. ఇక్కడ ఇసుక తవ్వకాలకు అనుమతులు లేవంటూ అధికారులు చెబుతుండడం విశేషం.

అధికారులు వస్తే ఉడాయింపు..

ఇక్కడ జరుగుతున్న అక్రమ తవ్వకాలపై అనేక మార్లు మైన్స్ అధికారులు ఆ ప్రాంతానికి తనికీలకు వచ్చారు. వారు వచ్చిన ప్రతిసారి సదరు నిర్వాహకులు తవ్వకాలని నిలిపేస్తున్నారని, అధికారులు వెళ్లిన వెంటనే రాత్రి సమయాల్లో యదావిధిగా తవ్వకాలను జరుపుతుండటంతో సహనం కోల్పోయిన మైన్స్ ఆర్ఐ వరప్రసాద్ రెడ్డి గత 10రోజుల క్రితం అర్ధరాత్రి వేళ తాడిపత్రి ప్రాంతంలో ఇసుక టిప్పర్లను పట్టుకుని సీజ్ చేశారు. అంతేకాకుండా ఎటువంటి అనుమతులు లేకుండా ఇక్కడ జరుగుతున్న ఇసుక తవ్వకాలపై ఈ ప్రాంతానికి చెందిన కొందరు వ్యక్తులు విజయవాడలోని మైన్స్ కార్యాలయంలో ఫిర్యాదులు కూడా చేశారు. కానీ చర్యలు మాత్రం శూన్యం.

తవ్వకాలు జరుపు తున్నది ఎక్కడ....

ప్రస్తుతం అనధికారికంగా ఇసుక తవ్వకాలు జరుగుతున్న ప్రాంతం ప్రభుత్వ భూమి 1660 సర్వే నెంబరు (శివయ్యసాగు బంజరు)లో దాదాపు మూడు ఎకరాల పొలంలో ఎటువంటి అనుమతులు లేకుండానే ఇసుక తవ్వకాలు యదేచ్ఛగా సాగుతున్నాయి.

దొంగ బిల్లుల హవా....

యల్లనూరు లో జరుగుతున్న అనదికారిక ఇసుక తవ్వకాలలో మరో కొత్త విషయం వెలుగు చూసింది. అసలు వారికి ప్రభుత్వం నుండి ఇసుక తవ్వకాలకు అనుమతులు లేవు మరి బిల్లులు ఎక్కడ నుండి వచ్చాయి అబ్బా అంటే అవి నకిలీ బిల్లులు గా తేలాయి. వాటితోనే ఇసుక అక్రమ తవ్వకాలు జరుపుతున్నట్లు సమాచారం..

ప్రభుత్వానికే పంగనామాలు....

ప్రభుత్వం నుండి ఇసుక తవ్వకాలకు అనుమతులు పొందిన నిర్వాకులు. రాయల్టీ బిల్లుల కోసం కొంత మొత్తాన్ని ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుంది. బిల్లులు ముగిసిన తర్వాత మరో మారు బిల్లులు పొందాలంటే ప్రభుత్వానికి చలానా రూపంలో మరో మారు డబ్బులు చెల్లించాలి. అయితే గతంలో సుకూర్ సాబ్ ఇసుక రీచ్ లో తవ్వకాలు జరిపిన వ్యక్తులు దాదాపు రూ.11 లక్షల పైగా ప్రభుత్వానికి రాయల్టీ ఎగరగొట్టి ఇసుకతవకాల జరిపినట్లు సమాచారం. దీనిపై మైన్స్ అధికారులను అడగగా వాటి విషయం తమకు తెలియదని సమాధానం ఇచ్చారు.

చిత్రావతి నదే ఆధారంగా...

పేరుకే ప్రభుత్వం నుండి ఇసుక రిచుకు అనుమతులు పొందారు, అందులోని ఇసుక నాణ్యత లేకపోవడంతో పక్కనే ఉన్న చిత్రావతి నదిని తవ్వకాలకు అడ్డాగా మార్చారు అక్రమ ఇసుక తవ్వకం దారులు. అనుమతులు పొందిన ప్రాంతానికి వెళ్లేందుకు చిత్రావతి నదిలోనే రహదారిని నిర్మించుకొని రహదారి పక్కనే ఎక్కడపడితే అక్కడ నదిలో ఇసుక తవ్వకాలని జరిపేశారు. ఇప్పటికే సుమారు ఓక ఎకరం విస్తీర్ణంలో చిత్రావతి నదిలో ఇసుక తవ్వ కాలను జరపగా మరింత మొత్తంలో తవ్వకాలను జరిపేందుకు మరొక రహదారిని కూడా నిర్మించి సిద్ధంగా ఉంచారు.





సుడిగాలి పర్యటనలతో కౌంటింగ్ ప్రక్రియపై కలెక్టర్ నిశిత పర్యవేక్షణ*

- గొల్లపూడి, అంబాపురం, నున్న, పాతపాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు, రామవరప్పాడు ప్రాంతాల్లో విస్తృత తనిఖీలు
- కౌంటింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు, ఓట్ల లెక్కింపు తీరును పరిశీలించిన జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ
- -పారదర్శకంగా, నిష్పక్షపాతంగా కౌంటింగ్ నిర్వహణకు అధికారులకు దిశానిర్దేశం

విజయవాడ నవంబర్ 26,అనంత జనశక్తి న్యూస్



గ్రామ పంచాయతీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించడంపై ప్రత్యేక దృష్టి సారించిన జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ గురువారం విజయవాడ రూరల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించి కౌంటింగ్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. గొల్లపూడి, అంబాపురం, నున్న, పాతపాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు, రామవరప్పాడు ప్రాంతాల్లోని కౌంటింగ్ కేంద్రాలను సందర్శించి అక్కడ జరుగుతున్న ఓట్ల లెక్కింపు ప్రక్రియను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయా కేంద్రాల్లో ఓట్ల లెక్కింపునకు కల్పించిన మౌలిక సదుపాయాలు, కౌంటింగ్ టేబుళ్ల ఏర్పాటు, విధుల్లో ఉన్న సిబ్బంది నిర్వహణ తీరును పరిశీలించారు. ఓట్ల లెక్కింపు ఏ విధంగా జరుగుతోంది, ఎన్నికల నిబంధనల అమలు అనే అంశాలపై సంబంధిత అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.ఓట్ల లెక్కింపు ప్రక్రియలో ప్రతి దశను ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ప్రతి ఓటును నిబంధనల ప్రకారం జాగ్రత్తగా పరిశీలించి లెక్కించాలని, చెల్లుబాటయ్యే ఓట్లు, చెల్లని ఓట్లను నిర్ధారించే విషయంలో ఎన్నికల నియమావళిని ఖచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు. లెక్కింపులో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా సిబ్బంది పూర్తి అప్రమత్తతతో విధులు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు.

ఎన్టీఆర్ జిల్లాలో తొలి దశ పంచాయతీ ఎన్నికలు ప్రశాంతం

- 75.83 శాతం పోలింగ్ నమోదు.. 2.36 లక్షల మంది ఓటు హక్కు వినియోగం
-రెడ్డిగూడెం మండలంలో అత్యధికంగా 86.39 శాతం పోలింగ్

విజయవాడ, నవంబర్ 26, అనంత జనశక్తి న్యూస్:

ఎన్టీఆర్ జిల్లాలో తొలి దశ గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ ప్రశాంత వాతావరణంలో ముగిసింది. జిల్లాలోని ఐదు మండలాల పరిధిలో జరిగిన ఎన్నికల్లో మొత్తం 75.83 శాతం పోలింగ్ నమోదైంది. మొత్తం 3,11,318 మంది ఓటర్లకు గాను 2,36,084 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ వివరాలను జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి. లక్ష్మీశ వెల్లడించారు. తొలి దశలో ఐదు మండలాల పరిధిలోని 72 గ్రామ పంచాయతీలకు సంబంధించి 959 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు నిర్వహించారు. గురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ కొనసాగింది. ఉదయం నుంచే ఓటర్లు పెద్ద సంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు చేరుకుని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు బందోబస్తు, పటిష్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య పోలింగ్ ప్రక్రియ సజావుగా ముగిసింది.

గంట గంటకూ పెరిగిన పోలింగ్ శాతం

ఉదయం 8 గంటల వరకు 14.72 శాతం, 9 గంటలకు 29.47 శాతం, 10 గంటలకు 43.68 శాతం, 11 గంటలకు 58.19 శాతం, మధ్యాహ్నం 12 గంటలకు 68.50 శాతం పోలింగ్ నమోదైంది. మధ్యాహ్నం ఒంటి గంటకు తుది నివేదిక ప్రకారం 75.83 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు.

మండలాల వారీగా పోలింగ్ వివరాలు

జి.కొండూరు: 22 గ్రామ పంచాయతీలు, 219 పోలింగ్ కేంద్రాలు, 46,569 మంది ఓటర్లకు గాను 40,140 ఓట్లు పోలయ్యాయి. పోలింగ్ శాతం 86.19.ఇబ్రహీంపట్నం: 10 గ్రామ పంచాయతీలు, 132 పోలింగ్ కేంద్రాలు, 33,759 మంది ఓటర్లకు గాను 26,891 ఓట్లు పోలయ్యాయి. పోలింగ్ శాతం 79.66.మైలవరం: 13 గ్రామ పంచాయతీలు, 174 పోలింగ్ కేంద్రాలు, 54,728 మంది ఓటర్లకు గాను 44,377 ఓట్లు పోలయ్యాయి. పోలింగ్ శాతం 81.09.విజయవాడ గ్రామీణం: 16 గ్రామ పంచాయతీలు, 322 పోలింగ్ కేంద్రాలు, 1,44,407 మంది ఓటర్లకు గాను 97,156 ఓట్లు పోలయ్యాయి. పోలింగ్ శాతం 67.28.రెడ్డిగూడెం: 11 గ్రామ పంచాయతీలు, 112 పోలింగ్ కేంద్రాలు, 31,855 మంది ఓటర్లకు గాను 27,520 ఓట్లు పోలయ్యాయి. పోలింగ్ శాతం 86.39.మండలాల వారీగా పరిశీలిస్తే రెడ్డిగూడెంలో 86.39 శాతం, జి.కొండూరులో 86.19 శాతం పోలింగ్ నమోదైంది. మైలవరంలో 81.09 శాతం, ఇబ్రహీంపట్నంలో 79.66 శాతం, విజయవాడ గ్రామీణ మండలంలో 67.28 శాతం పోలింగ్ నమోదైంది.

ఎన్నికల సిబ్బందికి కలెక్టర్ అభినందనలు

ఎన్నికల నిర్వహణలో సమన్వయంతో పనిచేసిన ఎన్నికల అధికారులు, పోలింగ్ సిబ్బంది, పోలీసు శాఖతో పాటు వివిధ విభాగాల అధికారులను జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ అభినందించారు. ప్రజలు స్వేచ్ఛగా, నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు సహకరించిన ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపారు. తొలి దశ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగియడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.



చెదురు మదురు ఘటనలు మినహా ప్రశాంతంగా ముగిసిన

గ్రామ పంచాయతీ ఎన్నికలు 2026 మొదటి దశ పోలింగ్..

- జిల్లాలో 81.24 శాతం పోలింగ్ నమోదు..
- పోలింగ్ మరియు కౌంటింగ్ ను కలెక్టరేట్ నుంచి మానిటర్ చేసిన జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్..

అనంతపురం, నవంబర్ 26 : అనంత జనశక్తి న్యూస్

స్థానిక సంస్థల ఎన్నికలలో భాగంగా గురువారం నిర్వహించిన మొదటి దశ గ్రామ పంచాయతీ ఎన్నికలు 2026 పోలింగ్ చెదురు మదురు ఘటనలు మినహా ప్రశాంతంగా ముగిసింది. ప్రశాంత వాతావరణంలో ఎన్నికల పోలింగ్ నిర్వహించేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవడం జరిగింది. ఈరోజు ఉదయం 07:00 గంటల నుంచి మధ్యాహ్నం 01 గంటల వరకు నిర్వహించిన పోలింగ్ ప్రక్రియను అనంతపురం కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్ మానిటర్ చేశారు. మొదటి విడతలో కళ్యాణదుర్గం డివిజన్, అనంతపురం డివిజన్ లలోని 13 మండలాల్లో గ్రామపంచాయతీ ఎన్నికల పోలింగ్ నిర్వహించగా, ఎప్పటికప్పుడు పోలింగ్ సరళిని పరిశీలిస్తూ పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించేందుకు అధికారులకు జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి పలు సూచనలను జారీ చేశారు.

- జిల్లాలో 81.24 శాతం పోలింగ్ నమోదు :

*జిల్లాలో మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికలలో 81.24 శాతం పోలింగ్ నమోదు కావడం జరిగింది.పోలింగ్ ముగిసిన అనంతరం చేపట్టే ఓట్ల లెక్కింపు ప్రక్రియను ఎలాంటి అవాంతరాలు లేకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఆదేశించారు. కౌంటింగ్‌ను నిర్ణీత సమయంలో పూర్తి చేసేలా ఎన్నికల సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. కౌంటింగ్ ప్రక్రియ కొనసాగుతూ ఉన్నది.

పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో

పరిశీలించిన ఆర్డీవో వెన్నెల శ్రీను



- జి.కొండూరు, మైలవరం ప్రాంతాల్లో పోలింగ్ కేంద్రాలు, కౌంటింగ్ ప్రక్రియ తనిఖీ
- ఎన్నికల ప్రక్రియ సజావుగా, పారదర్శకంగా సాగేందుకు అధికారులకు సూచనలు

విజయవాడ నవంబర్ 26, అనంత జనశక్తి న్యూస్

గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో విజయవాడ ఆర్డీవో వెన్నెల శ్రీను గురువారం జి.కొండూరు, మైలవరం ప్రాంతాల్లో పర్యటించి పోలింగ్, ఓట్ల లెక్కింపు ప్రక్రియను పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో ఎన్నికల నిర్వహణకు చేపట్టిన ఏర్పాట్లు, పోలింగ్ ప్రక్రియ, ఓట్ల లెక్కింపు విధానాన్ని క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎన్నికల విధుల్లో ఉన్న సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని సూచించారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, సజావుగా పూర్తయ్యేలా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆర్డీవో వెన్నెల శ్రీను సూచించారు.

ఆకుతోటపల్లిలో వైసీపీ విజయదుందుభి.....!!

- 665 ఓట్ల భారీ మెజార్టీతో గంట్ల వెంకటరమణమ్మ ఘనవిజయం
- తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ఆశీస్సులతో బరిలోకి..
గ్రామ ప్రజలు వైసీపీ అభ్యర్థికి పట్టం కట్టిన వైనం
- మాజీ ఎంపీటీసీ సునీల్ దత్త రెడ్డి కుటుంబానికి ప్రజల అండ.
- తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ఆశీస్సులతో ఆకుతోటపల్లిలో వైసీపీ విజయకేతనం.
- సునీల్ దత్త రెడ్డి క్షేత్రస్థాయిలో వ్యూహం.... 665 ఓట్ల భారీ మెజార్టీతో వైసిపి సత్తా.
- గ్రామాభివృద్ధికి ప్రాధాన్యత.. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ముందుకు సాగుతామని నూతన సర్పంచ్ కుటుంబం వెల్లడి
- ఆకుతోటపల్లి ఫలితం సార్వత్రిక ఎన్నికలకు ముందస్తు సంకేతం.. తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి విజయానికి కృషి చేస్తామని స్పష్టీకరణ

శ్రీ సత్య సాయి జిల్లా ప్రతినిధి, నవంబర్ 26, అనంత జనశక్తి న్యూస్:



ఆకుతోటపల్లి గ్రామ పంచాయతీ ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి గంట్ల వెంకటరమణమ్మ ఘన విజయాన్ని నమోదు చేశారు. వైసీపీకి చెందిన మాజీ ఎంపీటీసీ సునీల్ దత్తారెడ్డి తల్లి శ్రీమతి గంట్ల వెంకటరమణమ్మ సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేసి తన సమీప ప్రత్యర్థి టీడీపీకి చెందిన రాగే సరస్వతిపై ఏకంగా 665 ఓట్ల భారీ మెజార్టీతో విజయం సాధించారు. దీంతో ఆకుతోటపల్లి గ్రామపంచాయతీపై వైసీపీ జెండా ఎగిరినట్లయింది. ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల్లో ఉత్సాహం నెలకొంది.

తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ఆశీస్సులు.. గెలుపు వెనుక బలమైన రాజకీయ అండ

ఈ విజయాన్ని రాప్తాడు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ఆశీస్సులకు అంకితం చేస్తున్నామని మాజీ ఎంపీటీసీ సునీల్ దత్తారెడ్డి, ఆయన తండ్రి శివారెడ్డి, నూతన సర్పంచ్ గంట్ల వెంకటరమణమ్మ తెలిపారు. నియోజకవర్గంలో ప్రకాష్ రెడ్డి అందిస్తున్న రాజకీయ మార్గదర్శకత్వం, ప్రజా సమస్యలపై ఆయనకు ఉన్న అవగాహన తమకు ఎంతో ధైర్యాన్ని ఇచ్చిందన్నారు. ఆయన ఆశీస్సులతోనే ఎన్నికల బరిలో నిలిచి ప్రజల విశ్వాసాన్ని చూరగొని భారీ మెజార్టీతో విజయం సాధించగలిగామని పేర్కొన్నారు.

కుటుంబానికి ఉన్న ప్రజా అనుబంధమే బలంగా మారిందా.. భారీ మెజార్టీతో ప్రత్యర్థికి చెక్

గ్రామస్థాయి ఎన్నికల్లో ప్రజలతో ఉన్న అనుబంధం, కుటుంబానికి ఉన్న పరిచయాలు, క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండే నాయకత్వం కీలకంగా మారుతాయని మరోసారి ఆకుతోటపల్లి ఫలితం నిరూపించింది. సునీల్ దత్తారెడ్డి కుటుంబానికి గ్రామంలో ఉన్న పరిచయం, ప్రజలతో ఉన్న సంబంధాలు గంట్ల వెంకటరమణమ్మకు అనుకూలంగా మారినట్లు వైసీపీ వర్గాలు పేర్కొంటున్నాయి. ప్రత్యర్థి అభ్యర్థిపై 665 ఓట్ల ఆధిక్యాన్ని సాధించడం ద్వారా ప్రజల తీర్పు ఏకపక్షంగా ఉందని వైసీపీ శ్రేణులు పేర్కొంటున్నాయి.

గెలుపు కేవలం పదవి కోసం కాదు.. గ్రామాభివృద్ధికి కొత్త బాధ్యతగా భావిస్తున్నాం

సర్పంచ్‌గా తనను గెలిపించిన ఆకుతోటపల్లి గ్రామ ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు నిరంతరం కృషి చేస్తానని గంట్ల వెంకటరమణమ్మ తెలిపారు. గ్రామంలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పన, పారిశుద్ధ్యం, తాగునీరు, రహదారులు, వీధుల అభివృద్ధి వంటి సమస్యలకు ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని బాధ్యతగా తీసుకుని ప్రతి కుటుంబానికి అందుబాటులో ఉండేలా పాలన కొనసాగిస్తానని స్పష్టం చేశారు.

పంచాయతీ గెలుపు నుంచి సార్వత్రిక ఎన్నికల దిశగా అడుగులు.. ప్రకాష్ రెడ్డి విజయానికి క్షేత్రస్థాయిలో కృషి

ఆకుతోటపల్లి గ్రామపంచాయతీ ఎన్నికల్లో సాధించిన ఈ ఘనవిజయాన్ని రాబోయే సార్వత్రిక ఎన్నికలకు ఒక రాజకీయ బలంగా మలుచుకుంటామని సునీల్ దత్తారెడ్డి కుటుంబ సభ్యులు తెలిపారు. తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ఆశీస్సులతో గ్రామాభివృద్ధికి నిరంతరం సేవలందించడంతో పాటు రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఆయన విజయానికి క్షేత్రస్థాయిలో శ్రమిస్తామని పేర్కొన్నారు. గ్రామంలో ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తూ వైసీపీకి మరింత బలమైన ప్రజా మద్దతు కూడగట్టేందుకు పనిచేస్తామని తెలిపారు.

665 ఓట్ల మెజార్టీతో ఆకుతోటపల్లి రాజకీయాల్లో కొత్త ఊపు

ఆకుతోటపల్లి పంచాయతీ ఎన్నికల్లో గంట్ల వెంకటరమణమ్మ సాధించిన 665 ఓట్ల భారీ మెజార్టీ వైసీపీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. గ్రామస్థాయి ఎన్నికల్లో నమోదైన ఈ ఫలితాన్ని వైసీపీ వర్గాలు తమకు లభించిన ప్రజా మద్దతుకు నిదర్శనంగా అభివర్ణిస్తున్నాయి. గెలుపు సందర్భంగా గ్రామ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపిన గంట్ల వెంకటరమణమ్మ, సునీల్ దత్తారెడ్డి కుటుంబ సభ్యులు ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ గ్రామాభివృద్ధి కోసం అంకితభావంతో పనిచేస్తామని తెలిపారు.



పంచాయతీ ఎన్నికల్లో 77.65 శాతం పోలింగ్

(మొదటి పేజీ తరువాయి)

మరోవైపు, కొన్ని ప్రాంతాల్లో బ్యాలెట్ బాక్సుల ధ్వంసం, బ్యాలెట్ పత్రాలను చించివేయడం, ఇంకు పోయడం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనల నేపథ్యంలో మూడు చోట్ల రీపోలింగ్ నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. పల్నాడు జిల్లాలోని బొల్లాపల్లి మండలం వెల్లటూరు గ్రామ పంచాయతీలో సర్పంచ్, ఒకటో వార్డు స్థానానికి, అదే మండలంలోని గరికపాడు గ్రామ పంచాయతీ సర్పంచ్ స్థానానికి రీపోలింగ్ జరగనుంది. అలాగే శ్రీ సత్యసాయి జిల్లాలోని కనగానపల్లి మండలం నర్సంపల్లి గ్రామ పంచాయతీలో సర్పంచ్, ఏడో వార్డు స్థానానికి కూడా మళ్లీ పోలింగ్ నిర్వహించనున్నారు. ఈ మూడు చోట్ల రేపు ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు రీపోలింగ్ జరగనుంది. ఇక, మధ్యాహ్నం 2 గంటల తర్వాత ఓట్లను లెక్కించి ఫలితాలను ప్రకటించనున్నారు..

వాళ్లు ఎప్పుడైనా కొట్టుకున్నారా?

అమరావతి, నవంబర్ 26, అనంత జనశక్తి న్యూస్

రాజకీయాల్లో ఉన్నవారికి ఆవేశం కాదు ఆలోచన ఉండాలంటున్నారు నటుడు, జబర్దస్త్ ఫేమ్ హైపర్ ఆది . ఇటీవల జరిగిన ఓ ఘటనను గుర్తు చేస్తూ ఆది ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కాకినాడ కార్పొరేషన్ ఎన్నికల ప్రచారంలో భాగంగా నిర్వహించిన సభలో ఆది జనసైనికులతో పాటుగా అన్ని పార్టీల కార్యకర్తలకు కొన్ని సూచనలు చేశారు. ఆ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇటీవల కడప జిల్లాలో జరిగిన ఘటనలో జనసేన పార్టీ కార్యకర్త ఒకరు చనిపోయారని.. ఆ ఘటన గురించి తెలిసి నేను చాలా బాధపడ్డానన్నారు. కార్యకర్తలు ఎప్పుడూ గొడవపడొద్దని కోరారు ఆది.

చంద్రబాబు, జగన్ కొట్టుకోవడం మీరు చూశారా 'ఏ రోజైనా, పొరపాటునైనా చంద్రబాబు, జగన్‌మోహన్ రెడ్డిలు ఒకరి చొక్కాలు మరొకరు పట్టుకుని కొట్టుకోవడం చూశారా. నాయకులు ఎప్పుడూ కొట్టుకోరు.. మాటల వరకు అనుకుంటారు' అని ఆది వ్యాఖ్యానించారు. కానీ కిందిస్థాయిలో కార్యకర్తలు గొడవపడి ఘర్షణకు దిగుతారని.. ఒకర్ని ఒకరు చంపుకునే ఘటనల్ని చాలానే చూశామన్నారు. రాజకీయాల్లో ఆలోచనా విధానం ఉండాలి కానీ ఆవేశం ఉండకూడదని హితవు పలికారు. 'మీరు బావుంటే



మీ ఫ్యామిలీ బావుంటుంది. ఆవేశంలో మీరు ఒకరిపై మరొకరు గొడవపడి, చంపుకోవడాలు చేయొద్దు.. మీ కుటుంబాలు ఇబ్బందుల్లో పడతాయి' అన్నారు హైపర్ ఆది.

నాగులగుట్టపల్లి పంచాయతీ ఎన్నికల్లో వివాదం

కడప జిల్లా చక్రాయపేట మండలం నాగులగుట్టపల్లి పంచాయతీ ఎన్నికల నామినేషన్లకు సంబంధించి వివాదం రేగింది. అక్కడ పరిస్థితులు ఉద్రిక్తంగా మారగా.. జనసేన పార్టీ కార్యకర్త ముంతల రామాంజులు అస్వస్థతకు గురయ్యారు.. ఆయను ఒక్కసారిగా గుండెపోటుకు కన్నుమూశారు. రామాంజులు మరణానికి పోలీసులు కారణమంటూ జనసైనికులు మృతదేహంతో ధర్నాకు దిగారు. నామినేషన్ పరిశీలనకు రామాంజులును రానివ్వకుండా అడ్డుకున్నారని.. ఈ క్రమంలో ఈ ఘటన జరిగిందని ఆరోపించారు. టీడీపీ నేతల వేధింపుల కారణంగానే ఇదంతా జరిగిందని జనసేన పార్టీ నేతలు ఆరోపించారు.

పవన్ కళ్యాణ్ దిగ్భ్రాంతి.. రూ.5 లక్షలు సాయం

జనసైనికుడు రామాంజులు మరణంపై జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయం ఆయన దృష్టికి రావడంతో స్పందించి ఘటనకు సంబంధించిన వివరాలపై ఆరా తీశారు. వెంటనే ఈ ఘటనకు సంబంధించి కారణాలను పరిశీలించి సమగ్రంగా ఓ నివేదికను అందజేయాలని ఆదేశించారు. జనసేన పార్టీ రామాంజులు కుటుంబానికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ మేరకు జనసేన పార్టీ ప్రోగ్రామ్స్ కమిటీ చైర్మన్, AP పోలీస్ హౌసింగ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ కళ్యాణం శివ శ్రీనివాసరావుకు కీలక బాధ్యతలు అప్పగించారు. ఆయన వెంటనే పులివెందులు వెళ్లారు. రామాంజులు మృతికి సంతాపం తెలిపారు.. బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5 లక్షలు సాయం కూడా అందజేశారు. రాబోయే రోజుల్లో ఆ కుటుంబానికి జనసేన పార్టీ అన్ని రకాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు శివ శ్రీనివాసరావు. ఈ ఘటనను ప్రస్తావిస్తూ హైపర్ ఆది మాట్లాడారు..కింది స్థాయిలో కార్యకర్తలు ఘర్షణకు దిగొద్దని సూచించారు.

పిల్లలకూ స్పేస్ ఎక్స్ షేర్లు ఇస్తాం
ఎలాన్ మస్క్ సంచలన ప్రకటన

ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ అమెరికాలోని ప్రతి చిన్నారికి తన అంతరిక్ష, ఏఐ సంస్థ 'స్పేస్‌ఎక్స్'లో రెండు షేర్లను ఉచితంగా ఇవ్వనున్నట్లు సంచలన ప్రకటన చేశారు. బుధవారం స్పేస్‌ఎక్స్ షేరు ముగింపు ధర 127.44 డాలర్లు. ఈ విరాళం మొత్తం విలువ దాదాపు 18 బిలియన్ డాలర్లకు (సుమారు రూ. 1.50 లక్షల కోట్లకు పైగా) చేరుకోనుంది. తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' వేదికగా మస్క్ ఈ విషయాన్ని వెల్లడించారు.

ఈ ప్రకటన ప్రకారం.. ప్రతి చిన్నారికి స్పేస్‌ఎక్స్ సంస్థ తరఫున ఒక కొత్త 'క్లాస్ ఏ' షేరు, మస్క్ వ్యక్తిగత వాటా నుంచి మరో షేరు లభిస్తాయి. 18 ఏళ్ల లోపు అమెరికన్ పిల్లలకు చిన్న వయసు నుంచే స్టాక్ మార్కెట్‌లో భాగస్వామ్యం కల్పించి, సంపద సృష్టించేందుకు ఉద్దేశించిన 'ట్రంప్ అకౌంట్' పథకం కింద ఈ షేర్లను కేటాయిస్తున్నారు. గత నెల వరకు దాదాపు 7 కోట్ల ఖాతాలు తెరిచినట్లు వైట్ హౌస్ వెల్లడించింది. స్పేస్‌ఎక్స్ సంస్థ ఇచ్చే షేర్లను వచ్చే నెలలోనే బదిలీ చేస్తామని, తన వ్యక్తిగత వాటా షేర్లను లాకప్ పిరియడ్ ముగిసిన తర్వాత వచ్చే ఏడాది జూన్‌లో అందిస్తానని మస్క్ స్పష్టం చేశారు.

సుమారు 824 బిలియన్ డాలర్ల నికర ఆస్తులు కలిగిన మస్క్ వద్ద జూన్ నాటికి 6.42 బిలియన్ల స్పేస్‌ఎక్స్ షేర్లు ఉన్నాయి. గత నెలలో స్పేస్‌ఎక్స్ అధ్యక్షురాలు గ్విన్నే షాట్‌వెల్ దంపతులు కూడా 20 లక్షల మందికి పైగా పిల్లలకు ఒక్కో షేరు ఇస్తామని ప్రకటించారు. కృత్రిమ మేధస్సు విప్లవం ద్వారా వచ్చే భారీ లాభాలను సమాజంతో పంచుకునే విషయంలో టెక్ దిగ్గజాల మధ్య భిన్నమైన వ్యూహాలు కనిపిస్తున్నాయి. ఇటీవలే పబ్లిక్ ఇష్యూకు వచ్చిన మస్క్ ప్రత్యర్థి సంస్థ 'ఆంథ్రోపిక్', ప్రజా శ్రేయస్సు కోసం 54 బిలియన్ డాలర్ల విలువైన 5 శాతం షేర్లను ప్రత్యేక నిధికి కేటాయించగా, మస్క్ నేరుగా పిల్లలకు షేర్లు అందించే మార్గాన్ని ఎంచుకున్నారు.

జెట్ ఎయిర్‌వేస్ మాజీ సిబ్బందికి ఊరట

- 2 వారాల్లోగా నేరుగా బ్యాంక్ ఖాతాల్లోకి
- రూ.480 కోట్ల గ్రాట్యుటీకి ఎన్సీఎల్ఏటీ ఓకే
- ఏడేళ్ల పోరాటం తర్వాత భారీ ఊరట

నిలిచిపోయిన విమానయాన సంస్థ జెట్ ఎయిర్‌వేస్‌లో పని చేసిన సిబ్బందికి ఎట్టకేలకు న్యాయం జరిగింది. ఏడు సంవత్సరాల పాటు అలుపెరగని న్యాయ పోరాటం చేసిన ఉద్యోగులకు భారీ ఊరటని చ్చే తీర్పు వెలువడింది. సంస్థలోని ఉద్యోగులు అందరికీ వడ్డీతో కూడిన గ్రాట్యుటీని రెండు వారాల్లోగా విడుదల చేసేందుకు నేషనల్ కంపెనీ లా అప్పిలేట్ ట్రిబ్యునల్ (ఎన్సీఎల్ఏటీ) ఆమోదముద్ర వేసింది. దీర్ఘకాలంగా తమ హక్కులు, బకాయిల కోసం ఎదురు చూస్తున్న వేలాది మంది సిబ్బందికి ఈ నిర్ణయం పెద్ద విజయాన్ని చేకూర్చింది.

ఆలస్యం కాకుండా నేరుగా ఉద్యోగుల ఖాతాల్లో జమ

ఈ చెల్లింపుల మొత్తం విలువ దాదాపు రూ.480 కోట్ల వరకు ఉంటుందని అంచనా వేస్తున్నారు. ట్రిబ్యునల్ ఆదేశాల ప్రకారం.. గ్రాట్యుటీ మొత్తాన్ని ఎలాంటి జాప్యం లేకుండా నేరుగా ఉద్యోగుల బ్యాంక్ ఖాతాల్లోకి జమ చేయాల్సి ఉంటుంది. మరోవైపు ఉద్యోగులకు చెందాల్సిన ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్) వాటాలను మాత్రం పీఎఫ్ కార్యాలయం ద్వారా సంబంధిత ఉద్యోగుల ఖాతాల్లో డిపాజిట్ చేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. దీనివల్ల సిబ్బందికి రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలు పారదర్శకంగా అందే అవకాశం ఏర్పడింది.

ఉద్యోగులకు వర్తించే గ్రాట్యుటీ, పీఎఫ్ నిబంధనల గురించి కూడా ఈ సందర్భంగా వివరంగా చర్చకు వచ్చాయి. సాధారణ నిబంధనల ప్రకారం.. ఒక సంస్థలో ఐదేళ్ల సర్వీసు పూర్తయిన తర్వాత ఉద్యోగి చివరిగా అందుకున్న జీతం ఆధారంగా గ్రాట్యుటీకి అర్హత లభిస్తుంది. ఇక ప్రావిడెంట్ ఫండ్ విషయానికి వస్తే.. ప్రతి నెలా ఉద్యోగి మూల వేతనంలో 12 శాతం ఉద్యోగి వాటాగా, మరో 12 శాతం యాజమాన్యం వాటాగా జమ చేస్తాయి. ఈ విధంగా పోగైన నిధిపై వచ్చే వడ్డీకి పన్ను మినహాయింపు లభిస్తుంది. తాజాగా ఎన్సీఎల్ఏటీ ఇచ్చిన ఉత్తర్వులకు సంబంధించిన పూర్తి వివరాలతో కూడిన ప్రతి కోసం అందరూ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

1993లో జెట్ ఎయిర్‌వేస్ సంస్థ

జెట్ ఎయిర్‌వేస్ నరేష్ గోయల్ స్థాపించారు. ముఖ్యంగా ఈ సంస్థ 1993వ సంవత్సరం మే నెలలో కేవలం నాలుగు లీజుకు తీసుకున్న బోయింగ్ 737300 విమానాలతో తన వాణిజ్య కార్యకలాపాలను ప్రారంభించింది. అంచెలంచెలుగా ఎదిగిన ఈ సంస్థ 1995లో షెడ్యూల్డ్ ఎయిర్‌లైన్ హోదాను దక్కించుకుంది. ఆ సమయంలో నాలుగు దశాబ్దాలుగా ప్రభుత్వ రంగ విమానయాన సంస్థ ఇండియన్ ఎయిర్‌లైన్స్‌కు ఉన్న దేశీయ గుత్తాధిపత్యానికి జెట్ ఎయిర్‌వేస్ బద్దలు కొట్టింది. భారత విమానయాన రంగంలో ఒకప్పుడు విశేష సేవలు అందించిన ఈ సంస్థ కార్యకలాపాలు నిలిచిపోయిన తర్వాత.. తమ బకాయిల కోసం సిబ్బంది ఏడేళ్ల పాటు చేసిన న్యాయ పోరాటంలో తాజా ట్రిబ్యునల్ ఆమోదం అత్యంత కీలక మలుపుగా, సిబ్బందికి గొప్ప ఆసరాగా నిలిచింది.

అమెరికా 25 శాతం వేస్తే..
భారత్ కూడా అదే చేయాలి!

భారత్‌తో సహా పలు దేశాలపై సుంకాలు వేయాలని అమెరికా ప్రతిపాదించింది. భారత్‌పై 25 శాతం, చైనాపై 40 శాతం సుంకాలను వేయాలని ట్రంప్ సర్కార్ భావిస్తోంది. అయితే, భారత్‌అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం కుదిరితే 17 శాతం మాత్రమే సుంకాలు విధిస్తామని, ఒప్పందం కుదరకపోతే 25 శాతం సుంకాలు విధిస్తామని అమెరికా చెబుతోంది. ఇదిలా ఉంటే, భారత్ వస్తువులపై అమెరికా సుంకాలు విధిస్తే, అమెరికా దిగుమతులపై 25 శాతం ప్రతీకార సుంకాలు విధించాలని ఛాంబర్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కోరింది. అమెరికా సుంకాల వల్ల 48 బిలియన్ డాలర్ల ఎగుమతులపై ప్రభావం పడొచ్చని, 5 లక్షల మంది ఉద్యోగాలు ప్రమాదంలోకి వెళ్లొచ్చని హెచ్చరించింది. అమెరికా ఏకపక్ష చర్యలపై ప్రతీకార చర్యలు తీసుకోవాలని కోరుతూ ప్రధాని మోదీకి లేఖ రాస్తున్నట్లు సీటీఐ ఛైర్మన్ బ్రిజేష్ గోయల్ గురువారం తెలిపారు. అమెరికా నుంచి భారత్‌కు ఆహార ఉత్పత్తులు, పానీయాలు, ఖనిజాలు, పప్పు ధాన్యాలు పెద్ద ఎత్తున దిగుమతి అవుతున్నాయి. వీటిపై భారత్ 25 శాతం సుంకాలు విధిస్తే దేశంలో అమెరికా ఉత్పత్తుల ధరలు పెరుగుతాయని, తద్వారా నష్టపోయే అమెరికా వ్యాపారులు వారి ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తారని గోయల్ వివరించారు. అమెరికా సుంకాల వల్ల భారత్ ఉత్పత్తులైన వస్త్రాలు, ఫార్మాస్యూటికల్స్, వైద్య పరికరాలు, ఎలక్ట్రానిక్స్, సీఫుడ్, రత్నాలుఆభరణాలు, తోలు, లోహాలు, ఆటో విడిభాగాల రంగాలు తీవ్రంగా దెబ్బతింటాయని వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. సుంకాల వల్ల అమెరికన్ మార్కెట్‌లో భారత వస్తువులకు ధరలు పెరిగితే, వాటికి బదులుగా వేరే దేశాలకు చెందిన వస్తువుల్ని అమెరికన్ ప్రజలు కొనుగోలు చేస్తారు.

శ్రీవారికి 121 కిలోల బంగారం
46 రకాల స్వర్ణాభరణాలు





(మొదటి పేజీ తరువాయి)

తిరుమలలో ఎలక్ట్రిక్ వాహనాలను మాత్రమే వినియోగిస్తామని స్పష్టం చేశారు. ఎల్‌నినో కారణంగా తిరుమలలో నీటి ఎద్దడి వచ్చే పరిస్థితి ఉందని తెలిపారు. 1999లోనూ ఇలాంటి పరిస్థితే వస్తే.. 49 రోజుల్లో ప్రత్యామ్నాయం ఏర్పాటు చేశామని ప్రస్తావించారు. తిరుమలలో నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారికి చెన్నైకి చెందిన ప్రముఖ దాత వర్ధమాన్ జైన్ 121 కిలోల బంగారు ఆభరణాలను విరాళంగా అందజేస్తున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఈ ఆభరణాలను సమర్పించే కార్యక్రమం జరగనుంది. స్వామివారి పాదాల నుంచి శిరస్సు వరకు అలంకరించే అన్ని రకాల ఆభరణాలతో కలిపి మొత్తం 46 రకాల బంగారు ఆభరణాలను ఆయన సమర్పించనున్నారు.

2019 నుంచి నిరంతర సేవలు.. గతంలోనూ భారీ విరాళాలు

వర్ధమాన్ జైన్ 2019 నుంచి తిరుమల శ్రీవారికి పలు రూపాల్లో భారీ విరాళాలు అందజేస్తూ వస్తున్నారు. గతంలో ఎస్వీబీసీకి రూ. 7 కోట్లు, అలాగే రూ. 5 కోట్ల విలువైన గోశాల మిక్సింగ్ ప్లాంట్, రూ. కోటి విలువైన కాయిన్స్ మెషిన్, ఎలక్ట్రికల్ బస్సులను ఆయన విరాళంగా అందించారు. అంతకు ముందు చెన్నైలోని టీటీడీ ఆలయానికి కూడా విరాళాలు సమర్పించారు.

టెక్నాలజీ, హెల్త్‌కేర్ రంగాల్లో విశేష అనుభవం

యాక్సెస్ హెల్త్‌కేర్ వ్యవస్థాపకుడు, వైస్ ఛైర్మన్‌గా వర్ధమాన్ జైన్ సేవలందిస్తున్నారు. హెల్త్‌కేర్ టెక్నాలజీ, బీపీఓ రంగాల్లో విశేష అనుభవం ఉన్న ఆయన, గతంలో డెల్ సర్వీసెస్ బీపీఓ మేనేజింగ్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. విజన్ హెల్త్‌సోర్స్ సంస్థకు సహ వ్యవస్థాపకుడిగా, ఆసియా ఇంజనీరింగ్ సంస్థకు సహ యజమాని, డైరెక్టర్‌గా ఉన్నారు. రోబోటిక్ ప్రాసెస్ ఆటోమేషన్ టెక్నాలజీలో కీలక పాత్ర పోషించడంతో పాటు ఇమేజ్ ప్రాసెసింగ్, మెడికల్ కోడింగ్ రంగాల్లో పేటెంట్లు కూడా కలిగి ఉన్నారు.

చదువు, సామాజిక సేవా కార్యక్రమాలు

లయోలా కళాశాలలో స్టాటిస్టిక్స్ పూర్తి చేసిన ఆయన, అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్‌లో కంప్యూటర్ సైన్స్‌లో మాస్టర్స్ పట్టా పొందారు. కంచి కామకోటి చైల్డ్స్ ట్రస్ట్ హాస్పిటల్ మేనేజింగ్ ట్రస్టీగా వ్యవహరిస్తున్న వర్ధమాన్ జైన్, పేద యువత నైపుణ్యాభివృద్ధి కోసం ఆవిష్కార్ సంస్థను ఏర్పాటు చేశారు. అలాగే శ్రీ సరితా జైన్ ఫౌండేషన్ ద్వారా విద్య, వైద్య సేవలు అందిస్తున్నారు.

తిరుమల శ్రీవారికి ఒక భక్తుడు.. ఏకంగా 121 కేజీల బంగారాన్ని కానుకగా ఇచ్చారు. తిరుమల చరిత్రలోనే ఇప్పటి వరకు ఇంత పెద్ద ఎత్తున కానుక ఎవరూ ఇవ్వలేదు. ఇది సరికొత్త రికార్డు. బంగారం రేటు భారీ పెరిగిపోతున్న ఈ తరుణంలో ఇలాంటి కానుక ఇవ్వడం అందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తుతుంది. దీంతో ఎవరా భక్తుడు? ఆయన బ్యాక్‌గ్రౌండ్ ఏమిటీ? అనే సెర్చింగ్ మొదలైంది.

కేజీల్లో బంగారం ఇచ్చిన భక్తుడెవరు..?

గత కొంతకాలంగా శ్రీవారికి ఈ బంగారు కానుక అందించిన భక్తుడి వివరాలు గోప్యంగా ఉన్నాయి. కానీ ఇప్పుడు వెలుగులోకి వచ్చాయి. చెన్నైకి చెందిన "వర ఫ్యూచర్ ఎల్ఎల్పీ" సంస్థ చైర్మన్ వర్ధమాన్ జైన్ ఇంత విరాళాన్ని స్వామివారికి అందించారు. వర్ధమాన్ జైన్ తన కుటుంబ సభ్యులతో కలిసి గురువారం శ్రీవారిని దర్శించుకున్నారు. ఆ తర్వాత 121 కేజీల స్వర్ణాభరణాలను సీఎం చంద్రబాబునాయుడు చేతుల మీదుగా టీటీడీ ఈవోకు అందజేయడం జరిగింది.

46 రకాల ఆభరణాలు...

స్వామివారిని కళాత్మకంగా అలంకరించేలా ఈ ఆభరణాలను తయారు చేయించారు. ఇందులో కిరీటం, శంఖుచక్రాలు, వడ్డాణం, కటి వరద హస్తాలు, పాదుకలతో సహా మొత్తం 46 రకాల ఆభరణాలు ఉన్నాయి. టీటీడీ అధికారులు, అర్చకులు, బొక్కసం అధికారుల సూచనల మేరకు వీటిని ఓ ప్రముఖ జ్యువెలరీ సంస్థతో తయారు చేయించినట్టు తెలుస్తుంది.

కంపెనీలో వాటాను అమ్మి...

వర్ధమాన్ జైన్ తన కంపెనీలో 60 శాతం వాటాను అమ్మగా వచ్చిన రూ.6000 కోట్లలో కొంత భాగాన్ని తిరుమల ఏడుకొండల స్వామివారికి అందించారు. ఈ విషయాన్ని గతంలోనే సీఎం చంద్రబాబునాయుడు వెల్లడించారు. కాగా వర్ధమాన్ అందించిన ఆభరణాలను ప్రదర్శించేందుకు ఆలయంలోని రంగనాయకుల మండపంలో ప్రత్యేక వేదికను ఏర్పాటు చేశారు.అయితే ఈ కొత్త ఆభరణాలను స్వామివారికి అభిషేకం నిర్వహించిన తర్వాత అలంకరించనున్నారు. వర్ధమాన్ జైన్ గతంలో అంటే 2025 జనవరి 19న రూ.6 కోట్లు, ఈ ఏడాది మే 16న ఓ ఎలక్ట్రిక్ బస్సును కూడా విరాళంగా అందించారని టీటీడీ అధికారులు తెలిపారు.

వర్ధమాన్ జైన్ బ్యాంక్‌గ్రౌండ్ ఇదే...

వర్ధమాన్ జైన్ చెన్నైలోని లయోలా కళాశాల నుంచి స్టాటిస్టిక్స్‌లో డిగ్రీని పొందారు. ఆ తర్వాత అమెరికాలోని ఆస్టిన్‌లోని టెక్సాస్ యూనివర్సిటీ నుంచి కంప్యూటర్ సైన్స్‌లో మాస్టర్ డిగ్రీని పొందారు. వర్ధమాన్ జైన్‌కు హెల్త్ కేర్ టెక్నాలజీ, బీపీవో, రోబోటిక్ ప్రాసెస్ ఆటోమేషన్ రంగాలలో మంచి అనుభవం ఉంది. అంతేకాదు ఇమేజ్ ప్రాసెసింగ్, మెడికల్ కోడింగ్‌లో ఆయనకు అనేక పేటెంట్లు ఉన్నట్టు సమాచారం.

అలాగే వర్ధమాన్ జైన్, హెల్త్‌కేర్ రెవెన్యూ సైకిల్ మేనేజ్‌మెంట్‌లో అగ్రగామి సంస్థ అయిన యాక్సెస్ హెల్త్‌కేర్‌కు వ్యవస్థాపకుడిగా, వైస్‌ఛైర్మన్‌గా పనిచేశారు. 2025లో ఆయన తన కంపెనీలోని 70 శాతం వాటాను ఒక అమెరికన్ సంస్థకు సుమారు రెండు బిలియన్ డాలర్లకు అమ్మేసి కార్పొరేట్ ప్రపంచంలో సంచలనం క్రియేట్ చేశారు. ప్రస్తుతం ఆయన ఏషియా (చెన్నై) ఇంజనీరింగ్ అనే సివిల్ ఇంజనీరింగ్ సంస్థకు సహాయజమాని, డైరెక్టర్‌గా ఉన్నారు, వరల్డ్ ఫ్యూచర్ ఎల్ఎల్పికి చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు.

భాగస్వామి కావడం చాలా ఆనందంగా ఉంది

తిరుమల శ్రీవారి వైభవం మాటల్లో చెప్పలేనిదని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. చెన్నైకు చెందిన పారిశ్రామికవేత్త వర్ధమాన్‌జైన్ 121 కిలోల బంగారు ఆభరణాలను సీఎం చేతుల మీదుగా తిరుమల శ్రీవారికి సమర్పించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా నిర్వహించిన మీడియా సమావేశంలో చంద్రబాబు మాట్లాడారు. ''ఎక్కడా దొరకని దివ్యానుభూతి తిరుమలలో దొరుకుతుంది. రూ.206 కోట్ల విలువైన 121 కిలోల ఆభరణాలను భక్తుడు విరాళంగా ఇవ్వడం ఒక చరిత్ర. వీటిలో 106 కిలోలతో శ్రీవారికి ఆభరణాలు, 15 కిలోలతో పద్మావతి అమ్మవారికి స్వర్ణ వస్త్రం తయారు చేశారు. ఈ మహత్తర ఘట్టంలో నేను భాగస్వామి కావడం చాలా ఆనందంగా ఉంది. భక్తి, విశ్వాసంతో ముందుకొచ్చి ఆయన విరాళమిచ్చారు. తరాలు మారినా శ్రీవారిపై భక్తి, విశ్వాసాలు కొనసాగుతూనే ఉన్నాయి. శ్రీవారి ఆభరణాల్లో పాదకవచాలు, కౌస్తుభం, నాగాభరణాలను వజ్రాలు, రత్నాలతో బ్రహ్మోండంగా డిజైన్ చేశారు'' అని చంద్రబాబు అన్నారు.

15 రోజుల పితృత్వ సెలవు
తమిళనాడు ప్రభుత్వం నిర్ణయం

- ఉద్యోగులకు అనుకూలంగా..
- ప్రసవానికి 15 రోజుల ముందు
- బిడ్డ పుట్టిన ఆరు నెలల్లోపు ఈ సెలవు వాడుకోవచ్చు

తమిళనాడులో పనిచేస్తున్న పురుష ప్రభుత్వ ఉద్యోగులకు తొలిసారిగా 15 రోజుల పితృత్వ సెలవును అమలు చేస్తున్నట్లు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సీ జోసెఫ్ విజయ్ ప్రకటించారు. ప్రసవానికి 15 రోజుల ముందు లేదా బిడ్డ జన్మించిన ఆరు నెలల లోపు ఎప్పుడైనా ఈ సెలవును తీసుకోవచ్చని ప్రభుత్వం గురువారం విడుదల చేసిన అధికారిక ప్రకటనలో వెల్లడించింది. పురుష ప్రభుత్వ ఉద్యోగుల నుంచి వచ్చిన అభ్యర్థనల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఏఎన్ఐ వార్తా సంస్థ రిపోర్ట్ చేసింది. కుటుంబ బాధ్యతల్లో భాగస్వామ్యం పెంచడం, బిడ్డ జనన సమయంలో తోడుగా నిలబడటం వంటి అంశాలు ఉద్యోగుల సంక్షేమంలో కీలకంగా నిలుస్తాయి. తమిళనాడులోని మహిళా ప్రభుత్వ ఉద్యోగులకు ప్రస్తుతం 365 రోజుల ప్రసూతి సెలవు అమల్లో ఉంది.

సెలవు నిబంధనలు, అర్హతలు

మూడో బిడ్డకు జన్మనిచ్చే మహిళా ప్రభుత్వ ఉద్యోగులకు ప్రసూతి సెలవు కాలాన్ని 12 వారాల నుంచి 365 రోజులకు పెంచుతున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టులో ప్రకటించింది. సాధారణ అర్హత నిబంధనల ప్రకారం ఇద్దరి కంటే తక్కువ మంది పిల్లలు ఉన్న రెగ్యులర్ మహిళా ఉద్యోగులకు 365 రోజుల సెలవు వర్తిస్తుందని ప్రభుత్వ వర్గాలను ఉటంకిస్తూ పీటీఐ వార్తా సంస్థ తెలిపింది. అయితే సుప్రీంకోర్టు ఆదేశాలు, ఆ తర్వాత రాష్ట్రంలో చేసిన సవరణల మేరకు ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ మంది పిల్లలు ఉన్న మహిళా ప్రభుత్వ ఉద్యోగులకు పూర్తి వేతనంతో 12 వారాల ప్రసూతి సెలవు లభిస్తుంది.

ప్రసూతి సెలవుల ప్రస్థానం ఇలా

తమిళనాడులో గతంలో 90 రోజులుగా ఉన్న ప్రసూతి సెలవు కాలాన్ని 2011లో ఆరు నెలలకు పెంచారు. 2016లో దీన్ని తొమ్మిది నెలలకు చేర్చగా, 2021 జూలైలో ఏడాదికి (365 రోజులు) పొడిగించారు. ఆయా సందర్భాల్లో అధికారంలో ఉన్న డీఎంకే, ఏఐఏడీఎంకే ప్రభుత్వాలు ఈ మార్పులు చేశాయి.

జ్యుడీషియల్ మెంబర్ తప్పనిసరి

ఈడీ ఆస్తుల జప్తుపై సుప్రీంకోర్టు కీలక తీర్పు

మనీలాండరింగ్ నిరోధక చట్టానికి సంబంధించిన 'న్యాయనిర్ణాయక సంస్థ' పనితీరుపై ఈరోజు (గురువారం) సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఈడీ జప్తు చేసిన ఆస్తుల నిర్ధారణపై విచారణ జరిపే బెంచ్‌లో జ్యుడీషియల్ మెంబర్ తప్పనిసరిగా ఉండాలని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఆ ఆస్తులపై ఏకసభ్య బెంచ్ విచారణ జరిపినా, ఆ సభ్యుడు కచ్చితంగా అన్ని న్యాయ అర్హతలూ కలిగిన జ్యుడీషియల్ మెంబర్ అయి ఉండాలని తేల్చిచెప్పింది.

అయితే 'న్యాయనిర్ణాయక సంస్థ' చైర్‌పర్సన్‌గా జ్యుడీషియల్ మెంబర్ ఉండాలన్న నిబంధన లేదని 'సుప్రీం' వివరించింది. ఈ తీర్పు భవిష్యత్తు కేసులకే వర్తిస్తుందని వెల్లడించింది. ఈ మేరకు భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీ, జస్టిస్ వి మోహనల ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. ఈ తీర్పు ప్రభావం పాత కేసులపై ఉండదని ధర్మాసనం స్పష్టం చేసింది. కేసుల సత్వర పరిష్కారం కోసం దేశవ్యాప్తంగా మరిన్ని 'న్యాయనిర్ణాయక సంస్థ'ల ఏర్పాటును పరిశీలించాలని కేంద్రానికి న్యాయస్థానం సూచించింది.





గుండెపోటు సైలెంట్‌గా వస్తుందా? ఫిట్‌గా ఉన్న వారికీ ప్రమాదమే: కార్డియాక్ సర్జన్ హెచ్చరిక

క్లీవ్‌ల్యాండ్ క్లినిక్ అంచనాల ప్రకారం, నమోదయ్యే మొత్తం గుండెపోట్లలో 22 శాతం నుంచి 60 శాతం వరకు సైలెంట్ గుండెపోట్లే ఉంటాయి. అంతేకాకుండా, మహిళల్లో, మధుమేహం ఉన్నవారిలో ఇవి ఎక్కువగా వస్తాయి. కానీ, అసలు సైలెంట్ గుండెపోటు అంటే ఏమిటి? బయటికి ఆరోగ్యంగా కనిపించే వారిని కూడా ఇది ఎందుకు ప్రభావితం చేస్తుంది?



"సాధారణంగా గుండెపోటు అంటే ఛాతీ పట్టుకుని నొప్పితో బాధపడే దృశ్యాలు మనకు గుర్తుకొస్తాయి. కానీ, సైలెంట్ గుండెపోటు ఎటువంటి స్పష్టమైన సూచనలు లేకుండా లేదా చాలా తక్కువ లక్షణాలతో వస్తుంది. వైద్యపరంగా దీనిని 'సైలెంట్ మయోకార్డియల్ ఇన్ఫార్క్షన్' అని పిలుస్తారు. ఇది సాధారణ గుండెపోటు లాగే గుండె కండరాలను దెబ్బతీస్తుంది. కానీ, చాలా కాలం వరకు గుర్తించలేం." అని డాక్టర్ హిరేమత్ అన్నారు. కొన్నిసార్లు, లక్షణాలు చాలా తేలికపాటివిగా లేదా అసాధారణంగా ఉండటం వల్ల వాటిని అలసట, ఎసిడిటీ, గ్యాస్ సమస్యలు లేదా కండరాల నొప్పిగా పొరపాటు పడతారని ఆయన అన్నారు.

యువకులు, ఫిట్‌గా ఉన్నవారు కూడా ఎందుకు సురక్షితం కాదు?

డాక్టర్ హిరేమత్ ప్రకారం, గుండె జబ్బు ఉన్నవారిని ఊబకాయులు, శారీరక శ్రమ లేనివారు లేదా వృద్ధులు అనే పాత అభిప్రాయం ఇప్పుడు మారిపోయింది. "శారీరకంగా ఆరోగ్యంగా, చురుకైన జీవనశైలి ఉన్న చాలా మంది యువకులు కూడా ఇప్పుడు గుండె



జబ్బుల బారిన పడుతున్నారు. ఒత్తిడితో కూడిన పని వాతావరణాలు, క్రమరహిత నిద్ర విధానాలు, ప్రాసెస్ చేసిన ఆహారాలు, ధూమపానం, మద్యపానం, సరైన గుండె పరీక్షలు లేకుండా చేసే అధిక జిమ్ వ్యాయామాలు అన్నీ ఈ సమస్యకు కారణమవుతున్నాయి" అని డాక్టర్ హిరేమత్ వివరించారు.

"మరో ముఖ్యమైన ప్రమాద కారకం జన్యుపరమైనది. సాధారణంగా, భారతీయులకు చిన్న కరోనరీ ధమనులు ఉండటం, మధుమేహం, కొలెస్ట్రాల్ సమస్యలు ఎక్కువగా ఉండటం వల్ల చిన్న వయసులోనే గుండె జబ్బులు వచ్చే అవకాశం జన్యుపరంగా ఎక్కువ. కాబట్టి, ఎవరైనా బయటికి ఫిట్‌గా కనిపించినా, వారి శరీరంలో సైలెంట్ ప్రమాద కారకాలను కలిగి ఉండవచ్చు" అని ఆయన స్పష్టం చేశారు.

మీరు అస్సలు విస్మరించకూడని హెచ్చరిక సంకేతాలు!

సైలెంట్ గుండెపోటుల విషయంలో కష్టమైన విషయం ఏమిటంటే, వాటికి సాధారణ గుండెపోటు లక్షణాలు



ఉండవు. "కానీ కొన్ని సూక్ష్మమైన సంకేతాలు ఉండవచ్చు. అవి: ఛాతీలో తేలికపాటి అసౌకర్యం, వ్యాయామం చేసేటప్పుడు ఆయాసం, వివరించలేని అలసట, దవడ, మెడ లేదా చేతులలో నొప్పి, కళ్ళు తిరగడం లేదా అజీర్ణం లాంటి అసౌకర్యం – వీటిని తరచుగా విస్మరిస్తాం. లేదా ప్రమాదకరం కానివిగా తప్పుగా అర్థం చేసుకుంటాం" అని డాక్టర్ హిరేమత్ అన్నారు.

"బక్కగా ఉన్నా లేదా రోజూ జిమ్‌కు వెళ్ళినా గుండె సంబంధిత సమస్యల నుండి తమను తాము రక్షించుకుంటామని చాలామంది అనుకుంటారు. కానీ శారీరక రూపం లేదా శరీరాకృతి ఎల్లప్పుడూ ధమనుల లోపల ఏమి జరుగుతుందో ప్రతిబింబించదు" అని ఆయన అన్నారు.

రెగ్యులర్ గుండె పరీక్షలు చాలా ముఖ్యం

డాక్టర్ హిరేమత్ గారి ప్రకారం, మీరు యువకులైతే, ఎటువంటి లక్షణాలు లేకపోయినా, వార్షిక ఆరోగ్య పరీక్షలు — ECG (ఎలక్ట్రో కార్డియోగ్రామ్), కొలెస్ట్రాల్ పరీక్షలు, రక్తపోటు, అవసరమైతే స్ట్రెస్ టెస్ట్ — చేయించుకోవడం వల్ల ప్రారంభ హెచ్చరిక సంకేతాలను గుర్తించవచ్చు. "కుటుంబంలో గుండె జబ్బులు, మధుమేహం లేదా అధిక రక్తపోటు చరిత్ర ఉన్న వ్యక్తులు మరింత జాగ్రత్తగా ఉండాలి. అలాగే, ఫిట్‌నెస్ అనేది సమగ్రంగా ఉండాలి – ఇందులో క్రమం తప్పకుండా వ్యాయామం, జిమ్, సమతుల్య ఆహారం, తగినంత నిద్ర, ఒత్తిడి నిర్వహణ ఉండాలి. వైద్యుల అనుమతి లేకుండా అతిగా వ్యాయామం చేయడం లేదా విపరీతమైన డైటింగ్ చేయడం మంచి కంటే హాని ఎక్కువ చేయవచ్చు" అని వారు సూచించారు.

సురక్షితంగా ఉండటానికి ఏం చేయాలి?

ముప్పు గురించి తెలుసుకోవడం, ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడం ద్వారా సైలెంట్ గుండెపోటు వచ్చే అవకాశాన్ని తగ్గించుకోవచ్చని, గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చని డాక్టర్ హిరేమత్ చెప్పారు.

చిన్న, స్థిరమైన జీవనశైలి మార్పులతో ప్రారంభించమని వారు సూచించారు. "ధూమపానం మానేయండి. ప్రాసెస్ చేసిన ఆహారం, చక్కెరను తగ్గించండి. మీ బరువును అదుపులో ఉంచుకోండి.

గొంతులో 'బ్లేడ్‌లు' పెట్టినట్లు కోస్తుంది.. కొత్త కోవిడ్ వేరియంట్ లక్షణాల్లో ఇదొకటి





ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇప్పుడు ఒక కొత్త కోవిడ్-19 వేరియంట్‌పై నిశితంగా దృష్టి పెట్టింది. గతంలో వచ్చిన మ్యుటేషన్‌ల కంటే ఇది మరింత వేగంగా వ్యాప్తి చెందుతుందని భావిస్తున్నారు. ఈ కొత్త వేరియంట్ సోకిన వారికి గొంతులో 'రేజర్ బ్లేడ్‌లు' పెట్టినట్లుగా తీవ్రమైన నొప్పి కలుగుతుందని సమాచారం.

'నింబస్' వేరియంట్ అంటే ఏమిటి?

NB.1.8.1 అనే ఈ వేరియంట్‌కు అనధికారికంగా 'నింబస్' అని పేరు పెట్టారు. ఇది ఓమిక్రాన్ వేరియంట్ కుటుంబానికి చెందినది. WHO దీన్ని 'వేరియంట్ అండర్ మానిటరింగ్ (VUM)'గా వర్గీకరించింది. జూన్ 11 నాటి సలోన్ నివేదిక ప్రకారం, ఆసియాలో నమోదవుతున్న కోవిడ్ కేసులలో 10 శాతానికి పైగా ఈ నింబస్ వేరియంట్ కేసులే ఉన్నాయట. అంతేకాదు, ఈ వేరియంట్ ఇప్పటికే అమెరికా, కెనడా వంటి పలు దేశాలలో కూడా గుర్తించినట్లు సలోన్ వెల్లడించింది.

NB.1.8.1 వేరియంట్ లక్షణాలు ఏమిటి?

ఈ నింబస్ వేరియంట్ సోకిన వారిలో ప్రధానంగా "రేజర్ బ్లేడ్ థ్రోట్" లేదా తీవ్రమైన గొంతు నొప్పి ఉంటుందని సలోన్ నివేదించింది. ఇతర లక్షణాలలో సాధారణ ఫ్లూ లక్షణాలు కూడా ఉంటాయి. వాటిలో..

ముక్కు దిబ్బడ
అలసట
తేలికపాటి దగ్గు
జ్వరం
కండరాల నొప్పి
అరుదుగా విరేచనాలు, వికారం వంటివి కూడా ఉండవచ్చు.

అయితే, WHO ప్రస్తుతానికి ప్రపంచవ్యాప్తంగా ఈ వేరియంట్ వల్ల కలిగే ప్రమాదం "తక్కువగా" ఉందని



చెబుతోంది. ఇప్పటికే ఉన్న కోవిడ్-19 వ్యాక్సిన్‌లు తీవ్రమైన వ్యాధిని నివారించడంలో సమర్థవంతంగా పనిచేస్తున్నాయని అభిప్రాయపడింది.

NB.1.8.1 గురించి మరిన్ని వివరాలు:

నింబస్ వేరియంట్ ఇతర కోవిడ్ స్ట్రెయిన్‌ల నుండి మూడుసార్లు జన్యు పదార్థాన్ని పునఃకలయిక చేసుకుందని సలోన్ తెలిపింది. నిజానికి, వైరస్‌లు మనుగడ సాగించడానికి, అభివృద్ధి చెందడానికి పునఃకలయిక ఒక సహజ ప్రక్రియే. అయితే, వైరస్ ఇలా ప్రతిసారీ పునఃకలయిక చేసుకున్నప్పుడు, అది మరింత వేగంగా వ్యాప్తి చెందే లేదా మరింత తీవ్రమైన వ్యాధిని కలిగించే సామర్థ్యాన్ని పొందే అవకాశం ఉందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆందోళన చెందాలా?

అర్కాన్సాస్‌లోని న్యూయార్క్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ క్యాంపస్ డాక్టర్ రాజేంద్రం రాజనారాయణన్ సలోన్ పోర్టల్‌తో మాట్లాడుతూ, నింబస్‌లో ఒక మ్యుటేషన్ ఉండటం వల్ల గతంలో సంక్రమణల ద్వారా మనం పొందిన రోగనిరోధక శక్తిని ఇది తప్పించుకోగలదని, కాబట్టి వ్యాప్తి కొద్దిగా ఎక్కువగా ఉండవచ్చని తెలిపారు. అత్యవసర విభాగాల్లో పెద్దగా కేసులు పెరిగినట్లు గమనించలేదని,

వేచి చూడాలని అన్నారు.

కెనడాలోని యూనివర్సిటీ ఆఫ్ గ్వెల్ఫ్ పరిశోధకుడు, జీనోమ్ జీవశాస్త్రవేత్త డాక్టర్ టి. ర్యాన్ గ్రెగొరీ మాట్లాడుతూ, "ఓమిక్రాన్ నుండి మనం నేర్చుకున్నది ఏమిటంటే, అధిక వ్యాప్తి కూడా తీవ్రమైన నష్టాన్ని కలిగిస్తుంది. ఈ సమయంలో తీవ్రమైన అనారోగ్యం మాత్రమే కాదు, పదే పదే వచ్చే ఇన్ఫెక్షన్ల దీర్ఘకాలిక ప్రభావాల గురించి కూడా ఆందోళన చెందాలి" అని అన్నారు. అలాంటి ప్రభావాలలో 'లాంగ్ కోవిడ్' వంటి పరిస్థితులు ఉంటాయి. ఇందులో కోవిడ్-19 లక్షణాలు నెలలు లేదా సంవత్సరాల తరబడి కొనసాగుతాయి. తరచుగా రోగులను బలహీనపరుస్తాయి.



తెలుగు చిత్రసీమ గర్వించేలా వృషకర్మ

ఒక అద్భుతమైన విజన్‌తో రూపొందిన 'వృషకర్మ' తెలుగు సినిమా గర్వంగా చెప్పుకునేలా ఉంటుందన్నారు నాగచైతన్య. ఆయన కథానాయకుడిగా... కార్తీక్ దండు దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రమిది. మీనాక్షి చౌదరి కథానాయిక. స్వర్ష్ శ్రీవాస్తవ ముఖ్యపాత్ర పోషించారు. బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్ నిర్మాత. ఈ చిత్రం డిసెంబరు 4న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా బుధవారం నెల్లూరులో ట్రైలర్ ఆవిష్కరణ వేడుకని నిర్వహించారు. ఐదు వేల ఏళ్ల పురాతనమైన ఒక అతీంద్రియ శక్తిని పరిచయం చేస్తూ మొదలైన ట్రైలర్ ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది.

వేడుకని ఉద్దేశించి నాగచైతన్య మాట్లాడుతూ "ఒక కొత్త ఆలోచనతో కార్తీక్ ఈ కథని రాశారు. ఎప్పుడూ చూడని విజువల్స్ ఇందులో ఉన్నాయి. తెలుగు రాష్ట్రాల నుంచి ఎంతోమంది గొప్ప దర్శకులు వచ్చి, దేశమంతా సత్తా చాటుతున్నారు. ఆ జాబితాలో కార్తీక్ చేరబోతున్నారు. మీనాక్షి, స్వర్ష్ అద్భుతమైన నటనని ప్రదర్శించారు" అని అన్నారు. ఈ కార్యక్రమంలో చిత్రబృందం పాల్గొంది.



ముత్యాల పలుకుల ఆచి

'ఆచి ఆచి' గీతంతో చిత్ర ప్రచార సందడిని షురూ చేసింది 'ఇంజి వెల్లం' (అల్లం బెల్లం) సినీ బృందం. విజయ్ సేతుపతి, సాయిపల్లవి జంటగా మణిరత్నం దర్శకత్వం వహిస్తున్న సినిమా ఇది. సుభాస్కరన్, మణిరత్నం, శివ అనంత్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ సినిమా వచ్చే ఏడాది జనవరి 29న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా చిత్రబృందం మొదటి గీతాన్ని సామాజిక మాధ్యమాల్లో విడుదల చేసింది. 'ముత్యాల పలుకులు పలికే ఆచి.. ఆచి.. నీ సన్నని నడుము ఏమైపోయింది? ఎంతో సొగసుగా వయ్యారాలొలికిస్తూ నడిచేదానివి.. నీకేమైంది! ప్రపంచమంతా ఆ నిన్నే వెతుకుతోంది.. ఎక్కడా నీ జాడ లేదు... ఇదంతా ఎలా జరిగింది చెప్పు..?' అంటూ సాగుతోందీ గీతం. ఇందులో కొత్త లుక్‌లో సాయి పల్లవి గర్భిణిగా కనిపిస్తూ.. తోటి గర్భిణీలతో సరదాగా ఆడిపాడుతూ ఆకట్టుకున్నారు. ఈ గీతాన్ని వైశాలి, శరణ్య శ్రీనివాస్ ఆలపించారు. ఇళంగో కృష్ణన్ సాహిత్యమందించారు. ఏఆర్ రెహమాన్ స్వరాలు సమకూర్చారు.



పది రోజుల్లో స్పష్టత!

'వారణాసి' సినిమాకు సంబంధించి ఏదో ఒక విషయంపై సామాజిక మాధ్యమాల్లో తరచూ చర్చ సాగుతోంది. ఆస్కార్‌ని గెలిచిన 'ఆర్ఆర్ఆర్' తర్వాత అగ్ర దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి తెరకెక్కిస్తున్న ప్రపంచస్థాయి సినిమా ఇది. తొలిసారి ఆయనతో అగ్ర కథానాయకుడు మహేశ్‌బాబు జట్టు కట్టారు. ఎన్నో విషయాల్లో ప్రత్యేకమైన ఈ సినిమా విడుదల తేదీపై ఇప్పుడు అందరిలోనూ ఉత్కంఠ నెలకొంది. వచ్చే ఏడాది ఏప్రిల్ 7న విడుదల అని ఇప్పటికే చిత్రబృందం ప్రకటించింది. అయితే ఆ తేదీ దగ్గర పడుతుండటం, ప్రచార కార్యక్రమాలు ఇంకా మొదలు కాకపోవడంతో ఈ సినిమా అనుకున్న సమయానికే వస్తుందా లేదా అనే ఉత్కంఠ మొదలైంది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం ఈ విషయంపై ఇంకో పది రోజుల్లో స్పష్టత ఇవ్వాలనే ఆలోచనలో చిత్రబృందం ఉంది. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి కాగా, ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. డిసెంబరు తొలి వారం నుంచి డబ్బింగ్ పనులు మొదలు కానున్నాయని సినీ వర్గాలు స్పష్టం చేశాయి. ఈ చిత్రాన్ని కేఎల్ నారాయణ, ఎస్.ఎస్.కార్తికేయ సంయుక్తంగా నిర్మిస్తున్నారు.



స్టార్‌హీరోకు పబ్లిక్‌గా చీవాట్లు పెట్టిన భార్య..!

బాలీవుడ్ అగ్రనటుడు అక్షయ్ కుమార్ కు పబ్లిక్‌గా చీవాట్లు పడ్డాయ్..! ఆయన భార్య ట్వింకిల్ ఖన్నా ఫోన్‌కాల్‌లో కేకలు వేశారు. ఇంతకీ విషయం ఏంటంటే..? 'కాఫీ విత్ కరణ్' షోలో భోజ్‌పురి హీరో రవికిషన్, అక్షయ్ కుమార్ పాల్గొన్నారు. వారిద్దరు హోస్ట్ కరణ్ అడిగిన ప్రశ్నలకు సరదాగా సమాధానాలు ఇచ్చి ఆకట్టుకున్నారు. ఎపిసోడ్ మధ్యలో ట్వింకిల్‌కు అక్షయ్ ప్రాంక్ కాల్ చేశారు. ఫోన్ ఎత్తడంతోనే ట్వింకిల్ కేకలు వేయడం మొదలుపెట్టారు. "అసలే రాత్రి నేను సరిగా నిద్రపోలేదు. కానీ, నువ్ పొద్దున్నే నిద్ర లేపావ్. ఉదయం ఆరుగంటలకు భజనగీతాలు ఎవరు పెడతారు..? అది చాలదన్నట్టు నువ్ గట్టిగట్టిగా పాటలు పాడుతున్నావ్. నీకు ఎన్నిసార్లు చెప్పాను. కనీసం బాత్రూమ్ డోర్ అయినా సరిగా వేసుకో అని" అంటూ అక్షయ్‌ను ఆటపట్టించారు. ఎక్కడ ఉన్నారు..? అని ఆ తర్వాత ఆమె అక్షయ్‌ని అడిగారు. తాను కరణ్ షోలో ఉన్నానని నటుడు చెప్పగా.. ఈ మధ్యే తాను ఆ షో హోస్ట్‌తో మాట్లాడానని, ర్యాపిడ్ ఫైర్ రౌండ్‌కు తనను న్యాయనిర్ణేతగా ఆహ్వానించారని ట్వింకిల్ సరదాగా మాట్లాడారు. ఆ షో కోసం అక్షయ్ డబ్బులు తీసుకోలేదని తెలిసి ఆమె ఆశ్చర్యం వ్యక్తంచేశారు. "మీరు ఈ షో ఉచితంగా చేస్తున్నారా..? నాకు షాకింగ్‌గా ఉంది" అని మాట్లాడారు. ఇక ఆ షోలో పాల్గొన్న రవికిషన్ తన వైరల్ హుక్ స్టెప్‌ను అక్షయ్‌కు నేర్పించి అలరించారు.



ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్ మళ్లీ డ్రానే..

జెనీవా: ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్ మ్యాచ్‌లో వరుసగా రెండో గేమ్ డ్రాగా ముగిసింది. బుధవారం జరిగిన రెండో గేమ్‌లో సిందరోవ్ (ఉజ్బెకిస్థాన్).. ప్రపంచ ఛాంపియన్ గుకేశ్‌ను నిలువరించాడు. కేవలం 20 ఎత్తుల్లో ఆటగాళ్లు డ్రాకు అంగీకరించారు. గుకేశ్ తెల్లపావులతో ఆడాడు. అతడు లండన్ సిస్టమ్‌తో గేమ్‌ను ఆరంభించాడు. తొలి గేమ్‌లో డ్రా చేసుకునేందుకు శ్రమించిన గుకేశ్.. రెండో గేమ్‌లో ఆరంభం రక్షణాత్మకంగా వ్యవహరించాడు. మ్యాచ్‌లో ఎలాగైనా ఫలితం రాబట్టేందుకు ప్రయత్నించే అతడు డ్రా కోసమే ఆడినట్లు అనిపించింది. ఆటగాళ్లు ప్రస్తుతం చెరో పాయింట్‌తో ఉన్నారు. 14 గేమ్‌ల పోరులో మూడోది గురువారం జరుగుతుంది. ఇందులో సిందరోవ్ తెల్లపావులతో ఆడతాడు.



ఐపీఎల్ వేలంలోకి ఆర్యవీర్

దిల్లీ: ప్రతి ఏడాది ఐపీఎల్ వేలానికి ముందు కొందరు యువ ఆటగాళ్లు చర్చకు వస్తారు. మరీ ముఖ్యంగా తమ కెరీర్ పురోగతికి ఊతమిచ్చే ఈ టోర్నీలో ఆడటం కోసం యువ క్రికెటర్లు ఎంతో ఉత్సాహంగా ఉంటారు. ఈసారీ అలాంటి యువకులు చాలానే ఉన్నారు. వారందరిలో వీరేంద్ర సెహ్వాగ్ కుమారుడు ఆర్యవీర్ సెహ్వాగ్ ముందు వరుసలో ఉన్నాడు. ఇటీవల సూపర్ ఇన్నింగ్స్‌లతో అందరి దృష్టిని ఆకర్షించిన అతడు.. రాబోయే ఐపీఎల్ సీజన్ వేలంలో పాల్గొనబోతున్నాడు. డిసెంబరు 16న గోవా వేదికగా జరగనున్న ఈ మినీ వేలంలో అతడు భారత అన్‌క్యాప్‌డ్ ఆటగాళ్ల జాబితాలో ఉన్నాడు.

ఇటీవల అండర్-19 ఆసియాకప్‌లో 361 పరుగుల (5 ఇన్నింగ్స్‌ల్లో)తో 'ప్లేయర్ ఆఫ్ ద టోర్నమెంట్'గా నిలిచిన ఆర్యవీర్ కోసం ఫ్రాంచైజీల మధ్య పోటీ తప్పకపోవచ్చు. అతడు రూ.30 లక్షల కనీస ధరతో వేలంలోకి రానున్నాడు. అండర్-19 ఆసియాకప్ ఫైనల్లో పాకిస్థాన్‌పై వీరోచిత ఇన్నింగ్స్‌తో భారత్‌ను గెలిపించిన మోహిత్ ఉల్వా కూడా ఇదే విభాగంలో అదృష్టం పరీక్షించుకోబోతున్నాడు. వెటరన్ పేసర్ ఇషాంత్ శర్మ, నితీశ్ రాణా రూ.50 లక్షల కనీస ధరతో అన్‌క్యాప్‌డ్ విభాగంలో నమోదు చేసుకున్నారు. ఇప్పటికే వీళ్లు వందకుపైగా ఐపీఎల్ మ్యాచ్‌ల్లో బరిలో దిగినప్పటికీ.. టోర్నీ నిబంధనల ప్రకారం అయిదేళ్లుగా అంతర్జాతీయ స్థాయిలో ఆడని ప్లేయర్లు ఈ విభాగంలోనే వేలానికి రావాలి. మన్‌దీప్ సింగ్, మయాంక్ మార్కండే, నవ్‌దీప్ సైని, చేతన్ సకారియా కూడా అన్‌క్యాప్‌డ్‌గానే నమోదు చేసుకున్నారు.



వైభవ్ విధ్వంసం చూసి టీ20 మ్యాచ్ అనుకొన్నా

యూఏఈపై వైభవ్ సూర్యవంశీ బ్యాటింగ్ విధ్వంసం చూసి యూనివర్స్ బాస్ క్రిస్‌గేల్ అవాక్కయ్యాడంట. ఇటాలియా టీ10 టోర్నీ ఆడుతున్న అతడు ఈ విషయాన్ని స్వయంగా వెల్లడించాడు. "నాడు (మంగళవారం) నా ఫోన్ అదే పనిగా మోగుతోంది. ఏమైందా అనుకొన్నా. ఆ తర్వాత వైభవ్ విధ్వంస ద్విశతకం గురించి ఎవరో చెప్పారు. నేను చూస్తే 12 ఓవర్లలో డబుల్ సెంచరీ అయినట్లుంది. టీ20 గేమా..? అని అన్నాను. కాదు.. అది వన్డే మ్యాచ్ అన్నారు. నేను ఒక్కసారిగా ఆశ్చర్యంతో.. 'ఏంటీ.. దీనిబట్టి వన్డేలో త్రిబుల్ సెంచరీ కూడా ఖాయం. ఈ కుర్రాడు ఆట స్వరూపాన్నే మార్చేస్తాడు' అని అన్నా. అతడికి అవకాశాలు వస్తాయని ఆశిస్తున్నా. అతడి ప్రతిభ మసకబారకూడదని కోరుకుంటున్నా. మనం అతడిని మరిన్ని మ్యాచ్‌ల్లో చూడాలనుకొంటున్నాం" అని గేల్ తెలిపాడు. యూఏఈని ఎదుర్కొని ఈ పరుగులు చేశాడు కదా అని తేలిగ్గా అనుకోవడానికి వీల్లేదని గేల్ అభిప్రాయపడ్డాడు. ప్రత్యర్థి ఏ జట్టు అయినా.. ఆ స్థాయి హిట్టింగ్ చాలా కష్టమన్నాడు.



టెస్టుల్లో తొలి ఆటగాడిగా రికార్డు

సౌతాఫ్రికా క్రికెటర్ వియాన్ ముల్డర్ అరుదైన రికార్డు నెలకొల్పాడు. టెస్టుల్లో ట్రిపుల్ సెంచరీ చేయడంతోపాటు ఏడు వికెట్లు సాధించిన తొలి ఆటగాడిగా ఘనత సాధించాడు. బంగ్లాదేశ్‌తో జరిగిన రెండో టెస్టు సెకండ్ ఇన్నింగ్స్‌లో వియాన్ ముల్డర్ 11 ఓవర్లు వేసి 31 పరుగులే ఇచ్చి ఏడు వికెట్లు పడగొట్టాడు. 2025లో జింబాబ్వేతో జరిగిన టెస్టులో ముల్డర్ అజేయంగా 367 రన్స్ చేశాడు. దీంతో సుదీర్ఘ ఫార్మాట్ చరిత్రలో ఇప్పటి వరకు ఏ ఆటగాడు సాధించని ఫీట్‌ను నమోదు చేశాడు. అంతేకాకుండా బంగ్లాతో జరిగిన రెండో టెస్టులో ఫస్ట్ ఇన్నింగ్స్‌లో ముల్డర్ (100; 178 బంతుల్లో) బ్యాటింగ్‌లోనూ ఆకట్టుకున్నాడు. ఈ క్రమంలో ఒకే మ్యాచ్‌లో సెంచరీతోపాటు ఏడు వికెట్ల ఘనత సాధించిన ఐదో ప్లేయర్‌గా నిలిచాడు. బంగ్లాదేశ్‌తో రెండో టెస్టులో సౌతాఫ్రికా ఇన్నింగ్స్, 219 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. దీంతో రెండు మ్యాచ్‌ల సిరీస్‌ను సఫారీలు 2-0 తేడాతో క్లీన్‌స్వీప్ చేశారు. ఆ జట్టు పేసర్లు మార్కో యాన్సెన్ (3/17), కాగిసో రబాడ (3/23), నోకియా (2/10)ల ధాటికి తొలి ఇన్నింగ్స్‌లో 91 పరుగులకే బంగ్లాదేశ్ కుప్పకూలింది. తొలి ఇన్నింగ్స్‌లో సౌతాఫ్రికా 494/7 వద్ద డిక్లేర్ చేసింది. రెండో ఇన్నింగ్స్‌లో బంగ్లాదేశ్ 184 పరుగులకు ఆలౌటైంది. తాజా విజయంతో డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో సౌతాఫ్రికా అగ్రస్థానాన్ని (77.78 శాతం) మరింత పటిష్టం చేసుకుంది. మరోవైపు.. బంగ్లాదేశ్ ఐదో స్థానం నుంచి ఆరో స్థానానికి పడిపోయింది.

PRINTER, PUBLISHER AND OWNED BY S VENKATESULU,D. NO. : 4/38, MAIN ROAD, SETTUR, ANANTHAPURAMU, ANDHRA PRADESH 515767. Place of Publication # MIG 5, KANDRIKA ROAD, PAYAKAPURAM NEW RAJIV NAGAR, VIJAYAWADA (CITY & POST), VIJAYAWADA., N T R, ANDHRA PRADESH 520015. EDITOR : SHANKARAGALLU VENKATESULU. Printing Press .GOKUL PUBLICATIONS D. NO. : 4/10/19, AMBAKAPALLI ROAD, PULIVENDLA, Y.S.R., ANDHRA PRADESH 516390. Email: ananthajanasakshi2019@gmail.com, Cell: 9533633213, RNI REGD NO :APTEL/26/A8939